అపరాధ పరిశోధన

రూ.7.50 డిసెంబర్ '87



Blank Page

సంపుటి: 45
సంచిక: 5

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

డిసెంబరు, 1987

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్‌రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-231

[ఫలితాలు]

అక్టోబరు '87 నెల "అపరాధ పరిశోధన పోటీ-231" కి సరియైన సమాధానాలు:

1. గవాస్కరు.
2. హెల్మెట్లు.
3. అల్లంపల్లి.
4. జాతరలు.
5. జయవర్ధనే

పై జవాబుల ప్రకారం ఒక్కరు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెల నుండి ఒకఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి గ్రహీత:—

శ్రీ ఇల్లూరు ఉపేంద్ర,
మర్చంట్,
లక్షంపల్లె పోస్టు
పెద్ద వొడుగూరు—మండలం,
(అనంతపురం జిల్లా.)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. మరణ దండన—జొన్నలగడ్డ రామలక్ష్మి

22. ప్రత్యర్థులు—కె.వి.యస్.ఎన్. మూర్తి

38. విష వలయంలో ప్రియురాళ్ళు—వసుంధర

57. గరళకంఠుడు—దివాకర్ల సన్యాసిరాజు

74. జలసమాధి (మినీ సీరియల్)—వి.యస్. రావ్

112. అమానుష హత్యలు—డి.వి.వి. సత్యనారాయణ

128. హత్య ఖరీదు—ఎమ్.డి. చైతన్య

137. మొరగని కుక్క—వీలూ

173. మిస్ మిస్టరీ (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. విచిత్రవధ—వి.యస్. రావ్

51. దేవుడే నా డిటెక్టివ్—వసుంధర

88. గొప్పవాడు—గొట్టిపాటి నాగేశ్వరరావు

166. ఎడారి కోయిల (సీరియల్)—బొమ్మిరెడ్డి అచ్చారావు

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

మరణ దండన

జొన్నలగడ్డ రామలక్ష్మి

విశాలమైన ఆ హాల్లో వైభవంగా విందు జరుగుతోంది.

ఆ విందులో పుర ప్రముఖులందరూ ఉన్నారు.

విందు నిస్తున్నది సామాన్యుడుకాదు. ఎమ్మెల్యే గోవిందు.

చాలామంది డబ్బు సంపాదించడంకోసం ఎమ్మెల్యే

కావాలనుకుంటారు. కొందరు మాత్రం సంపాదించిన డబ్బును రక్షించుకునేందుకు రాజకీయాల్లో దిగుతారు.

గోవిందు రెండోరకం మనిషి.

చాలామంది డబ్బు సంపాదించడానికి నలుగురికీ తెలిసిన మామూలు పద్ధతులే ఎన్నుకుంటారు. చాలాకొద్ది మంది మాత్రం ఏమైనా చేసి డబ్బు సంపాదిస్తారు. అంటే డబ్బు సంపాదించడంకోసం వారేమైనా చేయగలరు.

గోవిందు రెండోరకం మనిషి.

చాలామంది డబ్బు సంపాదించడానికితరుల తెలివిపై ఆధారపడి డబ్బుచేరాక—ఆ యితరుల్నంతం చేస్తారు. కొందరుమాత్రం ఇతరుల ప్రమేయం లేకుండా స్వంత తెలివిపై ఆధారపడి డబ్బు సంపాదిస్తారు.

గోవిందు రెండోరకం మనిషి.

ఈపై కారణాలవల్ల గోవిందు సమాజంలో ఒకటో రకం మనిషిగా చెలామణీ అవుతున్నాడు.

గోవిందు చేసే ప్రతిపని వెనుకా పెద్ద పథకముంటుంది. ఇప్పుడాయన పురప్రముఖులందర్నీ పిలిచి విందు చేస్తున్నాడు. వచ్చినవారిలో అన్ని రాజకీయ పక్షాలవారూ ఉన్నారు. పత్రికా ప్రముఖులు కూడా వున్నారు.

విందుకేదో పెద్ద కారణమే ఉంటుందని అంతా చెప్పుకుంటున్నారు. ఆ కారణ మెప్పుడు తెలుసుకుంటామా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

వారెదురు చూస్తున్న సమయం రానేవచ్చింది.

అందర్నీ ఉద్దేశించి గోవిందు చెప్పిన మాటల సారాంశమిది:

ఒక్కగానొక్క కూతురాయనకు. పేరు భారతి. తన

దేశభక్తి ప్రతిబింబించాలని ఆయన కూతురికా పేరు పెట్టుకున్నారు.

భారతి అల్లారు ముద్దుగా పెరిగింది. చిన్నతనంనుంచీ ఆదర్శాలనే భోంచేసింది. ఆమె యిప్పుడు పద్దెనిమిది సంవత్సరాల యువతి. బియ్యే చదువుతోంది.

భారతి నవీన్‌ను ప్రేమించింది.

నవీన్ అన్నివిధాలా సామాన్యుడు. అతడికి తల్లీతండ్రీ లేరు. అన్నా చెల్లీ లేరు. ఇతరుల ఆదరణలో పెరిగి పెద్దవాడై బియ్యే ప్యాసయ్యాడు. ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా తన సంపాదన తను చూసుకుంటున్నాడు. తీరిక సమయాల్లో ట్యూషన్లు చెబుతూంటాడు. కొన్ని పత్రికలకు రిపోర్టరుగా పనిచేస్తున్నాడు. కరెస్పాండెన్సు కోర్సులో ఎమ్మే చదువుతున్నాడు.

నవీన్ నేటి యువతరానికి ఆదర్శం. ఉద్యోగానికి ప్రభుత్వంమీద ఆధారపడకుండా తన కాళ్ళమీద తాను నిలబడ గలిగినవాడు. భారతివంటి గొప్పింటి పిల్లతో పరిచయమైతే అవకాశం తీసుకుని ప్రయోజనం పొందాలనుకోలేదు. ఆమెను హెచ్చరించాడు. ప్రేమకు అంతస్థులున్నాయనీ అవే ముఖ్యమనీ అన్నాడు.

ప్రెస్ రిపోర్టరుగా అతడు కాలేజీలో భారతికి పరిచయమయ్యాడు. ఆమె అతడి వివరాలు తెలుసుకుని అతణ్ణి తన ట్యూషన్ టీచరుగా నియమించుకుంది. క్రమంగా అతణ్ణి ప్రేమించింది.

భారతి వయసు వేడిలో ప్రేమించలేదు. నవీన్ వ్యక్తిత్వం ఆమె నాకర్షించింది. తమ వివాహాని కంతస్థు లడ్డుగోడ అవుతాయని తెలియగానే ఆమెలోని ఆదర్శాలామెను సవాలు చేశాయి.

"ఏమైనాసరే—నవీన్‌ని పెళ్ళిచేసుకుని నా ఆదర్శాలు నిలబెట్టుకోవాలి—" అనుకుందామె.

భారతి జాప్యం చేయకుండా తండ్రికి విషయం చెప్పింది.

గోవిందు విషయం విని ఆవేశపడలేదు.

ఆయన రాజకీయాల్లో ప్రముఖుడు కావచ్చు. కానీ తండ్రిగా సామాన్యుడు. కూతురి భవిష్యత్తు గురించాయన ఎన్నో కలలు కంటున్నాడు. కూతురికి వరుడిగా నవీన్ వంటి వాణ్ణాయన ఊహించలేదు. నవీన్‌తో ఆమె సుఖ పడలేదని ఆయన నమ్మాడు.

అందుకే కూతురికి నచ్చ జెప్పాడు.

భారతి వినలేదు.

తర్వాత గోవిందు నవీన్‌ని పిలిచి హెచ్చరించాడు.

"నా పరిమితులు నాకు తెలుసు. మీరేంచెబితే అది చేస్తాను. భారతి అంటే నా కిష్టమే! ఆమె సుఖపడు తుందంటే ఆమెకు దూరంగా ఉండాలనుకునేటంత యిష్టం—" అని నవీన్ చెప్పాడు.

అతడి నిజాయితీ గోవిందును ముగ్ధుణ్ణి చేసింది. అతడి వ్యక్తిత్వం ఆయన్ను మెప్పించింది.

కొన్నాళ్ళపాటు గోవిందు నవీన్‌ను జాగ్రత్తగా గమ నించాడు.

అప్పుడాయన కో పెద్ద విశేషం తెలిసింది.

తను సామాన్యుడుకాదు. ప్రజా ప్రతినిధి! ఏ ప్రజలకు తను ప్రతినిధిగా వుంటున్నాడో, ఏ ప్రజలు తనను విశ్వ సించి ప్రతినిధిని చేశారో - వారిలో ఎక్కువ భాగం పేద వారు.

నవీన్ అంతస్థు నవమానిస్తే అది తను ప్రజల నవ

మానించినట్టే అవుతుంది.

భారతి నవీన్‌ని ప్రేమించి తన కళ్ళు తెరిపించింది.

నవీన్ వ్యక్తిత్వం తన అహాన్ని దెబ్బతీసింది.

వారిద్దరికీ వివాహం జరిపిస్తే అది గొప్ప విశేషమే అవుతుంది.

ప్రజా ప్రతినిధిగా తనే ప్రజలకాదర్శంగా నిలబడితే - అది ప్రజల ఆలోచనల్లో మంచి మార్పును తీసుకుని రావచ్చు.

నవీన్ అంతస్థులో చిన్నవాడు. సాటి కులంవాడు కాదు.

ఇంతకాలం గోవిందు బాగా డబ్బు సంపాదించాడు. సంపాదించిన డబ్బుతో ప్రజాసేవ చేయాలనుకున్నాడు. రాజకీయాల్లో ప్రవేశించాడు. ఆదర్శాలతో ప్రజల ఆలోచనలు మార్చాలని ఆయనకు స్ఫురించనే లేదు.

మామూలుగా తన కూతురి వివాహం జరిపిస్తే లాభం లేదు. ఈ విషయాన్ని ముందుగా ప్రకటించాలి.

"ఇదొక గొప్ప విశేషమని నేననుకోవడం లేదు. ప్రజల ఆలోచనల్లో మార్పు రావడంకోసం—ఇలాంటి విశేషాలకు కొంతకాలం పాటు విపరీతమైన పబ్లిసిటీ అవసరం. ఆ తర్వాత కొంత కాలానికి ఇలాంటివి మామూలు విషయాలై పోతాయి. అలా జరగాలనే నా కోరిక-" అంటూ ముగించాడు గోవిందు.

హాలు చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

భారతి, నవీన్ అక్కడున్న వారందరికీ పరిచయం చేయబడ్డారు.

నవీన్ సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. అతడి కళ్ళలో చురుకుతనముంది. అంతకు మించిన ప్రత్యేకతేమీ లేదు.

భారతి మాత్రం అక్కడ అప్సరస్త్రీలా వెలిగిపోతోంది. చిన్నప్పట్నించే ఎండకన్నెరుగని సుకుమారి ఆమె. అన్ని కాలాల్లోనూ అన్నిరకాల పళ్ళనూ తింటూ పెరిగిన శరీరం ఆమెది. ఆమెను చూస్తుంటే - శరీరంలో ప్రవహిస్తున్న రక్తం కనిపిస్తుంది. ఆమె కట్టిన దుస్తులు విలువైనవే అయినా ఆ విలువ ఆమె ధరించడంవల్ల వచ్చిందా అనిపిస్తుంది.

నవీన్ భారతికి తగ్గ వరుడిలా లేడని నా కనిపించింది. ఈ విషయం ముందే చెప్పాను భారతికి.

"నేనంటే నీకు వెర్రి అభిమానం. ఈ ప్రపంచంలో నాకు తగ్గవాళ్ళెవ్వరూ లేరని నువ్వనుకుంటావు. అది సహజం. కానీ నవీన్ నా ఎన్నిక. అతణ్ణి అవమానిస్తే నా ఎన్నిక నవమానించినట్లు...." అంది భారతి అప్పుడు.

నే నింకేమీ అనలేదు.

భారతి పుట్టినప్పుడు నాకు పదహారేళ్ళు. నాకు పన్నెండేళ్ళప్పుడు మానాన్న నన్ను గోవిందుకి అప్పజెప్పాడు. నాకు చదువు రాలేదు. అల్లరి చిల్లరిగా తిరుగుతూండే వాణ్ణి. నన్ను వంచాలని నాన్న గోవిందుకి అప్పజెప్పాడు.

గోవిందు నన్ను వంచలేదు. నా దుడుకు స్వభావాన్నాయన ఉపయోగించుకుని - క్రమంగా నన్నో గూండాగా తయారు చేశాడు.

నేను గోవిందుకి అంగరక్షకుణ్ణి. ఇంకా చెప్పాలంటే పర్సనల్ గూండాని.

గోవిందు అంటే నాకెంతో యిష్టం. ఆయన నా స్వభావాన్నెప్పుడూ తప్పుపట్టలేదు. పైగా ప్రోత్సహించాడు. మంచి చెడ్డల్ని విచారించి చెబుతూ నా బుద్ధిని

పెంచేవాడు తప్ప - నన్నెప్పుడూ నిందించలేదు.

భారతి పుట్టేక యింట్లో నే నామెతోనే ఎక్కువగా కాలక్షేపం చేసేవాణ్ణి. ఆమె మీద యీగను కూడా వాల నిచ్చేవాణ్ణి కాదు.

ఇరవయ్యో ఏట నేను ప్రేమలో పడ్డాను. ఆ పిల్ల పేరు సుబ్బులు. సుబ్బులు తండ్రికి నేనంటే యిష్టం లేదు. గోవిందు కారణంగానే మాపెళ్ళి జరిగింది. పెళ్ళయ్యాక సుబ్బులు తండ్రిమాట విననందుకు బాధ పడింది. నా స్వభావం దానికి నచ్చలేదు. నా పద్ధతులు మార్చాలని విఫల యత్నాలుచేసి చివరికి రాజీ పడింది. అలాగని సుబ్బులు కష్టపడిందీ లేదు. నే నెప్పుడూ దాని మీద చెయ్యి చేసుకోలేదు. తిండికి గుడ్డకి - ఏ లోటూ చేయలేదు.

నా కిద్దరు కొడుకులు. ఇద్దరూ యిప్పుడు హైస్కూల్లో చదువుతున్నారు. వాళ్ళను నాకులా తయారుచేయకూడదని సుబ్బులు పట్టుదల. భారతి వాళ్ళకు ప్రత్యేకంగా శిక్షణ యిస్తూంటుంది. నా పెద్దకొడుకు భారతికంటే ఏడేళ్ళు చిన్న.

భారతి అందమైనది కావడంవల్ల కాలేజీలో కొన్ని సమస్యలు తలెత్తవలసిందే! గోవిందు పలుకుబడిని మించి నా ఉనికి ఎక్కువమందికి భయపెట్టడంవల్ల-ఎవ్వరూ భారతి జోలికి వెళ్ళేవారు కాదు. అయితే చిన్న అనుమానంమీద కనీసం ముగ్గురికైనా నేను దేహశుద్ధి చేశాను.

నవీన్ భారతి ఎన్నిక:

భారతి ఎన్నోసార్లు సుబ్బుల్ని వెనకేసుకొచ్చి నా ఆలో చనల్ని మార్చడానికి ప్రయత్నించింది. ఆమె మాటల్లో ఏదో నిజముందనే అనిపించినా — ఒప్పుకోవాలనీ అని

పించేది కాదు. ఆచరించాలనీ అనిపించేదికాదు.

"నేను నిన్ను మార్చలేను. పెళ్ళయ్యాక నిన్ను నాతో తీసుకుని పోతాను. నవీన్ తప్పకుండా నిన్ను మార్చ గలడు. అసలు నిన్ను మార్చాలనే నవీన్‌ను పెళ్ళిచేసుకో వాలనుకున్నాను" అంది భారతి ఒకసారి.

అప్పుడు నాకు కోపంకూడా వచ్చింది.

అయితే భారతి తండ్రి కోపాన్నే లెక్క చేయదు.

ఎన్నోసార్లు ఆమె తండ్రినే తప్పుపట్టింది.

"నువ్వు ఆదర్శాలతో వ్యాపారం చేస్తున్నావు. సామా న్యుల్ని దోచుకుంటున్నావు. నిన్ను నమ్మినవారిని వెన్ను పోటు పొడుస్తున్నావు" అంటూ ఆమె తండ్రిని హెచ్చ రించేది. ఒకసారి ఆమె "నవీన్ నిన్ను సంస్కరిస్తాడు. అందుకే అతణ్ణి పెళ్ళిచేసుకుంటున్నాను" అని తండ్రికి చెప్పింది.

సంస్కరించబడాలని నాకు లేదు. గోవిందుకి ఉందని నేననుకోను. కానీ ఆయన భారతి కోర్కెకు తలవంచాడు.

ఇప్పుడేం జరుగుతుంది? గోవిందు సంస్కరించబడితే-ఆయనతోపాటు నేనూ సంస్కరించబడాలా?

2

ఆ గదిలో నేను, గోవిందు—ఇద్దరే ఉన్నాం.

తలుపులు లోపల్నుంచి నేనే గడియవేశాను.

అప్పుడు రాత్రి పన్నెండయింది. విందెప్పుడో అయి పోయింది. అంతా నిద్రలో ఉండి ఉంటారు.

"భారతి నవీన్‌ల పెళ్ళి జరగబోతోంది. నవీన్ మీద నీ అభిప్రాయ మేమిటి?" అన్నాడు గోవిందు.

"నవీన్ నాకు నచ్చలేదు-" అన్నాను.

"నాకూ నచ్చలేదు-" అన్నాడు గోవిందు.

"మరి విందులో మీరిచ్చిన ఉపన్యాసం?" అన్నాను.

"అది పబ్లిసిటీ కోసం...."

"ఎందుకు?"

"నవీన్ ప్రెస్ రిపోర్టరుగా పనిచేస్తున్నాడు. వాడికి చాలా పత్రికలతో పరిచయముంది. భారతికీ వాడికీ పెళ్ళి జరక్కపోతే నాకు చెడ్డ ప్రచారం వస్తుంది. నాలో విశాల భావాలు లేవని పత్రికలు రాస్తాయి...."

"అయితే?"

"పార్టీలోనే నా కిద్దరు శత్రువులున్నారు. ఎగస్పార్టీ వాళ్ళేమో నామీద దెబ్బతీయాలని చాలా రోజులుగా చూస్తున్నారు. నా కూతురి ప్రేమ నాకు ప్రాణాంతక మవుతుంది...."

"అయితే నవీన్‌ని బెదిరించి చూడలేకపోయారా?"

"బెదిరించడ మెందుకు? ఆ అవసరం లేకపోయింది. వాడీ పెళ్ళికోసం తపించి పోవడంలేదు. అంతా అమ్మాయి పట్టుదల....వాడు నేనేం చెప్పినా చేస్తానన్నాడు...."

"మరి ఈ హడావుడంతా ఎందుకు చేశారు?"

"వాడు బ్రతికుండగా ఈ పెళ్ళి ఆగకూడదు. భారతి అన్నింటికీ నన్నే అనుమానిస్తుంది. అదో సమస్య. రెండో దేమిటంటే—నవీన్ ఎంత మంచిగా మాట్లాడినా నాకు వాడిమీద నమ్మకం కుదరడం లేదు. మనసులో ఒక టుంచుకుని పైకింకేదో చెప్పేవాళ్ళు చాలామంది ఉంటారు. అలాంటి వాళ్ళలో నేనూ ఉంటాను...."

"అయితే యింకేం చేయాలి?"

"ఏం చేస్తాం - నవీన్ని చంపేయాలి."

ఉలిక్కిపడి గోవిందు వంక చూశాను.

ఆయన చాలా తాపీగా అన్నాడా మాటలు. ఆయన

ముఖంలో కలవరపాటు కానీ, ఉద్విగ్నత కానీ కనిపించడం లేదు.

అప్పటికి నేను మూడు హత్యలు చేశాను. హత్యలు చేయడం నాకు తప్పనిపించదు.

ఆకలివేస్తే మేకను చంపి తింటాం. మన పనికి అడ్డువస్తే ఓ మనిషిని చంపిపారేస్తాం. అంతే!—అని నా అభిప్రాయం.

నవీన్ని చంపడం నాకు కష్టమైన పని కాదు. నా మనసుకు నచ్చని పనీ కాదు. కానీ అతణ్ణి చంపడం అనవసరమని నా కనిపిస్తోంది. అదే చెప్పాను.

"అది నేను చూసుకుంటాను. నేను చెప్పినట్లు చేయి" అన్నాడు గోవిందు.

"నవీన్ని చంపాలనుకున్నప్పు డీ హడావుడంతా ఎందుకు చేశారు?" అన్నా నాశ్చర్యంగా.

"అదంతా రాజకీయం."

"కానీ ఎందుకో ఈ హత్యవల్ల మీకు చెడ్డపేరొస్తుందని భయంగా ఉంది నాకు. అసలు మీ ఉద్దేశ్యమేమిటో నాకు చెప్పండి...."

"ఇలా ఎప్పుడూ అడగలేదు నువ్వు...." అన్నాడు గోవిందు కోపంగా.

"భారతి నాకు ప్రాణంతో సమానం. ఈ చేతులతో పెంచా నామెను. ఆమె మనసుకు కష్టం కలిగితే భరించలేను. ఆ భారతికి నవీన్ ప్రాణం. ఉత్తపుణ్యాన నవీన్ని చంపి భారతికి మనసు కష్టపెట్టలేను. అతణ్ణి చంపడం వల్ల మీకు చెప్పుకోతగ్గ ప్రయోజనముందని నేను నమ్మాలి. అప్పుడే మీరు చెప్పిన పని చేస్తాను."

గోవిందు నా కళ్ళలోకి చూసి నా దృఢ నిశ్చయాన్ని

గమనించినట్లున్నాడు. "సరే - నీకు చెప్పడానికి భయ మెందుకు?" అన్నాడు.

భారతి ప్రేమలో తప్పంతా ఆమెదే! నవీన్‌కి దురాశ లేదు. గోవిందు అంటే భయం కూడా వుంది. కానీ భారతి అతడికి తన ప్రేమ గురించి వెంటనే చెప్పలేదు. తన ప్రేమ గురించి తండ్రికి కూడా తెలియకుండా జాగ్రత్త పడింది.

భారతికి తండ్రి మంచితనం మీద నమ్మకం లేదు. ఆమె నవీన్‌ను తను ప్రేమిస్తున్నానని తండ్రికి చెప్పి "ఇప్పుడు నవీన్ కేదయినా అయితే నేను నిన్నే అనుమా నిస్తాను. నవీన్ లేకుండా నేను బ్రతకలేను" అని చెప్పింది.

భారతి తన్ననుమానించకుండా ఉండాలనే గోవిందు ఈ హడావుడంతా చేశాడు. ఇంత హడావుడి చేశాక గోవిందే నవీన్ని చంపిస్తాడని ఎవరూ అనుకోరు. భారతి కూడా తండ్రి ననుమానించడానికి సంకోచిస్తుంది.

"అయినా చంపదల్చుకున్న మనిషి గురించింత హడా వుడి చేయడం నాకు నచ్చలేదు" అన్నాను.

గోవిందుకి సంబంధించిన రహస్యాలెన్నో తెలియడం వల్ల నాకాయన దగ్గర బాగా చనువు.

"అసలు సంగతి తెలిస్తే నా రాజకీయం నీ కర్థమవు తుంది...." అన్నాడు గోవిందు.

ఎగస్పార్టీలో గోవిందుని దెబ్బ తీయాలని గట్టి ప్రయ త్నాలు జరుగుతున్నాయి. అతడి పార్టీలోనే ఇద్దరు ప్రత్యర్థులున్నారు. వారి కారణంగా గోవిందుకు మంత్రి అయ్యే అవకాశం అలా అలా వెనక్కి పోతోంది.

గోవిందు స్వార్థపరుడనీ, ప్రజల కోసం పైసా కూడా

త్యాగం చేయని పదహారణాల వ్యాపారి అనీ పార్టీ ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారు.

వచ్చిన యిబ్బంది ఏమిటంటే ఆ ప్రచారం చాలా వరకూ నిజం. రాజకీయ నాయకులకు నిజం ప్రచారం కావడమంత దురదృష్టం వేరే ఉండదు.

ఇప్పుడు నవీన్‌ని చంపించి ఆ నేరం పార్టీ ప్రత్యర్థుల మీదకు నెట్టివేస్తే........?

గోవిందు చేసిన విందు - ఆయన నవీన్ కిచ్చిన ప్రాముఖ్యత....అతనికి కూతురిపై ఉన్న ప్రేమ....ఇవన్నీ కలిసి అందరికీ ఆయనపై సానుభూతిని పెంచుతాయి.

విందు చేయకపోతే నవీన్ గురించి ఎవరికీ తెలియదు. నవీన్ చావుకి ప్రాముఖ్యత నివ్వడం కోసమే - గోవిందు విందు చేశాడు.

"భారతి నన్నపార్థం చేసుకోదు. నా పార్టీ ప్రత్యర్థులు నా మీద నేరారోపణలు మాని తమ నేరానికి సంజాయిషీ యిచ్చుకోవాలి. ఎగస్పార్టీవాళ్ళు మర్యాదకైనా నామీద సానుభూతి చూపకపోతే - నేరం వారిమీదకు వెడుతుంది. నవీన్ పీడ నాకు శాశ్వతంగా విరగడవుతుంది - చూశావా ఎన్ని ప్రయోజనాలో?"

నేను గోవిందుకి సాష్టాంగ నమస్కారం చేశాను.

3

రహస్యంగా ప్రవేశించడానికి నవీన్ యిల్లంత సులభమైనదుండదు.

అతడుంటున్నది రెండు గదుల చిన్న యిల్లే కాపీ యింటికో పక్కగా విశాలమైన ఆవరణ ఉంది. ఆవరణ చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ ఉంది. ఆ ఆవరణలో పెద్ద యిల్లు కట్టాలని ఇంటి యజమాని అనుకుంటున్నాడు.

కానీ స్థలం కోర్టు గొడవల్లో ఉండటంవల్ల అది వాయిదా పడుతోంది.

వెనుక నుంచి ప్రహరీగోడ దూకి వెళ్ళనవసరం లేదు. అక్కడో దొడ్డి తలుపుంది. అది చాలా సులభంగా తెరుచుకుని దొడ్లో ప్రవేశించవచ్చు. అప్పుడెవరి కళ్ళా పడకుండా ఇంటి తలుపు తట్టవచ్చు.

అదే చేశాను నేను.

నవీన్ ఇంట్లోనే ఉన్నాడు కానీ తలుపు తీయడానికి కాసేపు పట్టింది.

అరవై ఏళ్ళ వృద్ధుడి మారువేషంలో ఉన్నాను నేను.

లోపల అడుగు పెడుతూనే గోవిందు పార్టీ ప్రత్యర్థుల పేరు చెప్పి - నేను వారి మనిషి నన్నాను.

నవీన్ ప్రెస్ రిపోర్టరుగా పని చేస్తూండటంవల్ల అతడికీ రాజకీయాల్లో ప్రముఖుల పేర్లన్నీ తెలుసు. అతడు నా వయసును గౌరవిస్తూ వినయంగా మాట్లాడి ఆసనం చూపించి-వచ్చిన పనేమిటని అడిగాడు.

"తలుపులు వేసిరా బాబూ! చాలా రహస్యం-" అన్నాను.

అతడు తలుపులు వేసివచ్చి నా కెదురుగా కూర్చున్నాడు.

"నువ్వు గోవిందు కూతురు భారతిని పెళ్ళిచేసుకోకు. ఆమె చరిత్ర మంచిది కాదు. అందుకు నాదగ్గిర ఋజువులున్నాయి. నువ్వు భారతిని కాదని పబ్లిగ్గా - గోవిందు కుటుంబాన్నవమానిస్తే నీకు లక్షరూపాయలు ముడతాయి. లేదా నీ ప్రాణాలు పోతాయి" అన్నాను.

అలా బెదిరిస్తూ వ్రాసిన ఉత్తరమొకటి నా జేబులో ఉంది. హత్యానంతరం గదిలో వదిలేసి పోవాలనుకుంటు

న్నాను.

నవీన్ డబ్బుకాశపడలేదు. భారతి చరిత్రపై తన కెటు వంటి అనుమానమూ లేదన్నాడు. తనకు భారతి చరిత్రతో నిమిత్తం లేదన్నాడు.

కాసేపు వాదన జరిగేక నేను కత్తితీశాను.

నవీన్ కంగారు పడ్డాడు.

"ఎవరు నువ్వు? నన్నెందుకు చంపుతావు?" అన్నా డతడు.

"నీ చావు గోవిందు కుటుంబంలో చిచ్చు పెడుతుంది. జీవితాంతం గోవిందు కుటుంబం కుమిలి కుమిలి ఏడ్వా లన్నది నా ఆశయం...."

"ఆయనపై పగ ఉంటే అది నా మీద తీర్చుకోవడం అన్యాయం."

"ఆయన్ను చంపడం సులభంకాదు. నిన్ను చంపడం సులభం. అయినా ఆయన్ను చంపితే పగ తీరదు. నిన్ను చంపితే ఆయన ఏడుస్తూంటే అప్పుడే నా పగ తీరు తుంది...."

"ప్లీజ్—నన్ను చంపకు...." అన్నాడు నవీన్.

"నాకు మూడ్ వచ్చింది. నా చేతిలోకి కత్తి వచ్చింది. ఇప్పుడు నువ్వు భారతిని పెళ్ళిచేసుకోనని చెప్పినా నిన్ను వదలను. కళ్ళు మూసుకుని దైవప్రార్థన చేసుకో" అన్నాను.

నవీన్ పారిపోయేందుకు ప్రయత్నించాడు.

నేనతణ్ణి ఒడిసి పట్టుకుని—"పారిపోయే ప్రయత్నం చేస్తే చిత్రవధ చేస్తాను. బుద్ధిగా మంచంమీద పడుకుని కళ్ళు మూసుకుని దైవప్రార్థన చేసుకో. సునాయాసంగా

నీ ప్రాణాలు తీయగలను" అన్నాడు.

నవీన్ గింజుకుంటున్నాడు. అతడిలో ప్రాణభయం మొదలయింది.

నేనిక జాప్యం చేయదల్చుకోలేదు. కత్తిని పైకెత్తాను.

వీలున్న చోటల్లా పొడిచి అతణ్ణి చంపితే రక్తం నా వళ్ళంతా చిమ్ముతుంది. నా చేతులకు గ్లౌస్‌వున్నాయి కాబట్టి వేలిముద్రల భయంలేదు. అనవసరంగా రక్తం వళ్ళంతా చేసుకోవడమెందుకు?

నేనాలోచిస్తూండగానే—నవీన్ నా చేతుల్లోంచి జారి కిందపడ్డాడు. భయంతో అతడికి స్పృహతప్పినట్లుంది.

నేనతణ్ణి వెల్లకిలా పడుకోబెట్టి చొక్కా బొత్తాలు విప్పాను. కత్తిని సూటిగా గుండెల్లోకి బలంగా దింపితే వెంటనే ప్రాణం పోతుంది.

నవీన్ ప్రతిఘటించే స్థితిలో లేడు. ఇది నాకు మంచి అవకాశం.

కత్తిని పైకెత్తాను.

"ఆగు!" అన్న స్వరం వినిపించింది.

ఆశ్చర్యపడ్డాను. ఇంట్లో నవీన్ కాక మరో మనిషుండ వచ్చునని నే నూహించలేదు.

తలెత్తి చూస్తే ఎదురుగా భారతి!

"అతణ్ణి చంపకు—నీ పగంతా గోవిందుమీద కదా! నన్ను చంపి నీ పగ తీర్చుకో?" అందామె.

భారతి నన్ను గుర్తుపడితే మొత్తం పథకమంతా బెడిసి కొడుతుంది. అందుకే వెనక్కుతగ్గి — "ఎవర్నువ్వు?" అన్నా నేమీ ఎరుగనట్లు. గొంతు బొంగురుగా మార్చాను.

"నేను భారతిని. గోవిందు కూతురిని...." అందామె.

"నేను ఆడవాళ్ళను చంపను" అన్నాను.

భారతి నా మెత్తదనాన్ని గుర్తించి ప్రతిమాలడం మొదలెట్టింది.

"ఇతణ్ణి నేను చంపితీరాలి...."

"ఒకరోజు నాకు టైమివ్వు. నీకతణ్ణి చంపాల్సిన అవసరం లేకుండా చేస్తాను" అంది భారతి.

"ఎలా?" అన్నాను.

"ఒక్కరోజు టైము చాలు నాకు, ఎలాగని అడక్కు!" అంది భారతి.

నాకు తెలుసు. భారతి జరిగింది తండ్రికి చెప్పి నవీన్ రక్షణ కల్పించమంటుంది. అదీ ఒకందుకు మంచిదే!

నవీన్‌పై హత్యాప్రయత్నం జరిగిన విషయమంతా ప్రచారంలోకి వస్తుంది. నాటకం మరింత రక్తికడుతుంది.

"సరే—ఒక్కరోజు టైమిస్తాను. అంతకు మించి క్షణంకూడా అదనంగా యివ్వలేను" అన్నాను. భారతి మాట కాదనడమెలా?

4

రాత్రి నాకు వళ్ళుతెలియని నిద్ర పట్టింది. నన్ను కుదిపి కుదిపి నిద్రలేపింది సుబ్బులు.

"ఏమిటీ?" అన్నాను విసుగ్గా.

"ఇప్పటికి నాలుగుసార్లు నిద్రలేపాను. లేవడంలేదు నువ్వు"

"ఏమిటీ హడావుడి?" అన్నాను.

"అయ్యగారు చచ్చిపోయారు...."

నా నిద్రమత్తు విడిపోయింది. సుబ్బులు జరిగింది చెప్పింది.

ఒకరాత్రివేళ టెలిఫోన్ వచ్చింది. గోవిందు పార్టీ ప్రత్యర్థులాయన్ను ఫోన్ చేసి బెదిరించారు—నవీన్‌ని చంపేస్తామని! నవీన్‌ని బతికించుకోడానికాయన ఏదో అవినీతికి పాల్పడాలి. ఆయనకు వేరే దారి కన్పడినట్లు లేదు. రోజూ ఓ నిద్రమాత్ర వేసుకుని పడుకునే అలవాటుందాయనకు. రాత్రి ఎక్కువ నిద్రమాత్రలు వేసుకుని పడుకున్నారు. నిద్రలోనే ప్రాణం పోయింది.

'దీనికి పరిష్కారం నేను చూస్తాన్లే అమ్మా!' అని ఆయన కూతురుకి చెప్పాట్ట. కానీ ఇదీ పరిష్కారమని ఆమె ఊహించలేదు.

నేనాశ్చర్యపోయాను. అంటే ప్రత్యర్థులు నిజంగానే రంగంలోకి దిగారన్నమాట. మేమనుకున్నదే వాళ్ళు చేశారన్న మాట .... ఇదంతా గోవిందుకి ముందే తెలుసా?

నా బుర్రలో ఎన్నో ప్రశ్నలు!

గోవిందు ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు?

"అవతల పోలీసులు నిన్ను పిలుస్తున్నారు. వెళ్ళి వారి ప్రశ్నలకు జవాబు చెప్పు" అంది సుబ్బులు.

నేను గోవిందు ఇంట్లోకి వెళ్ళాను.

అప్పటికి అన్ని పరీక్షలూ అయిపోయాయి. గోవిందు ఆత్మహత్య చేసుకున్నాడన్న నిర్ణయానికి వచ్చేశారు పోలీసులు.

నన్ను వాళ్ళు మామూలు ప్రశ్నలే వేశారు. ఇందులో వాళ్ళు నన్ననుమానించడానికేమీ లేదు.

భారతి బాగా దుఃఖంలో ఉంది.

పోలీసులు వెళ్ళాక నేనామె నోదార్చాను.

నన్నామె ఓ గదిలోకి పిల్చింది. వెళ్ళాను.

ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి. మొహం ఉబ్బి పోయింది.

"ఇన్నాళ్ళూ—నేను నీకెన్నో నీతులు చెప్పాను. ఇన్నాళ్ళకు నాకూ నీనుండి నేర్చుకునే విశేషం కనిపించింది—"

"హత్యచేయడం తప్పుకాదు—మన నమ్మకాని కది అవసరమైతే!"

తండ్రిపోయిన దుఃఖంలో ఆమె ఏం మాట్లాడుతుందో నాకు తెలియలేదు.

"ఊఁ" అన్నాను.

"తప్పుకాదన్నాను గదా అని నవీన్‌ని హత్య చేయాలనుకోకు. పీకిక ఆ హత్య చేయాల్సిన అవసరంలేదు—" అనేసి వెళ్ళిపోయింది భారతి.

షాక్ తిన్నాను.

అంటే భారతి నిన్న సాయంత్రం నన్ను గుర్తించిందన్నమాట....

అయితే?

నిన్నరాత్రి పార్టీ ప్రత్యర్థులనుంచి గోవిందుకి ఫోన్ వచ్చిందన్న విషయం అబద్ధమా? అందుకిద్దరే సాక్షులు. ఒకరు గోవిందు. ఆయన జీవించిలేడు. రెండు భారతి....

గోవిందు ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడూ అన్న ప్రశ్నకు నాకు సమాధానం లభించింది.

"హత్యచేయడం తప్పుకాదు"— అన్న భారతి మాటలు నా చెవుల్లో గింగురుమంటున్నాయి. □

ప్రత్యర్థులు

కె.వి.యస్.యన్.మూర్తి



ఊయ్యాల బల్లమీద పడుకుని ఠీవిగా చుట్ట కాలుస్తోన్నాడు సుబ్బరాజు.

ఆయన మనసు ఆ రోజు చాలా ఉల్లాసంగా వుంది. కూతురికి సంబంధం సెటిలయ్యింది. కొడుక్కి మెడిసన్‌లో

సీటొచ్చింది. రెండు వార్తలూ ఒకదాని తరువాత మరోటి వచ్చి అతడిని ఉక్కిరిబిక్కిరి చేసేశాయి.

చుట్టపొగను రింగులు రింగులుగా వదులుతూ నెమ్మదిగా ఉయ్యాల వూగుతోన్నాడు సుబ్బరాజు.

అప్పుడే పాలగ్లాసు తీసుకుని లోపలకు వచ్చింది సుందరమ్మ. భర్తను పిలవబోయి అలానే నిలబడి పోయింది.

గుమ్మందాకా వచ్చి నిలబడిపోయిన భార్యను ఆశ్చర్యంగా చూసి "అలా నిలబడిపోయావేం? ఇటురా!" అన్నాడు సుబ్బరాజు.

ఆమె ఉలకలేదు పలకలేదు. మనిషి సన్నగా వణుకుతోంది. ఆమె మొహంమీద చిరు చెమటలు కమ్ముకున్నాయి.

"ఏమయిందే? అలా అయిపోతోన్నావు?" సుబ్బరాజు కంఠం తీవ్రంగా వుంది.

అయినా ఆమె మాట్లాడలేదు. ఇంటి కప్పుకేసి బెదురుతూ చూస్తోంది.

సుబ్బరాజుకు యేదో అనుమానం వచ్చింది. ఒక్కసారి యింటి కప్పువయిపు చూశాడు. అంతే—అతడికి గుండాగిపోయినంత పనయింది. ఉయ్యాలబల్ల వ్రేలాడుతోన్న దూలంమీద ఐదున్నర అడుగుల పొడవున్న గోధుం త్రాచొకటి వ్రేలాడుతోంది. జిమ్నాస్టిక్స్ చేస్తూన్నట్లు పైకీ క్రిందికీ జారుతోంది.

ఒక్క క్షణం సుబ్బరాజుకి కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఏం చెయ్యాలో పాలుపోలేదు. క్రిందకు దూకితే ప్రమాదం. ఆ అదుటికి పాము క్రింద పడుతుంది. మీద పడినా పడొచ్చు. అందుకే కదలకుండా వుండిపోయాడు.

సుందరమ్మ అయితే భర్తను కాపాడమని, ఆ సుబ్బారాయుడికి మొక్కుకుంది. షష్టికి బంగారు కళ్ళూ, పడగలూ యిస్తానని దండం పెట్టుకుంది.

దూలంమీది పాము దాదాపు తోక వరకూ జారిపోయింది.

సుబ్బరాజు వళ్ళంతా చెమటతో తడిసిపోయింది.

సుబ్బరాజు పిరికివాడేం కాదు. స్వతహాగా ధైర్యస్థుడు. కానీ ప్రస్తుతం, అతడున్న పరిస్థితి అటువంటిది. అందుకే దైవంమీద భారం వేసి కళ్ళు మూసుకున్నాడు.

ఇంక క్రింద పడిపోతుంది—అన్న సైముకు పాము మళ్ళీ దూలంమీదకు చేరుకుంది. నెమ్మదిగా పాక్కుంటూ వెళ్ళిపోయింది.

"బ్రతుకు జీవుడా!" అంటూ హాయిగా వూపిరి పీల్చింది సుందరమ్మ.

సుబ్బరాజు మాత్రం చాలా కంగారు పడిపోయాడు. వెంటనే పనివాడిని పిల్చి, పాముల మంగికి కబురెట్టాడు.

అరగంటయినా అవకుండా పాములమంగి తన సరంజామాతో సుబ్బరాజు యింటికి చక్కా వచ్చింది. సరంబీ ఎక్కి అటకంతా గాలించింది. ఎక్కడా పాము జాడ కనిపించలేదు. ఈలోగా సుబ్బరాజుగారు గుమాస్తాగారిని తీసుకువచ్చాడు.

గుమాస్తాగారికి ఆ ఊళ్ళో చాలా పేరుంది. మొదటి నుండీ ఆయన పేరు గుమాస్తాగారే. ఆయన అసలు పేరు యెవరికీ తెలియదు. మొదట్లో ఆయన పెదకాపు ధాన్యం మిల్లులో గుమాస్తాగా పని చేసేవాడు. తేలుకులకీ, నొప్పులకీ మంత్రాలు వేసేవాడు.

ఒకసారి పెదకాపుగారి తల్లిని పాము కరిచింది. నోటంట నురుగులు రావటంతో ఆమెను బయట పెట్టేశారు. ఇక చనిపోతుందని అందరూ నిశ్చయానికి వచ్చేశారు. సరిగ్గా అటువంటి పరిస్థితులలో గుమాస్తాగారు, ఆమెకు మంత్రం వేశాడు. అంతే—ఆవిడ లేచి కూర్చుంది.

అప్పటి నుండీ గుమాస్తాగారి దశ తిరిగిపోయింది. అందరూ చందాలు వేసుకుని ఆయనకు చక్కటి యిల్లు కట్టించి యిచ్చారు. ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలకు ఆయన మంత్రాల గుమాస్తాగా స్థిరపడిపోయాడు.

"ఇదివరకు యెప్పుడయినా మీరు దాన్ని చూశారా?" అడిగాడు గుమాస్తా.

"లేదండి. ఈవాళే చూడ్డం" వినయంగా సమాధానం చెప్పాడు.

గుమాస్తా కళ్ళు మూసుకున్నాడు. రెండు నిముషాలు యేవేవో మంత్రాలు చదివాడు. తరువాత కళ్ళు తెరిచాడు. "ఏం ఫర్వాలేదు. చోళ్ళు తెప్పించండి. మంత్రించి యిస్తాను. అలానే కచిక కూడా యివ్వండి. విభూతి తయారుచేస్తాను" అన్నాడు.

సుబ్బరాజు లోపలకు వెళ్ళి చోళ్ళూ, కచికా తెచ్చాడు.

గుమాస్తా చోళ్ళను మంత్రించి యిల్లంతా చల్లాడు. కొన్ని చోళ్ళు సుబ్బరాజుకు యిచ్చి, "వీటిని గుడ్డకు చుట్టి మెళ్ళో కట్టుకోండి" అన్నాడు. సుబ్బరాజు వాటిని మౌనంగా అందుకున్నాడు.

తర్వాత కచికతో విభూతి తయారుచేశాడు. "ఇంకేం ఫర్వాలేదు. ధైర్యంగా వుండండి" అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

నాలుగురోజులు గడిచేసరికి యీ సంఘటనను అంతా మరచిపోయారు.

2

"నాన్నా! నాన్నా!" అంటూ హడావుడిగా పరుగెట్టు కొచ్చాడు రామరాజు. అతడి చేతిలో టెలిగ్రామ్ కాగితం వుంది

కొడుకు కంగారును చూసి సుబ్బరాజు నవ్వుకున్నాడు. "ఏమైందిరా?" అన్నాడు ఆప్యాయంగా.

"చిన్నాన్న టెలిగ్రాం యిచ్చాడు...." అంటూ చేతిలోని కాగితాన్ని ముందుకు చాపాడు రామరాజు.

"ఏమంటాడు?" అన్నాడు సుబ్బరాజు.

"అర్జంటుగా బయలుదేరి వచ్చెయ్యమన్నాడు" అన్నాడు రామరాజు ఆయాసపడిపోతూ.

"నిన్ననేగదరా నేను వెళ్ళొచ్చాను. మళ్ళీ యింతలోనే తొందర యేమిటి?" అన్నాడు సుబ్బరాజు.

రామరాజుకయితే ఏనుగెక్కినంత సంబరంగా వుంది. తనకు మెడిసన్ సీటు రావటం, చిన్నాన్న దగ్గిర తన చదువూ, అంతా అతనికి కలలా వుంది. అందుకే తండ్రి అడిగిన ప్రశ్న అతనికి వినిపించనేలేదు.

సుబ్బరాజు కొడుకు పడుతోన్న కంగారును పసిగట్టాడు. "సరే! ఎప్పుడు బయలుదేరుతావు....?" అన్నాడు.

"ఎప్పుడో ఎందుకు నాన్నా? యిప్పుడే వెళ్ళిపోతాను" అన్నాడు రామరాజు.

సుబ్బరాజు చిన్నగా నవ్వాడు. "లేడికి లేచిందే వేళని. ఇప్పుడు ఎలా వెళతావు? చీకటి పడిపోతోంది."

"ఎంతో అవసరం అయితేగాని చిన్నాన్న టెలిగ్రాం

యివ్వడు కదా నాన్నా!....” గారాలుపోయాడు రామ రాజు.

“సరే నీ యిష్టం!....” అని భార్యను పిలిచాడు సుబ్బ రాజు.

విషయం తెలుసుకుని సుందరమ్మ ఆశ్చర్యపోయింది. “అదేంట్రా మరీ యింత తొందరా?” అంది.

“వాడికేం అడ్డు చెప్పకు! బయలుదేరనీ!” అన్నాడు సుబ్బరాజు.

“మరిదిగా రింటికి వట్టి చేతులతో పంపుతామా? కొంచెం మినప సున్నయినా చుట్టనీండి! పిల్లలకు యిష్టం” అంది.

“సరే! యేదో ఒకటి తొందరగా కానియ్! లాస్ట్ బస్ కయినా వాడిని పంపిద్దాం!” అన్నాడు సుబ్బరాజు.

“సరే!” అంటూ లోపలకు వెళ్ళింది సుందరమ్మ. పక్కింటి పిన్నిగార్నీ. ఆవిడ కోడల్నీ సహాయానికి పిలి చింది. సున్నుండలు గుమగుమలాడుతూ తయారవుతో న్నాయి.

ఈలోగా సుబ్బరాజు డబ్బు గురించి బయటకు వెళ్ళి వచ్చాడు.

రామరాజు బట్టలు సర్దుకొన్నాడు.

సాయంత్రం అయిదు గంటలు దాటింది.

సుబ్బరాజు కొడుక్కి చెప్పాల్సినవన్నీ చెప్పాడు. అక్కడ యెలా మసలుకోవాలి, చిన్నాన్ననూ, చిన్నమ్మనూ ఎలా గౌరవించాలి, పిల్లలతో ఎలా కలిసిపోవాలి, ఇత్యాదు లన్నీ బోధించి చుట్ట వెలిగించాడు.

ఈలోగా సుందరమ్మ కొడుకును లోపలకు పిలిచింది.

“ఏంటమ్మా?” అంటూ లోపలకు వెళ్ళాడు రామ

రాజు.

"ఒరేయ్! అటక మీద రెండు ఖాళీ బిస్కట్ డబ్బా లున్నాయి తీసిపెట్టు" అంది సుందరమ్మ.

"సరేనమ్మా!" అంటూ అటక ఎక్కాడు రామరాజు.

రెండు నిముషాల తరువాత "అమ్మోయ్! బాబోయ్!" అంటూ అరవటం మొదలు పెట్టాడు.

ఆ అరుపులకు హాల్లో వున్న సుబ్బరాజు లోపలకు పరుగెట్టుకు వచ్చాడు. "ఏమయిందిరా?" అంటూ నిచ్చెన మీద నుండి అటక ఎక్కాడు. అక్కడి దృశ్యం చూసి అతని దవడ కండరాలు బిగుసుకొన్నాయి. కనుగుడ్లు ఎర్ర రంగుకు తిరిగాయి.

రామరాజు అటక మీద పడిపోయి వున్నాడు. అతడి కళ్ళు మూసుకుపోయి వున్నాయి. అతడికి పదడుగుల దూరంలోంచి గోధుమ్రతాచు బరబర పాకి వెళ్ళిపోతోంది.

ఆ పాము కేసి నిప్పులు కక్కుతూ చూశాడు సుబ్బ రాజు. కానీ ప్రస్తుతం తను దాన్నేమీ చెయ్యలేడు. ముందు కొడుకు ప్రాణాల్ని దక్కించుకోవాలి. అందుకే సుబ్బరాజు కొడుకుని భుజానికి ఎత్తుకొన్నాడు. గబ గబా నిచ్చెన దిగాడు. పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ బయ టకు వచ్చాడు. రెండెడ్ల బండి మీద కొడుకును పడుకో బెట్టి గుమాస్తా యింటికి ఎడ్లను పరుగు తీయించాడు.

అదృష్టంకొద్దీ బండి వెళ్ళేసరికి గుమాస్తా యింటి దగ్గరే వున్నాడు.

రామరాజును అరుగు మీద పడుకోబెట్టమన్నాడు.

వేపరొట్ట తెప్పించి మంత్రం వెయ్యటం మొదలు పెట్టాడు.

విషయం తెలిసి వూరు వూరంతా అక్కడ పోగుపడి

పోయింది. సుందరమ్మని అయితే ఎవరూ ఓదార్చలేక పోతోన్నారు. "పాపిష్టిదాన్ని. వీడిని అటక ఎక్కించాను. లేకపోతే వీ డీపాటికి బస్సులో వుండాల్సింది" అంటూ వాపోయిం దావిడ.

సుబ్బరాజు కయితే వుక్రోషం ఆగటంలేదు. చెట్టంత కొడుకుని పొట్టన పెట్టుకోబోయిన గోధుం త్రాచును తలచుకుంటే చాలు, అతని అరికాలి మంట నెత్తికి ఎక్కుతోంది. అసలు నాగుపాముల జాతినే నాశనం చేసెయ్యాలనేంత కోపం వచ్చేస్తూం దతనికి.

దాదాపుగా నాలుగు గంటల నుండి మంత్రాలు వేస్తూన్నా రామరాజు కోలుకోలేదు.

"ఇక అతని పని సరి" అనుకొన్నా రందరూ.

రాత్రి పదిగంట లవుతుందనగా రామరాజు కొద్దిగా కదిలాడు. గుమాస్తా మొహంలో సంతోష రేఖలు కనిపించాయి.

సుబ్బరాజు సంతోషమయితే అంతా యింతా కాదు.

మరోగంటలో రామరాజు లేచి కూర్చున్నాడు.

గుమాస్తా అతని చేతికి ఒక పచ్చి మిరపకాయ యిచ్చి "దీన్ని కొరుకు" అన్నాడు.

రామరాజు పచ్చిమిరపకాయను కొరికాడు.

"కారంగా వుందా?" అడిగాడు గుమాస్తా.

లేదన్నట్లు తలూపాడు రామరాజు.

"అయితే తియ్యగా వుందన్న మాట!" అంటూ మళ్ళీ మంత్రించటం మొదలు పెట్టాడు గుమాస్తా.

మరో పావు గంట పోయాక మళ్ళీ మిరపకాయ యిచ్చి కొరకమన్నాడు.

ఈసారి 'నోరంతా కారం' అంటూ గోల చేశాడు

రామరాజు.

"విషం పూర్తిగా దిగిపోయింది" అని చెప్పి, పై తుండు తీసి రామరాజు కళ్ళచుట్టూ తిప్పి ముడి వేశాడు గుమాస్తా.

సుబ్బరాజు అతడికి రెండు చేతులూ ఎత్తి దండం పెట్టాడు.

గుమాస్తా అతడిని మందలించి "ఇక మీ వాడిని కాపాడుకోవాల్సిన పూర్తి బాధ్యత మీ మీద వుంది. రాత్రంతా అతడు నిద్రపోకుండా జాగారం చెయ్యాలి. లైటు చూడకూడదు. పొగ అతడి దగ్గరకు రాకూడదు" అంటూ చెప్పాడు.

సుబ్బరాజు అన్నింటికీ తల పూపి రామరాజును తీసుకుని యింటికి బయలుదేరాడు.

రాత్రంతా రామరాజుతోపాటు ఆ గ్రామంలో చాలా మంది జాగారం చేశారు. అతడిని చీకటి గదిలో పెట్టి, అతడి చుట్టూ జనం చేరి అతడి చేత మాట్లాడించారు. మరీ చేదస్తం మనుషులు అతని వంటి మీద గిచ్చటం మొదలు పెట్టారు. అలా ఎవరయినా గిచ్చినపుడు రామరాజు బాధగా 'అమ్మో' అనేవాడు. అతడు అలా అనగానే గిచ్చిన మనిషి సంతృప్తిగా తలాడించేవాడు. పాము కరచిన బాధకన్నా రామరాజుకు ఈ బాధ ఎక్కువయిపోయింది.

ఎలాగయితేనేం తెల్లవారింది.

రామరాజు పూర్తిగా కోలుకొన్నాడు.

అందరూ హాయిగా వూపిరి పీల్చారు.

రామరాజయితే ప్రయాణం ఆగిపోయిందని తెగ బాధపడిపోయాడు.

"వెధవ ప్రయాణం పోతే పోయింది. ఇవాళ కాక పోతే రేపయినా వెళ్ళొచ్చు. మనిషివి దక్కావు. అంతే చాలు" అంటూ అతడికి ధైర్యం చెప్పాడు సుబ్బరాజు.

3

ఉదయం ఏడు గంటలయింది.

దొడ్లో నూతిగట్టు దగ్గర కూర్చుని సుబ్బరాజు పళ్ళు తోముకుంటోన్నాడు. రాత్రంతా నిద్రలేకపోవటం వలన అతడి కళ్ళు ఎర్రగా వున్నాయి. మనిషి బాగా నీరసంగా వున్నాడు.

"బాగా పొద్దెక్కిపోయింది. పొలం వెళ్ళాలి" అనుకుంటూ పైకి లేవబోయాడు సుబ్బరాజు.

అంతలోనే అతడి దృష్టి నూతి చపటాకు ఆనుకొని వున్న అరటి చెట్ల పయిపు మళ్ళింది. అక్కడ దృశ్యం చూసి సుబ్బరాజు కోపంతో కంపించిపోయాడు.

అరటి బోదెను ఆనుకుని చిన్న కప్ప నిలబడి వుంది.

దాన్ని భక్షించటానికి దానికి కొంచెం దూరంలో గోధుం త్రాచు పొంచి వుంది.

సుబ్బరాజు నెమ్మదిగా చప్పుడు చెయ్యకుండా లేచాడు. అడుగులో అడుగు వేసుకుంటూ యివతలకు వచ్చాడు.

అక్కడ కొబ్బరి చొలుపు గునపం భూమిలో పాతి వుంది. దాన్ని పయికి తీసి నూతి దగ్గరకు వచ్చాడు సుబ్బరాజు.

పాము దృష్టి కప్ప మీదే వుంది.

వస్తూన్న ప్రమాదాన్ని అది పసిగట్టలేకపోయింది.

సుబ్బరాజు గునపాన్ని పైకి ఎత్తాడు. పదునయిన దాని మొన కాంతికిరణాలు పడి వెండిలా మెరుస్తూంది.

ఒక్క క్షణకాలం స్తంభించిపోయింది.

గురి చూసి గునపాన్ని పాము మీద దింపబోయాడు

సుబ్బరాజు. పాము రెండు ముక్కలు కావాల్సింది. కానీ గునపం క్రిందకు వచ్చేసమయానికి అరటి బోదెకు ఆను కుని వున్న కప్ప ముందుకు దూకింది. దాన్ని అందుకోవ టానికి పాము చటుక్కున ముందుకు పాకింది. సరిగ్గా పాము పొట్టలో దిగబడాల్సిన గునపం నేలలో దిగ బడింది.

పాము ఈసారి ప్రమాదాన్ని పసిగట్టింది.

శక్తికొద్దీ ముందుకు పరుగెత్తింది.

గునపాన్ని పట్టుకుని సుబ్బరాజు దానివెనకే పరు గెట్టాడు.

అంతా పచ్చగా పరిచిన పచ్చిక, మొక్కా మోడూ ఏమీ లేదు. పట్టుదొరికి పాము జర జరా ముందుకు పారి పోతోంది. దృష్టిలోంచి తప్పించుకోనీయకుండా సుబ్బ రాజు దానిని వెంబడిస్తూన్నాడు. దాని వేగాన్ని అతడు అందుకోలేకపోతోన్నాడు. అయినా పట్టు వదలకుండా లేని ఓపికను తెచ్చుకుని దాని వెనక పరుగెడుతోనే వున్నాడు. చేతిలో పది కేజీల గునపం వుండటం వలన అతడు ఆయాసంతో రొప్పుతోన్నాడు. అయినా అతనిలో వున్న ప్రతీకారం అతడికి లేని సత్తువ నిస్తూంది.

ఉన్నట్టుంటి ఒక్కసారి ఆగింది నాగరాజు.

సర్ః మని వెనక్కు తిరిగింది.

సుబ్బరాజు ఒక్క క్షణం బిత్తరపోయాడు. వెంటనే తేరుకుని గునపాన్ని దిగెయ్యబోయాడు. అంతలోనే ఆ పాము చిన్న బొరియలో దూరటం ఆరంభించింది. గునపం నేలలో దిగిపోయింది.

సుబ్బరాజు పిచ్చి ఆవేశంతో వూగిపోయాడు. చటు క్కున వంగి బొరియలో దిగిపోతోన్న పాము తోకను

అందుకుని వెనక్కి లాగటం మొదలు పెట్టాడు. పాము కదలక మెదలక ఆలానే వుండిపోయిందిగాని బయిటకు రాలేదు. చేతిలోంచి జారిపోకుండా తోకను మెలేసి పట్టుకున్నాడు. రెండు నిముషాల తరువాత తోక చివర్న తెగిపోయింది. తెగిపోయిన తోక సుబ్బరాజు చేతిలో వుండిపోయింది. పాము పూర్తిగా బొరియలో దూరిపోయింది.

సుబ్బరాజు వుసూరంటూ లేచినిలబడ్డాడు. వుక్రోషంతో బొరియ చుట్టూ గునపంతో పొడిచాడు. దాని జాడ కనిపించలేదు. చేసేదిలేక యింట్లోకి తిరిగి వచ్చేశాడు.

4

రాత్రి పదకొండు గంటలు దాటింది.

అంతా చీకటి పరుచుకుని వుంది.

సుబ్బరాజు కిటికీ ఎదురుగా మడతమంచం వేసుకుని పడుకుని వున్నాడు. అతని కాళ్ళు కిటికీలో వున్నాయి. కిటికీ అవతల అతడి పెంపుడు కుక్క చిన్నారి వుంది.

సుబ్బరాజు ఆదమరచి నిద్రపోతోన్నాడు.

యజమాని నిశ్చింతగా వుండటం చూసి చిన్నారికూడా ముడిచి పెట్టుకుని మాగన్నుగా పడుకుంది.

వాతావరణం చాలా ప్రశాంతంగా వుంది.

ఇంటిల్లిపాదీ గాఢ నిద్రలో వున్నారు. అప్పటివరకూ మామూలుగా పడుకొన్న చిన్నారి సరిగ్గా నిద్రలోకి జారుకుంది. అప్పుడే ఆ యింటిలోకి ఐదున్నర అడుగుల పొడవయిన ఆకారం ప్రవేశించింది. నున్నటి గచ్చుమీద పాకలేక పాకలేక పాక్కుంటూ చిన్నారి పడుకున్న కిటికీ దగ్గిరకు వచ్చింది. కిటికీ క్రింద ఒక్క క్షణం ఆగింది. తర్వాత నెమ్మదిగా గోడ ఎక్కింది.

కిటికీ నేలమీద నుండి మూడడుగుల ఎత్తున వుంది. ఆకారం పూర్తిగా కిటికీ దగ్గరకు చేరుకుంది. ఇంకా అడుగు పైచిలుకున దాని తోక నేలమీద వుండిపోయింది. అంత చీకటిలోనూ సుబ్బరాజు కాలు దానికి కిటికీ వూచల్లోంచి చక్కగా కనిపిస్తూంది.

అది ఆ కాలును ఆశగా చూసింది. తరవాత నెమ్మదిగా పడగ విప్పింది. బుస్ బుస్ మంటూ రెండుసార్లు బుస కొట్టింది. తరవాత తలను నిటారుగా పెట్టి సంధించిన బాణంలా అతడి కాలు మీద తన కోరలను దింప బోయింది.

అంతలోనే చిన్నారికి ఎందుకో మెలకువ వచ్చింది. కళ్ళు తెరచేటప్పటికి దాని ముందు సన్నటి తోక కనిపించింది. వెంటనే అదేమిటో దానికి బోధపడింది. జరగబోయేదాన్ని గ్రహించినట్లుంది. చటుక్కున నోటితో ఆ తోకను పట్టుకుని వెనక్కు లాగింది.

సుబ్బరాజు కాల్లో దిగాల్సిన పాముకోరలు, కిటికీ వూచలకు కొట్టుకొన్నాయి. నాగరాజు చిన్నారిని కోపంగా చూసింది.

చిన్నారి దానిని గుర్రుగా చూసింది. యజమానిని హెచ్చరించటానికి గట్టిగా మొరుగుదామనుకుంది. కానీ నోటిలోవున్న తోకను వదలటం యిష్టంలేదు కాబోలు, తన ప్రయత్నాన్ని విరమించుకుంది.

నాగరాజు దాని నోట్లోంచి తోకను లాక్కోవటానికి విఫల ప్రయత్నం చేసింది. ఒక నిముషం అలసట తీర్చుకుని మళ్ళీ గోడ ఎక్కింది. పూర్తిగా గోడ ఎక్కనిచ్చి చిన్నారి దాన్ని వెనక్కు లాగింది. 'తప్'మంటూ నాగరాజు క్రిందపడ్డాడు. ఒక్కక్షణం తరువాత మళ్ళీ గోడ

ఎక్కింది. మళ్ళీ చిన్నారి దాన్ని క్రిందకు లాగింది.

ఈ ఆట దాదాపు అరగంట కొనసాగింది.

అయినా ఆ యింట్లో ఎవరికీ మెలకువ రాలేదు.

ఉన్నట్టుండి, చిన్నారి కాలు నాగరాజు తోకమీద పడింది. అసలే వుదయం తెగిన తోక, పచ్చిపుండులా వుంది. చిన్నారి కాలు దానిమీద పడేటప్పటికి నాగరాజు విలవిల్లాడిపోయాడు. దాని చిన్న కళ్ళు నీళ్ళతో నిండాయి. తన కోరిక తీరకుండా అడ్డుపడుతోన్న చిన్నారి మీద దానికి ఆసరికే పీకమొయ్యా కోపం వచ్చింది. పుండుమీద కాలేసే టప్పటికి యింక భరించలేక పోయింది. అంతే వెంటనే దాని వుద్దేశ్యాన్ని మార్చుకుంది. పూర్తిగా నేలమీదకు వచ్చేసింది. పడగవిప్పి బుసగొడుతూ ఒక్కక్షణం చిన్నారిని తీక్షణంగా చూసింది. తరువాత దాన్ని కసిగా పొడిచింది. కోరల్లో వున్న విషం అంతా పూర్తిగా దానిలో దిగిపోయేదాకా పొడిచింది.

చిన్నారి బాధగా క్రింద పడిపోయింది.

దాని నోట్లోంచి నాగరాజు తోక జారిపోయింది. నాగరాజు విసవిసా పాక్కుంటూ బయటకు వెళ్ళిపోయింది.

మామూలుగానే తెల్లారింది.

కిటికీ దగ్గిర ప్రాణంలేకుండా కుప్పగా పడివున్న చిన్నారిని చూసి సుబ్బరాజు గుండె తరుక్కుపోయింది. చిన్నారితో అతడికి వున్న అనుబంధం అటువంటిది. జరిగింది చూచాయిగా గ్రహించాడు. "ఈసారి దాన్ని ప్రాణంతో వదలటం కల్ల" అన్న నిశ్చయానికి వచ్చేశాడు.

ఆ రోజంతా సుబ్బరాజు చాలా నిర్లిప్తంగా గడిపాడు. తన కోసం ప్రాణాన్నే పణంగాపెట్టిన చిన్నారిని తలచు

కుంటూంటే అతడికి దుఃఖం ఆగటంలేదు.

సాయంత్రం వరకూ యింట్లోనే గడిపిన సుబ్బరాజు విసిగిపోయాడు.

ఒక్కసారి బయటకు వెళ్ళొద్దామని నెమ్మదిగాలేచాడు. మొహం కడుక్కుని బట్టలు మార్చుకొన్నాడు. చేతికర్రను తీసుకొన్నాడు. అలవాటు ప్రకారం చుట్టకోసం జేబులో చెయ్యిపెట్టాడు. చుట్టలు అయిపోయాయి. అలమారు తెరిచి చూశాడు. అలమార్లోని పొగాకు పోరాలు అయిపోయాయి. వుసూరుమంటూ సావడిలోకి వచ్చాడు.

సావడి మూలగావున్న పెద్ద బల్లమీద పొగాకు బుట్ట వుంది. ఆ ఆరడుగుల బుట్ట కట్లువిప్పి పోరాలు తీసుకోవాలంటే సుబ్బరాజుకు చిరాకు. అయినా తప్పదు. అందుకే నెమ్మదిగా అడుగులు వేస్తూ బల్లదగ్గిరకు వెళ్ళాడు.

బుట్టకు వున్న ముడులను విప్పే ఓపిక అతడికిలేదు. అందుకే తాళ్ళు కొయ్యటానికి గోడకు తగిలించిన పటకా కత్తిని చేతిలోకి తీసుకొన్నాడు. నెమ్మదిగా వంగి బుట్ట మీద చెయ్యవేశాడు. కత్తిని అమరుగా పట్టుకుని బుట్టను ప్రక్కకు తిప్పాడు.

అంతే! ప్రాన్పడి నిలబడిపోయాడు.

ప్రత్యర్థి అక్కడకు వస్తాడని ఎలా వూహించిందో తెలియదుగాని, నాగరాజు ఆ బుట్టక్రింద ముడుచుకు పడుకుని వుంది.

ఎప్పుడయితే బుట్ట తిరగబడిందో అది 'సర్'మని పడగ విప్పింది. బుట్టమీద వున్న సుబ్బరాజు చేతిని చూసింది. క్షణాల్లో అలర్టయిపోయి పడగను అతడి చేతి మీదకు విసిరింది.

సుబ్బరాజు జరగబోయే ప్రమాదాన్ని గ్రహించి చేతిని వెనక్కి లాక్కోబోయాడు. కానీ అప్పటికే ఆలస్యమయి పోయింది. భగభగ మండే రెండు అగ్ని పర్వతాలు అతడి నరాల మధ్య దిగబడ్డాయి.

సుబ్బరాజు కళ్ళు అగ్ని గోళాలయ్యాయి. చేతిలోని పటకా కత్తిని బలంగా క్రిందకు దింపాడు.

నాగరాజు రెండు ముక్కలయింది. బల్లకు చెరోవైపు ఆ ముక్కలుపడి వికృతంగా కొట్టుకోసాగాయి.

సుబ్బరాజు అంత బాధలోనూ, తన ప్రతీకారం తీరినందుకు హాయిగా వూపిరి పీల్చాడు. జరిగింది గ్రహించి సుందరమ్మ లబోదిబోమంది.

ఇరుగూ పొరుగూ సుబ్బరాజును మంత్రాల గుమాస్తా దగ్గరకు మోసుకుపోయారు. □

వేడి?



విషవలయంలో ప్రియురాళ్ళు

వసుంధర

"నీ సౌందర్యం అపురూపం—"అన్నాడతడు సునందతో.

"నీ ప్రేమమాత్రం అపురూపంకాదు—" అంది సునంద.

"ఎందుకని?"

"అపురూప సౌందర్యానికి అపురూపమైన కానుక

నిచ్చేవా?"

"అపురూప సౌందర్యానికి తగ్గ కానుక నూహించడమే ఒక సమస్య—" అన్నాడతడు బాధగా.

"మనసుంటే ఎలాంటి సమస్యకైనా సరే పరిష్కార ముంటుంది—" అంది సునంద.

"సునందా: నా మనసు నీకు తెలుసు...." అన్నాడతడు దీనంగా.

"మోహన్! పోనీ నాకేం కావాలో నేను చెబుతాను. తేగలవా?"

"అయ్యో—సునందా! నీ కోసం సప్త సముద్రాలు ఈదగలను. పాతాళంలోకి చొచ్చుకుపోగలను...." అన్నాడు మోహన్.

"అవేమీ చేయనక్కర్లేదు. నీ స్నేహితురాలు లీలను మోసగించు—" అంది సునంద.

"లీల నీకెలా తెలుసు?"

"లీల నాకేకాదు—ఎందరికో ప్రత్యేకంగా తెలుసు. కారణం చెప్పుకో!" అంది సునంద.

మోహన్ కాసేపాలోచించి— "ఏమో—నాకు తెలియదు—" అన్నాడు.

"చూడగానే కళ్ళు చెదిరే ఆమె వజ్రాలహారం...."

"అవునవును. అది లేకుండా లీల ఎక్కడికీ కదలదు."

"ఆ వజ్రాలహారం లీల ప్రత్యేకాభిమానాన్ని పొందింది. కారణం నీకు తెలుసా?"

మోహన్ తల అడ్డంగా ఊపాడు.

"లీల అందానికి మెచ్చి ఆమె ప్రియుడిచ్చిన అపురూపమైన కానుక అది! ఆమెకులాగే నేనూ నా ప్రియుడి గురించి చెప్పుకోవాలనుకుంటున్నాను. తప్పా?"

"అయితే లీలను నేను మోసం చేయడమెందుకు?"

"ఆ వజ్రాలహారం నువ్వు నాకు తెచ్చివ్వాలి...."

"అదేనా—అలాంటిదా?"

"అదే"

"అదే ఎందుకు?"

"ఒకటి—లీలమెడలో ఆ హారం చూస్తే నా వంటిమీద తేళ్ళూ జెర్రిలూ పాకుతున్నాయి. రెండు—లీల ముందె లాంటి మగాడైనా చిత్తేనట. ఆమె దగ్గిర చిత్తుకాకుండా నువ్వా హారం నాకు తెచ్చివ్వగలిగితే—అది నా అహానికి విజయం. మూడు—లీలకు ప్రమాదకరమైన వ్యక్తుల రక్షణ వుంది. అంటే లీలను మోసగించే వ్యక్తి ప్రమాదాన్నే సవాలు చేసినట్లు. అందుకు అపురూపమైన ప్రేమ ఉండాలి. ఆ ప్రేమ నీలో ఉందని నాకు ఋజువుకావాలి."

"సరే—నీ కోరిక తీరుస్తాను—" అన్నాడు మోహన్.

2

అందంగా అలంకరించబడిన ఆ గదిలో అద్దం ముందు నిలబడి తన అందానికి మెరుగులు దిద్దుకుంటోంది లీల. అప్పుడామెకు అద్దంలో తన వెనుకగా మోహన్ కనిపించాడు.

"అరే—మోహన్—నువ్వా?" అందామె.

"గుర్తు పట్టావా?" అని నవ్వాడు మోహన్.

"మరిచిపోవలసిందే—నిన్ను చూసి నెల్లాళ్ళు దాటిందేమో—"

"నెలకాదు. అయిదు వారాలు...." సరిచేశా డతడు.

"ఇన్నాళ్ళూ ఏమైపోయావ్?"

"ఏమవుతాను? ప్రేమలో పడ్డాను...."

లీల కళ్ళలో అసూయ కనబడింది.... "ప్రేమలో

పడ్డావా? నా ఆకర్షణను మరిచిపోయావా?"

"లేదు. నా మనసు కొత్తదనాన్ని కోరింది...."

"నన్ను మించిన కొత్తదనం నీకెక్కడ కనపడింది?"

"సునంద తెలుసా నీకు?"

"తెలియదు—"

"తెలిసుండదులే—తెలిస్తే నీ గర్వం కాస్త అణిగేది."

లీల ముఖం ఎర్రబడింది—"నా పాదాల దగ్గిరపడుండే నీలో గర్వం పెరిగింది. ఆ సునంద ఎవరో జాణ అయుండాలి—"

"లీలా—మగాడికి గర్వమే అందమంటుంది సునంద."

లీల చిరాగ్గా—"అయితే యిక్కడికెందు కొచ్చావ్?" అంది.

"ఒకరోజున యీ యింట్లో మనమిద్దరమే ఉన్నాం. నువ్వు యాభై వేల రూపాయలు లెక్కపెట్టి బీరువాలో ఉంచావు. అప్పటికి మన పరిచయం వయసు రెండు రోజులు. గుర్తుందా?" అన్నాడు మోహన్.

లీల గుర్తుచేసుకుంది.

*　　　*　　　*

"నేనెలాంటి వాడినో నీకు తెలియదు. ఇప్పుడు నేను నిన్ను గాయపరిచి డబ్బు తీసుకుని పారిపోతే ఏం చేస్తావు?" అన్నాడు మోహన్.

లీల నవ్వి—"యాభై వేలకోసం ఏ మగవాడూ నన్ను గాయపర్చాలనుకోడు. నేను విలువైన మనిషిని నా కంటే నీకు డబ్బెక్కువకాదని నాకు తెలుసు—" అంది.

"ఒకవేళ నేను నిన్ననుభవించేక డబ్బు తీసుకుని పారిపోయాననుకో—అప్పుడేంచేస్తావ్?"

"నువ్వు నీ తల్లిని మోసం చేయగలవు. కానీ నన్ను

మోసగించలేవు. నాతో అనుభవం నీలో కృతజ్ఞతను పెంచుతుంది. ఆ కృతజ్ఞత నిన్ను నాకు బానిసను చేయడం తప్పనిసరి—" అంది లీల సమ్మోహనంగా నవ్వుతూ. ఆ నవ్వులోనే చెప్పలేనంత నమ్మకముంది.

"నువ్వు ఓ తరహా మగాళ్ళతో పరిచయం పెట్టుకున్నావు. వారికి స్త్రీ సౌందర్యం. స్త్రీ సుఖం—ఈ రెండే ముఖ్యంకావచ్చు. అంతా అలాగే ఉంటారనుకుంటే అది నీ పొరపాటు. కొందరికి డబ్బు తర్వాతే ఏదైనా. మరి కొందరికి తిండి తర్వాతే ఏదైనా—అలాంటివాళ్ళచేత నువ్వు మోసపోతావు...." అన్నాడు మోహన్.

"ఆ భయం నాకు లేదు. ఎందరో ప్రియులు నాకెన్నో కానుక లిస్తూంటారు. అవి నా దగ్గరకు చేరాక నన్నువదల లేవు. నా యింటికి కాపలా మనుషులవసరంలేదు. ఇంకా చెప్పాలంటే ఇంటికి తాళంకూడా పెట్టను. ఈ యింట్లోంచి పూచికపుల్ల కదిలిందంటే—కదిలించిన వ్యక్తి మృత్యువు నాహ్వానించినట్లే భావించాలి—"

"ఉదాహరణ లున్నాయా?"

"ఉన్నాయి కానీ చెప్పను...."

"అయితే కనీసం నీ ప్రేమ, ఆకర్షణ విఫలమయ్యాయని నువ్వొప్పుకోక తప్పదు—" అన్నాడు మోహన్.

"లేదు—" అంది లీల—"ఇంతవరకూ నా యింట్లో రెండేరెండు చోరీలు జరిగాయి. ఇద్దరూ స్త్రీలే!"

"నువ్వు నన్ను సవాలు చేస్తున్నావు...."

"లేదు—హెచ్చరిస్తున్నాను...." అంది లీల.

"నీ హెచ్చరిక నేను లెక్కచేయకపోతే?"

"డియర్ మోహన్! ఎందుకీ అసందర్భపు సంభాషణ? కాలం వృథాచేయకు. నువ్వు చటుక్కున చేయిపట్టుకుని

లోపలకు లాగకపోతే—కాలుజారి పట్టాల క్రిందకు పోవలసినదాన్ని. అమూల్యమైన నా ప్రాణాలు రక్షించి నందుకు - నిన్ను నేనే అమూల్య కానుకగా సమర్పించు కోవాలనుకున్నాను. లేకుంటే నా పరిచయం అరుదైనది. ఆ అరుదైన అనుభవాన్ని నీలో ఇముడ్చుకుని—నువ్వు హాయిగా వుండు. నా హెచ్చరికను నిర్లక్ష్యం చేయకు...."

"నీ హెచ్చరికను నిర్లక్ష్యం చేయాలని లేదు. కానీ సవాలును వదలాలని లేదు—"

"అయితే నీ కర్మ—నీ క్కావాలంటే బీరువాలోని యాభై వేలూ తీసుకుని వెళ్ళు. ఆ తర్వాతేం జరిగినా—నేను కూడా నిన్ను రక్షించలేను. అందుకే ముందుగా చెబుతున్నాను" అంది లీల.

"ప్రస్తుతానికి నీ ఆకర్షణేమిటో తెలుసుకుంటాను. సవాలు సంగతి తర్వాత చూస్తాను—...." అన్నాడు మోహన్.

"ఈ యింట్లో దొంగతనం చేయాలంటే నీ కెప్పుడూ అడ్డులేదు. కానీ ఆ తర్వాత నువ్వుండవు. గుర్తుంచుకో" అంది లీల.

* * *

"గుర్తుంది—" అంది లీల.

"ఇప్పుడు నేను దొంగతనంచేయడానికి వచ్చాను...." అన్నాడు మోహన్ గంభీరంగా.

"అంటే?" అంది లీల తెల్లబోయి.

"ప్రస్తుతం నేను సునంద ఆకర్షణలో ఉన్నాను. ఆ ఆకర్షణ నీ ఆకర్షణకంటే గొప్పది. ఆమె నీ మెడలోని వజ్రాల హారాన్ని కోరింది...."

లీల నవ్వి—"నువ్వు సునంద ఆకర్షణలో లేవు.

ప్రమాదాన్ని సవాలుచేసే ఆకర్షణలో ఉన్నావు—....”
అంది.

“నిన్ను నీవు మభ్యపరచుకుంటానంటే నా కెలాం టభ్యంతరమూ లేదు. కానీ జబర్దస్తీగానైనా సరే నీ దగ్గిర్నుంచి ఆ హారం తీసుకుని వెడతాను—” అన్నాడు మోహన్.

“ప్లీజ్—వద్దు—” అంది లీల.

“నన్నాపలేవు—” అన్నాడు మోహన్.

“నా సమస్య అదికాదు. నా ప్రాణదాత నేలా రక్షించుకోవాలో తెలియక సతమతమవుతున్నాను....”అంది లీల.

“నన్ను నేను రక్షించుకోగలను—” అన్నాడు మోహన్.

“పోనీ—ఒక పని చేయి. నేను హారాన్ని బల్లమీద వదిలి బాత్రూంకు వెడతాను. అరగంటదాకా బయటకు రాను. ఈ అరగంటసేపూ ఆలోచించుకో. హారాన్ని తీసుకుపోవాలనుకుంటే నిన్నడ్డగించేవారుండరు. నే నింత ధైర్యంగా హారాన్ని వదిలివెడుతున్నానంటే నా మాటల మీద, హెచ్చరికమీద నీకు నమ్మకం పుట్టాలి. పుట్టకపోతే నీ దురదృష్టం. అప్పటికీ ఓ ఉపాయం చెబుతున్నాను. హారాన్ని తీసుకునివెళ్ళి సునందకు చూపించి కాసేపు వేసుకోనిచ్చి మళ్ళీ తెచ్చేసేయ్. ఒక పూట నీకు గడువిస్తున్నాను. ఆ పూటలో హారం వెనక్కు రాకపోతే నేను చేయగలిగినదేమీ లేదు—” అంది లీల.

మోహన్ ఆమె చెప్పింది మౌనంగా విని ఊరుకున్నాడు.

తన మెడలో హారం తీసి బల్లమీద పెట్టి—“అరగంట తర్వాత నేను బైటకు వచ్చేసరికి నువ్విక్కడే ఉంటావని

ఆశిస్తున్నాను. లేదూ—రేపిదే సమయానికి నాకో పెద్ద పని ఉంది. అప్పుడు నా మెడలో యీ హారముంటుందని నమ్ముతున్నాను—....” అని చెప్పి బాత్రూమ్‌లోకి వెళ్ళింది.

ఆమె తిరిగివచ్చేసరికి మోహన్ అక్కడ లేడు.

3

సునంద హారాన్ని మెడలో వేసుకుని అద్దంలో పదే పదే తన్ను తాను చూసుకుంది. ఆమె సంతోషానికి అంతు లేదు.

“బాగుందా?” అన్నాడు మోహన్.

సునంద అతడివైపుకు తిరిగి—ఊహించని విధంగా అతణ్ణి కౌగిలించుకుని కుదిపేసింది. అప్పుడామె పురుషుడి కంటె బలంగా వుంది.

“సునందా—ఏమిటిది?” అన్నాడు మోహన్ ఉక్కిరి బిక్కిరవుతూ.

“సంతోషం—కృతజ్ఞత—ఏమని చెప్పాలో తెలియడంలేదు. డియర్ మోహన్! నీకేం కావాలో చెప్పు. నేను నీ ప్రియురాలిని కాదు. దాసిని—....” అంది సునంద.

“థాంక్యూ సునందా! నీ మాటలే చాలు నాకు....వేరే ప్రతిఫలం అవసరంలేదు—” అన్నాడు మోహన్.

“వద్దన్నా ప్రతిఫలమిస్తాను—నేను నీ దాన్ని” అంది సునంద.

“వద్దు సునందా! నువ్వు ప్రేమలో నా దానివి కావాలి. ప్రతిఫలంగా కాదు. నేను నిన్ను నిజంగా ప్రేమిస్తున్నాను—....” అన్నాడు మోహన్.

“నన్ను ప్రేమిస్తున్నావా—నా చరిత్ర తెలిసి కూడా!”

అంది సునంద.

"నీ చరిత్ర కేం లోటొచ్చింది....?" అన్నాడు మోహన్.

"ఒక బలవంతుడి చేతిలోని ఆటబొమ్మను నేనని నీకు తెలుసు—"

"కానీ ఆ బలవంతుడికి నీ వల్ల ప్రయోజనం అయిపోయింది. అతడు నీకు స్వేచ్ఛ నిచ్చాడు—...."

"కానీ ఆటబొమ్మగా ఉన్నప్పుడు నే నతడు చెప్పినట్లు ఆడాను—"

"ఆడితే ఆడావు. ఆ మాటకొస్తే నేనూ అలాగే ఆడాను. నే నేమీ పవిత్రుణ్ణి కాదు. నిన్నొక బలవంతుడాడిస్తే నన్ను పరిస్థితు లాడించాయి. నేరాలు చేశాను. జైళ్ళకు వెళ్ళాను. ఇప్పుడు మామూలుగా జీవించాలని ఉంది ..."

"అయితే నువ్వు నన్ను నిజంగా పెళ్ళి చేసుకుంటావా?"

"నా ప్రేమను నిరూపించుకునేందుకే యీ హారం తెచ్చాను నీ కోసం. నువ్విక నీ ప్రేమను నిరూపించుకోవాలి—...."

"ఎలా?"

"హారాన్ని తిరిగి నా కిచ్చేయడం ద్వారా—"

సునంద నిరుత్సాహపడింది. తమాయించుకుని—"ఇవ్వకపోతే?" అంది.

"బహుశా నేను మళ్ళీ నీకు కనిపించను—" అన్నాడతడు.

"నే నివ్వకపోతే బలవంతంగా తీసుకుంటావా....?" భయంగా అడిగింది సునంద.

"తీసుకోను—"

తేలిగ్గా నిట్టూర్చింది సునంద.

"సునందా: నీకోసం నా ప్రాణాలకు తెగించి యీ హారం తీసుకుని వచ్చాను. ఇది తిరిగివ్వకపోతే నా ప్రాణాలకే ప్రమాదం. అలాగని నేను నిన్ను బలవంతపెట్టను. నువ్వు మనస్ఫూర్తిగా హారాన్ని నాకు తిరిగిస్తేనే తీసుకుంటాను. అందుకే యిప్పుడు కళ్ళుమూసుకుని వెయ్యెంకెలు లెక్కపెడతాను. లెక్క పూర్తయి నేను కళ్ళు తెరుస్తాను. నువ్వు హారం నాకు తిరిగివ్వాలి. అలా జరక్కపోతే వెంటనే వెనక్కు తిరిగి వెళ్ళిపోతాను. ఆ తర్వాత బహుశా మనం మళ్ళీ కలుసుకోము...."

"ఎందుకని?"

"నా ప్రాణాలు పోవచ్చు."

"పోకపోతే?"

"పోకపోతే తప్పక నిన్ను కలుసుకుంటాను...."

"అప్పుడు నన్ను పెళ్ళిచేసుకుంటావా?"

"ఊఁ"

"స్వార్థపరురాలినని అసహ్యించుకోవా?"

"నిన్ను నే నసహ్యించుకోలేను...."

సునంద నిట్టూర్చి—"ప్రేమ విలువ నాకు తెలియదు. స్వార్థ మొక్కటే నాకర్థమవుతుంది. డియర్ మోహన్: నన్నపార్థం చేసుకోకు. నువ్వు బలవంతంగా వెనక్కు తీసుకుంటే ఏమోగానీ — నాకై నేనీ హారాన్ని నీకివ్వలేను. నాకు నీపై ప్రేమ లేదనుకోకు. నన్నర్థం చేసుకో—" అంది.

"నేను నిన్నర్థం చేసుకున్నాను. నువ్వే నన్నర్థం చేసుకోవాలి" అన్నాడు మోహన్ నీరసంగా.

"షరతులేమీ పెట్టకు. ఈ హారం ఎప్పటికీ నాదని చెప్పు" అంది సునంద.

"నా ఆశ నాది—" అంటూ మోహన్ కళ్ళు మూసుకుని అంకెలు లెక్క పెట్టడం ప్రారంభించాడు. అతడు వెయ్యంకెలు పూర్తిచేసి—కళ్ళు తెరిచేసరికి — సునంద లేదు. అతడు నిట్టూర్చి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

4

మోహన్ నడిరోడ్డుమీద నిలబడి ఉంటే—పదిమంది మహాకాయులతణ్ణి చుట్టుముట్టారు. అందరిచేతుల్లోనూ పొడవాటి కత్తులున్నాయి. చీకట్లోకూడా అవి మెరుస్తున్నాయి.

మోహన్ వారిని చేతులు జోడించి వేడుకుంటున్నాడు. సమాధానంగా ఆ పదిమందీ కత్తులు పైకెత్తారు.

కొద్దిక్షణాల్లో ఆ కత్తులతడి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చీల్చేస్తాయి.

కెవ్వుమని అరిచి లేచి కూర్చున్నాడతడు.

సమయానికి మెలకువ రాకపోతే అతడి శరీరం కలలో తునాతునకలై పోయుండేది.

జరిగింది కల అని తెలుసుకుందుకు మోహన్‌కు కాసేపు పట్టింది. హమ్మయ్య—అని తేలికగా నిట్టూర్చి టైము చూసుకున్నాడతడు.

రాత్రి రెండు గంటలు....

పన్నెండు గంటల వరకూ అతడు మెలకువగానే ఉన్నాడు.

మోహన్ అవసరాన్నిబట్టి ఎంతకైనా తెగించగలడు కానీ స్వతహాగా ధైర్యవంతుడు కాదు.

తల్లీ తండ్రీ లేదతడికి. బంధువులింట్లో అష్టకష్టాలూ పడలేక—ఇంట్లోంచి పారిపోయాడు. కడుపు నింపుకోవడం

కోసం చిల్లరపనులూ చేశాడు. చిల్లర దొంగతనాలూ చేశాడు. క్రమంగా నేరాలతడి జీవితంలో ఒక భాగమై పోయాయి. సమాజాన్ని నడిపే కొన్ని దుష్టశక్తులతడికి స్వాగతం పలికాయి. పూర్తిగా వారి గుప్పట్లోకి వెళ్ళిపోకుండా—వారికి దూరంగానే ఉండి వారికి సహకరించి తన అవసరాలు గడుపుకుంటున్నాడతడు. ప్రస్తుతం అతడివద్ద కొంత డబ్బుచేరింది. పాత జీవితానికి స్వస్తిచెప్పి కొత్త జీవితం ప్రారంభించాలన్న ఆలోచన అతడికి సునంద పరిచయంతో ప్రారంభమయింది. సునందకోసం అతడు లీల హెచ్చరికను కాదన్నాడు. సునంద తనకోసం హారం తిరిగివ్వగలదనుకున్నాడు. ఆమె ఇవ్వలేదు. అడిగి ఆమెను బాధపెట్టడం అతడి కిష్టంలేదు.

ప్రమాదం తన్ను తరుముతుందని అతడికి తెలుసు. కానీ లీల తనకు మర్నాడుదయం దాకా టైమిచ్చింది. ఈ లోగా తనకు ప్రమాదంలేదు. ఆ ధైర్యంతోనే యిల్లుచేరి పడుకోవాలనుకున్నాడు. ఓ పట్టాన నిద్రపట్టలేదు. పట్టక పట్టక నిద్రపడితే కలవచ్చి మెలకువొచ్చేసింది.

"పాడుకల!" అనుకున్నాడతడు. మరుక్షణంలోనే అతడి కనిపించింది—ఇప్పుడు కలగా జరిగింది—రేపు నిజమవుతుంది!

సమయానికి కల తనను హెచ్చరించింది.

ప్రమాదం రేపుదయం తనను తరుముతుంది. ఈ లోగానే తను ప్రమాదానికి దూరంగా పారిపోతే?

ఈ ఆలోచన ముందే రానందు కతడు తన్ను తాను నిందించుకున్నాడు. వెంటనే మంచం దిగాడు. త్వరగా వేషం మార్చుకున్నాడు. జేబులో డబ్బు లెక్కపెట్టు

కున్నాడు.

రెండువేల రూపాయ లున్నాయి.

"ప్రస్తుతాని కిది చాలు" అనుకుని ఇల్లు వదిలాడు.

తెల్లవారుఝామున నాలుగింటి కతడు రైల్వేస్టేషన్‌లో ఓ ట్రయి నెక్కాడు. ఆ ట్రయినేమిటో ఎక్కడికి వెడుతుందో అతడు పట్టించుకోలేదు.

టికెట్ లేకుండా ప్రయాణ మతడికి కొత్తకాదు.

ట్రయినలా మూడు గంటలసేపు ప్రయాణం చేసింది. అంతవరకూ అతడికి టికెట్ కలెక్టరు సమస్య తలెత్త లేదు. ఖాళీగా ఉన్న బెర్తుమీద పడుకున్నాడు.

టికెట్ కలెక్టర్ వచ్చాడు. మోహన్ నిద్ర పోయినట్లు నటించాడు. టికెట్ కలెక్టరతన్ని పలకరించకుండానే వెళ్ళి పోయాడు.

ఏం జరిగిందో తెలియక మోహన్ ఆశ్చర్యపడ్డాడు.

క్రింద బెర్తుమీద ఓ యువతి ఉంది. ఆమె మెలకువగా కూర్చుని కిటికీలోంచి బయటకు చూస్తోంది.

మోహన్ తనూ క్రిందకు దిగి ఆమె పక్కనే కాస్త దూరంగా కూర్చున్నాడు.

ఆమె చటుక్కున అతడి వంక చూసి - "మీరు టికెట్ కలెక్టర్ కోసం లేచారా? నా దగ్గిర రెండుంటే చూపించాను. ఆయనింక మిమ్మల్నడగలేదు...." అంది.

ఆమె మోహన్ దగ్గిర టిక్కెట్టుందనే అనుకుంటోంది.

"మీ దగ్గిర రెండు టికెట్లెందుకున్నాయి?" అన్నాడు మోహన్.

"ట్రయిన్‌లో ఎనిమిది గంటల క్రితం ఇద్దరెక్కాం. అతడు నన్ను మోసం చేసి సగం దారిలో దిగిపోయాడు" అందామె.

మోహన్ ఆమె కథ విన్నాడు. ఆమె పేరు సీత. ఆమె గీత దాటింది.

అప్పుడతడు గమనించాడామె అందగత్తె అని. ఐనా మోసపోయిన స్త్రీలు చాలా అందంగా ఉంటారు.

మోహన్‌లో ఆమెపట్ల మళ్ళీ ఆకర్షణ బయలుదేరింది.

జీవితంలో పురుషుడికి స్త్రీ తోడు అవసరం. అప్పుడే జీవితం పరిపూర్ణమవుతుంది. మోహన్ కా విషయం అర్థమయింది.

గీత దాటిన సీత - ఇప్పుడు తనే రావణుడి పాలబడతానో అని భయపడుతోంది. మోహన్ ఆమెకు ధైర్యం చెప్పాడు.

లీలకు తనంటే కృతజ్ఞత. ఆ కృతజ్ఞతతో ఆమె తన శరీరాన్నర్పించగలదు. కానీ తన్ను ప్రమాదం నుంచి రక్షించలేదు.

సునందకు తనంటే యిష్టమే: అయితే ఆమె స్వార్థాన్ని జయించలేదు. తన ప్రాణాలకు మించి స్వార్థమామెకు ప్రాణం. ఒక వజ్రాలహారం కోసం ఆమె తన్ను ప్రమాదంలో పారేసింది.

సీత మధ్యతరగతి పిల్ల. ఇల్లు వదలకముందో బాబా యున్నాడు. ఇల్లు వదిలేక ఆమె కెవరూ లేనట్టే లెక్క. మాయలేడిలా మభ్యపెట్టిన ప్రియుడు మధ్యలో మాయం కావడంవల్ల - ఆమె ఆత్మహత్య గురించి కూడా ఆలోచిస్తూంది.

మోహన్ ఆమెకు క్లుప్తంగా తన గురించి చెప్పుకుని "అసాధారణ యువతులతో జీవించడంలో యిబ్బంది ఉంది. నేను సామాన్యుణ్ని. నువ్వు నాతో ఉంటానంటే మనం సామాన్య జీవితం గడపవచ్చు" అన్నాడు.

అతడు తన్ను పెళ్ళి చేసుకుంటాననగానే సీత చాలా సంతోషించింది. అయితే తను మనసు చిక్కబెట్టుకునేందుకామె కొంత వ్యవధిని కోరింది.

మోహన్ అంగీకరించాడు.

సీత నిర్ణయించిన గమ్యంలో దిగాడు మోహన్. కొత్త జీవితం గురించి కలలు కందామంటే - లీల హెచ్చరిక అతణ్ని కలవరపరుస్తూంది.

రైల్వే ప్లాట్‌ఫారం మీద అతడు, సీత....

ఎక్కడికి వెళ్ళాలా ఏం చేయాలా అని అతడాలోచిస్తూంటే—

"మా యింటిపక్క నా స్నేహితురాలుండేది. ఆమెకు వివాహమై రెండేళ్ళయింది. ఆమె యిక్కడే వుంటోంది. మేమిద్దరం ఉత్తరాలు రాసుకుంటూంటాం. ఆమె చిరునామా నాకు తెలుసు...." అంది సీత.

మోహన్ ఆ చిరునామా తీసుకున్నాడు.

ఇద్దరూ ఆటోలో ఆ యింటికి వెళ్ళారు.

ఇల్లు డాబుగా ఉంది. భయపడుతూనే సీత, మోహన్ ఆ యింట్లో అడుగు పెట్టారు.

కాలింగ్‌బెల్ వింటూనే ఓ నడి వయస్కుడు తలుపు తెరిచాడు.

"నా పేరు సీత" అంది సీత.

"కమిన్" అన్నాడా నడి వయస్కుడు.

సీత వెనకనే మోహన్ కూడా లోపల ప్రవేశించాడు.

నడి వయస్కుడు తలుపులు వేసి - "వెల్‌డన్ సీతా! మోహన్‌ని తెలివిగా యిక్కడకు తీసుకొచ్చావు" అని అన్నాడు.

మోహన్ వులిక్కిపడ్డాడు-"ఎవర్నువ్వు?" అడిగాడా

నడి వయస్కుణ్ని.

"లీల నిన్ను ప్రమాదం గురించి హెచ్చరించింది కదా - ఆ ప్రమాదాన్ని నేనే!" అన్నా డతడు.

"నాకేమీ అర్థం కావడం లేదు."

"నువ్వు లీల దగ్గిర్నుంచి ఏదో కాజేశావు. అందుకు నీకు శిక్ష పడాలి. నిన్ను సీత నా దగ్గిరకు చేర్చింది."

మోహన్ సీత వంక చూశాడు. ఆమె నవ్వుతోంది.

"మోసం....అంతా మోసం....ఆడదాని అందం మోసం....ప్రేమ మోసం....నవ్వు మోసం...." అంది మోహన్ మనసు.

"ప్రస్తుతానికి విశ్రాంతి తీసుకో - నీ శిక్ష కింకా టయిముంది."

"ఏం చేస్తావ్ నన్ను?" అడిగాడు మోహన్.

"నువ్వు చాపటం ఖాయం. అందుకు హింసించాలా లేదా అన్న విషయం లీల చెబుతుంది" అన్నాడా నడి వయస్కుడు.

"ఎవర్నువ్వు?" అన్నాడు మోహన్.

"లీలబాస్‌కి సహచరుణ్ని...." అతడు నవ్వాడు.

మోహన్ చుట్టూ చూశాడు. ఈ విధంగా తాను శత్రు వ్యూహంలో చిక్కుకుంటానని అత డనుకోలేదు.

"నాకు తప్పించుకునే మార్గం లేదా?"

"తప్పించుకునేందు కీ యింటి తలుపు లెప్పుడూ నీ కోసం తెరిచే ఉంటాయి. తప్పించుకుందుకు ప్రయత్నిస్తే మాత్రం యమధర్మరాజుకు కూడా తెలియని చిత్రహింస లకు గురవుతావు. కాబట్టి బుద్ధిగా ఉండు" అని అక్క ణ్నించి వెళ్ళిపోయాడు నడివయస్కుడు.

"నువ్వు మోసగత్తెవు" అన్నాడు మోహన్ సీతతో.

"నేను నా డ్యూటీ చేశాను" అంది సీత.

"నీ డ్యూటీలో మోసముంది" అన్నాడు మోహన్.

"మోహన్! డ్యూటీ కోసం నిన్ను మోసగించినా - ట్రయిన్‌లో నీ కళ్ళలోని నిజాయితీ చూసి నిన్ను ప్రేమించాను. నేను నిన్ను మోసం చేయకపోయినా నువ్వు తప్పించుకోలేవు. నిన్ను రక్షించగల శక్తి నా ప్రేమ బలానికే ఉంది. నా ప్రేమ బలమైనదయితే నువ్వు రక్షింపబడతావు. నా మనసు నీ క్షేమాన్ని కోరుతోంది. నా కోర్కెలోని బలం మృత్యువుకీ నీకూ మధ్య అడ్డుగోడలా నిలబడగలదు...." అంది సీత.

"నేను రక్షించబడాలంటే అవకాశమేమిటి?" అడిగాడు మోహన్ ఆశగా.

"నాకు తెలిసి ఏ అవకాశమూ లేదు...."

మోహన్ నిట్టూర్చాడు. ఒకసారి శత్రువు బలం తెలిసింది కాబట్టి అతడక్కణ్ణించి పారిపోయే ప్రయత్నం కూడా చేయలేదు.

అలా అతడా యింట్లో నాలుగురోజు లున్నాడు.

నాలుగు రోజుల తర్వాతే అతడు మళ్ళీ నడి వయస్కుణ్ణి చూశాడు.

"నీ అంతటి అదృష్టవంతు డుండడు. నీ ప్రాణాలు దక్కాయి" అన్నా డతడు.

"ఏం జరిగింది?"

నడి వయస్కుడు చెప్పింది విని మోహన్ ఆశ్చర్యపోయాడు.

బాస్‌కు లీలమీద అనుమానం వచ్చింది. లీలకు

చెప్పిన రహస్యాలు శత్రువులకు చేరుతున్నాయి. అదెలా జరుగుతుందో తెలియులేదు. మోహన్ కారణంగా ఆ రహస్యం బట్టబయలయింది.

లీలకు బహుమతిగా లభించిన వజ్రాల హారంలో ట్రాన్స్మిటర్లున్నాయి. వాటిద్వారా బాస్ ఆమెతో మాట్లాడే మాటలన్నీ శత్రువులు వినగల్గుతున్నారు. ఇటీవల లీలకు అప్పగించబడిన ప్రతివిశేషమూ శత్రువులకు ముందుగా తెలిసింది. వజ్రాల హారం పోయాక - ఆ విశేషం తెలియలేదు. బాస్ అనుమానం ఆ వజ్రాల హారంమీదకు అంతవరకూ పోనేలేదు. ఇప్పుడు సునంద కప్పగించ బడిన పనులు శత్రువుకు ముందుగా తెలిసిపోతున్నాయి. బాస్ సునంద నుంచి వజ్రాలహారం సంపాదించి ట్రాన్స్ మీటర్లు కనుగొన్నాడు.

"అంటే సునంద, లీల—ఒకే బాస్వద్ద పనిచేస్తు న్నారా?" అన్నాడు మోహన్ ఆశ్చర్యంగా.

"అవును. కానీ ఆ విషయం వజ్రాలహారం గురించి బైటపడేదాకా వాళ్ళకే తెలియదు. ఇప్పుడు బాస్—ఆ వజ్రాలహారం బహుమతిగా యిచ్చినవాడి వేటలో పడ్డాడు. నిన్ను క్షమించి వదిలిపెట్టడమే కాకుండా నువ్వేం కోరినా యివ్వదల్చుకున్నాడు...." అన్నాడు నడి వయస్కుడు.

"అంటే?" అన్నాడు మోహన్.

"నీ కారణంగా సునంద అనుమానం నించి తప్పించు కుంది. లీలకు బాస్ చేతిలో చావు తప్పింది. వాళ్ళు నిన్ను ప్రేమిస్తున్నారు. వాళ్ళలో ఎవరినైనా నువ్వు కోరుకో వచ్చు...." అన్నాడు నడివయస్కుడు.

సునంద, లీల — భయంకర విషవలయంలో ఉన్నారు. వారిలో ఎవరిని కోరినా వారితో పాటు తానూ ఆ విష వలయంలో చిక్కుకుని పోతాడు. అందులోంచి తప్పించుకుని హాయిగా బ్రతకాలంటే....

అప్పుడు మోహన్ సీతను చూశాడు.

సీత కూడా భయంకర విషవలయంలోనే వుంది. కానీ ప్రేమ బలంపేరు చెప్పిందామె. ఆమె నమ్మకం నిజమయింది.

"ఆలోచించుకోవాలా?" అన్నాడు నడివయస్కుడు.

"అవసరంలేదు. నాకు సీత కావాలి" — అన్నాడు మోహన్.

నడివయస్కుడు సీతవంక చూశాడు. ఆమె ముఖంలో ఆశ్చర్యంలేదు. □

హేర్ కటింగ్?



గరళకంఠుడు

దివాకర్ల సన్యాసిరాజు

ఈజీ చైర్‌లో కూర్చొని—హోమ్‌డెలివరీలో వచ్చిన అపన తిరగేస్తున్నాను.

మాధవి లోపలికొచ్చి—"మీ కోసం ఎవరో కుర్రాడు వచ్చాడండీ." అంది ఓ కాగితం అందిస్తూ.

విప్పి చూశాను. నా పేరు ఎడ్రస్‌తోపాటు, నారాయణ పేరు ఎడ్రస్—మా యిద్దరి సంతకాలు 1984 సం॥ తేదీ వేసివుంది. నాకేం అర్థంకాలేదు.

"ఏంటుందండీ ఆ కాగితంలో"—అంటూ అందుకొని చూస్తోంది మాధవి.

చటుక్కున ఏదో సంఘటన మనస్సులో తళుక్కున మెరిసింది.

"మాధవీ! యిలాతే ఆ కాగితం" అంటూ లాక్కొని వీధిలోకి పరుగెత్తాను.

దాదాపు పదిహేనేళ్ళ కుర్రాడు నిలబడి ఉన్నాడు గుమ్మంలో! గుండ్రంగా ఉన్న ముఖం, చిందరవందరగా నుదుటిమీద పడుతున్న నల్లని ముంగురులు, ఎఱ్ఱగా సుకుమారంగా ఉన్న శరీరం, వింతగా మెరుస్తున్న కళ్ళు, చిరిగిపోయి రంగు వెలిసిపోయిన బట్టలు—మెడభాగం మాత్రం నల్లగా కమిలివుంది.

ఆ కుర్రాడు నావైపుచూసి చిరునవ్వుతో—"నమస్తే రాజుబాబూ! జ్ఞాపకమున్నానా!" అన్నాడు.

"అబ్బాయ్! ఎవరు నువ్వు? ఈ కాగితం నీకెక్కడ దొరికింది?!" అన్నాను అనుమానంగా. తెల్లని ముత్యాల్లాంటి పళ్ళు బయటపడేలా నవ్వాడు కుర్రాడు. "నన్ను మరిచిపోయారా! రాజుబాబు? నారాయణగారు కులాసాయేనా? ఆ బాబెక్కడుంటున్నారు యిప్పుడు?!" అన్నాడు ఇంకా నవ్వుతూనే.

నారాయణ, నేను బాగా పరిచయమున్నట్లు మాట్లాడుతున్నాడు. అనుమానంలేదు. అతడే!?— సంభ్రమాశ్చర్యాలతో మాటరాలేదు నాకు.

"ఏంటండీ? ఎవరీ అబ్బాయి? ఎంతకాలంగానో పరిచయ

మున్నట్లు పలకరిస్తున్నా దేమిటి?" అంది నా వెనుకే వచ్చిన మాధవి.

నా ఆలోచనలు పసిగట్టినట్లుగా—

"నేనే బాబూ ఆ వెంకన్నతాతని" అన్నాడు నవ్వుతూ.

నాతోపాటు మాధవి కూడా తుళ్ళిపడింది.

"నిజంగానా తాతా!! నువ్వేనా!!!" అన్నాను, సంభ్రమాశ్చర్యాలతో.

పకపకా నవ్వింది మాధవి.

"మీకు నిజంగా మతిపోయినట్లుంది. ఈ కుర్రాడ్ని పట్టుకొని 'తాతా' అంటారేమిటి?!" అంది.

"అవునమ్మా నిజమే. నా వయస్సు యిప్పుడు తొంభై సంవత్సరాలు." అన్నాడా కుర్రాడు చిత్రమైన కంఠంతో.

"ఆ!!!" అంది మాధవి ఆశ్చర్యంగా నోరు తెరిచి.

"రా లోపలికి—"

అంటూ హాల్లోవున్న ఈజీచైర్‌లో కూర్చుంటూ ఎదురుగావున్న కుర్చీ చూపించాను కూర్చోమని.

"ఫరవాలేదు బాబూ!" అంటూ లోపలకొచ్చి నిలబడ్డాడు.

"కూర్చో" అంది మాధవి.

క్రింద కూర్చుంటూంటే బలవంతంగా కుర్చీలో కూర్చోబెట్టాను.

"రాజుగారూ! ఆ రోజు మీరు, నారాయణగారూ రాసి యిచ్చిన కాగితం యిదే. మూడేళ్ళ తరవాత ఈ ఎడ్రస్ ప్రకారం మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చాను. మీ సహాయానికి కృతజ్ఞుడ్ని - మీ దగ్గిరే ఏదైనా పని యిప్పించండి బాబు. యిక్కడే ఉంటాను—" అన్నాడా అబ్బాయి.

"అలాగే వెంకన్నా. యింకా నమ్మశక్యం కాని

సంఘటన యిది. మొత్తానికి నీ పట్టుదల నెగ్గించుకున్నావ్. సాధించావ్—" అని "రాఘవా" అనిపిలిచాను.

"వస్తున్నాసార్." అంటూ మా పనికుర్రాడు ప్రవేశించాడు.

"చూడు రాఘవా! ఈ అబ్బాయిని తీసుకెళ్ళి స్నానం అది కానిచ్చి మంచి బట్టలు కట్టించు - మనింట్లోనే ఉంటాడు. వెళ్ళు వెంకన్నా, లోపలకెళ్ళి స్నానంచేసి రా" అన్నాను.

"చాలా సంతోషం బాబూ!" అంటూ నమస్కరించి రాఘవ వెనుకే లోపల కెళ్ళాడు.

అంతవరకూ చేష్ట లుడిగి అలాగే నిలబడిపోయిన మాధవి నా యెదురుగా కూర్చుంటూ "ఏంటండీ యిది? ఆ అబ్బాయి వయస్సు తొంభై సంవత్సరాలా!! ఆశ్చర్యంగా వుంది. ఎవరా కుర్రాడు?" అంది.

"అదో చిత్రమైన కథ మాధవీ!" అంటూ చెప్ప సాగాను.

2

నారాయణ నా మిత్రుడు. జయపూర్‌లో ఫారెస్టు ఆఫీసర్‌గా అప్పుడు పని చేసేవాడు. ఇద్దరం బాల్య స్నేహితులం. ఉద్యోగస్థులయ్యాక విడిపోయాం.

నేను ఉద్యోగరీత్యా జయపూర్ వెళ్ళవలసి వచ్చింది. నారాయణని కలుసుకోవచ్చు అని బైలుదేరాను. ఆదరంగా ఆహ్వానించాడు. సరదాగా రెండు రోజులున్నాను. అతనికి కూడా రైల్వేలోనే జాబ్ దొరికిందట. మరో వారం పది రోజుల్లో వెళ్ళిపోయే ప్రయత్నంలో ఉన్నాడు.

ఇద్దరికీ సరదా ఉండటం వల్ల వేటకు వెళదాం అన్నాడు.

తనే యేర్పాట్లన్నీ చేశాడు. రెండు డబుల్ బేరల్ గన్స్, ఫైవ్ పెల్సు టార్చిలైట్సు, నైన్ యించెస్ డేగర్స్ రెండు, రోప్స్ వేటకి కావలసిన సరంజామా అంతా రెండు కిట్సు యిద్దరికీ రెడీ చేశాడు నారాయణ.

ఇద్దరం బైలుదేరాం. దట్టమైన జయపూర్ అడవిలోకి ప్రవేశించాం.

"రాజూ! ఎంతో జాగ్రత్తగా, మరెంతో అప్రమత్తతో ఉండాలి మనం అనుక్షణం.

ఈ అరణ్యంలో నివసించే ప్రతి చిన్న జంతువూ, ప్రతి చెట్టు, పుట్ట కూడా మనకి యెన్నో తెలియజేస్తాయి. అపరిమితమైన విషజంతువుల నుండీ, అతి క్రూర జంతువులవరకూ సంచరిస్తూ ఉంటాయి. ప్రతి జంతువూ మరో జంతువుకి ఆహారమే. అయినా విచిత్రం ఏమిటో తెలుసా? మరో క్షణంలో ఆపద వచ్చి పడబోతున్నదనగా ప్రతి జంతువు మరో జంతువుకి హెచ్చరికలు అందజేస్తుంది— యిదొక వింత ప్రపంచం.

మనం యీ ప్రపంచంలో అడుగుపెట్టిన మరుక్షణం ప్రమాదం మాటువేసి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నామా మట్టిలో కలిసిపోవలసిందే. ఆరితేరిన వేటగాళ్ళే యెందరో చిన్న పొరపాటుతో ప్రాణాలు పోగొట్టుకున్నట్టు చెపుతున్నాయి అరణ్య పురాణాలు.

నిర్భయంగా మాటువేసి ఉంటుంది ప్రతి జంతువూ ఆహారం కోసం. ఏ మాత్రం మన పాదం అటు పడిందా వెంటనే హెచ్చరిస్తుంది అడుగు ముందుకి వెయ్యొద్దని. ఆ హెచ్చరికని, ఆ సంకేతాల్ని తెలుసుకోలేకపోయామా అపరిమితమైన ఆగ్రహంతో మనమీద దెబ్బతీస్తుంది. ఇవి నేలమీద సంచరించే జంతువుల సంగతి. ఇక చెట్లపై

సంచరించేవి పక్షులు, కోతులు. మన ప్రజన్స్‌కి అలవాటు పడేవరకూ, అలా సంకేతాలు అందజేస్తూనే ఉంటాయి. మనల్ని కంట కనిపెడుతూనే ఉంటాయి—సాధారణ మానవుడికి యివన్నీ తెలుసుకోడానికి తీరికెక్కడదీ?" అన్నాడు నారాయణ.

ఆశ్చర్యంగా వింటున్నాను. నిజమే. తెలుసుకోవలసింది ఎంతో ఉంది.

"ఉష్.....—" మని శబ్దం. నారాయణ నా చెయ్యి పట్టుకొని విసురుగా వెనక్కి గుంజాడు బలంగా. బేలన్స్ తప్పి నాలుగడుగులు వెనక్కిపడ్డాను.

"గెటప్! రాజూ! బీ ఎలర్ట్" అంటూ అరిచాడు నారాయణ.

అప్పుడే నా దృష్టిలో పడింది. నల్లగా మెరుస్తూ అడుగు పైకి, పడగ యెత్తి, బుసలు కొడుతున్న మహాసర్పం.

మెరుపువేగంతో లేచి, డేగర్ తీశాను విసరడానికి సిద్ధంగా.

"ఆగు రాజూ! చంపకు. వెనక్కి పద! మరోవైపు వెళదాం. అదేం చేయదు" అన్నాడు నారాయణ.

ఇద్దరం వెనక్కి జరిగి నిలబడ్డాం.

తక్షణ పడగ దించి ప్రక్కనున్న పొదల్లో దూరిపోయింది వేగంగా.

"చూశావా! మనం మాట్లాడుకుంటూ గమనించలేకపోయాం. అది ఆహారం కోసం మాటువేసి ఉంది. మనం డిస్టర్బ్ చేశాం. అందుకు రావద్దని హెచ్చరించింది. మరొక్క అడుగు వేశావా — కాటందుకునేది. నో డవుట్! ఎంత ప్రమాదం తప్పిందో...." అన్నాడు నారా

యణ.

అలా యెంత దూరం వచ్చామో కూడా తెలీలేదు. మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది. ఈ రాత్రికి అడవిలో ఉండిపోవడానికే నిశ్చయించుకొని బయలు దేరాం. నారాయణకి నాకు కూడా యిదే లాస్ట్ ట్రిప్. ఎందుకంటే అతను కూడా రైల్వేస్‌కి వచ్చేస్తున్నాడు. మే మిద్దరం కలిసి మళ్ళీ యిలా రావడానికి కుదరదు.

అంతవరకూ కొట్టడానికి ఏ జంతువూ దొరకలేదు. అప్పుడే ఓ చెవులపిల్లిని షూట్ చేశాడు నారాయణ. దాన్ని ప్రక్కనున్న చెట్టుకొమ్మకి కట్టేశాడు.

"రిటర్న్ వచ్చేటప్పుడు పట్టుకుపోదాం. మోత దండగ" అన్నాడు నారాయణ.

మరి కొంత ముందుకు పోయాం. అనువైన ప్రదేశం చూసి విశ్రాంతి తీసుకుందామనుకుంటూండగా కనబడిందో గుడిసె.

అడవిలోని కర్రలు, ఆకులతో తల దాచుకోడానికి యేర్పరచుకున్నా రెవరో. అంతకీకారణ్యంలో శాశ్వతంగా నిర్మించుకొన్న ఆ ఏకైక గుడెసె యెవరిది? కుతూహలంగా అటువైపు వెళ్ళాం.

ఆ కుటీరం ముందు చెట్టునీడలో కూర్చొని ఉన్నాడో వృద్ధుడు. జవసత్వాలు ఉడిగిపోయి, జుత్తు పండిపోయి, గెడ్డాలు, మీసాలు పెరిగిపోయిన పండు ముసలివాడు.

"ఎవరు తాతా నువ్వు? ఈ అరణ్యంలో యేం చేస్తున్నావు?" అన్నాను దగ్గిరకెళ్ళి.

"ఎవరు బాబూ మీరు? ఈ అరణ్యంలో కెందు కొచ్చారు?" వణుకుతున్న కంఠంతో మమ్మల్ని చూసి ఎదురుప్రశ్న వేశాడు.

బహుశా నా మాటలు వినబడలేదేమోనని మళ్ళీ అడిగాను.

"క్రూరమృగాలు సంచరించే ఈ అడవిలో యేం చేస్తున్నావు?" అన్నాను.

బోసినోటితో నవ్వాడు. "క్రూరమృగాలు నన్నేం చేస్తాయి బాబూ! పన్నెండేళ్ళుగా ఉంటున్నాను యీ అడవిలో" అన్నాడు.

"ఎందుకూ....ఈ కీకారణ్యంలో ఉండవలసిన అవసరమేమొచ్చింది?" అన్నాను ఆశ్చర్యంగా.

"యిక్కడొక అపూర్వమైన వస్తువుంది బాబూ. దాని కోసం వెతుకుతున్నాను. నా కెవరూ లేరు. పన్నెండేళ్ళుగా ఈ అడవికి, ఈ అడవిలోని ప్రతి జంతువుకి నా ఉనికి తెలుసు. అందుకే వాటి దారి అవి తిరుగుతాయి. నా మానాన నేను ఉంటున్నాను. అలవాటైపోయింది. కానీ నేను వెదుకుతున్న వస్తువు దొరకలేదు ఇంతవరకూ...." అన్నాడు నిరాశగా.

"ఏవిటి తాతా? అంత అపురూపమైన వస్తువు?" అన్నాడు నారాయణ కుతూహలంగా.

"మీకెందుకు బాబూ, చెప్పినా అర్ధం కాదు. వేటకి వచ్చినట్లున్నారు. అదిగో ఆ దిక్కు మాత్రం పోకండి ప్రమాదం" అన్నాడు.

మేం వచ్చిన త్రోవే అది.

"కమాన్ లెటజ్ గో రాజూ!" అన్నాడు నారాయణ.

నారాయణకి సాధారణంగా కనిపించినా, నాకు మాత్రం వింతగానే కనబడిందా వ్యవహారం. అయితే అప్పటికే నారాయణ ముందుకు నడవడంవల్ల నేను కూడా అనుసరించాము. సాయింత్రం వరకూ తిరిగాం.

"పద రాజూ! వెనక్కి పోదాం. చీకటి పడేలోగా మనం అనువయిన చోటు చూసుకోక తప్పదు. యింత వరకూ ప్రశాంతంగా ఉన్న అడవి చీకటి పడేసరికి మేలు కుంటుంది. ఏ చెట్టుమీదో మంచె ఏర్పరచుకొని జాగ్రత్త పడకపోతే ప్రమాదంలో చిక్కుకుంటాం" అన్నాడు నారాయణ.

ఇద్దరం వెనుదిరిగాం. కొంతదూరం వచ్చేసరికి యథా లాపంగా నా దృష్టి అటువయిపు మళ్ళింది.

"నారాయణా ఆగు" అంటూ అటువైపు చూసాను ఆశ్చర్యంగా.

"అది మేం మొదట వచ్చిన ప్రదేశమే. చెవులపిల్లిని చెట్టు కొమ్మకి వేలాడదీసిన చోటు.

అయితే యిప్పుడు చెవులపిల్లి లేదు ఆ కొమ్మకి. ఆ చెవులపిల్లి రక్తమాంసాలు కరిగిపోయాయి సగానికి పయిగా. బొట్లు బొట్లుగా క్రింద పడుతున్నాయి.

క్రింద సుమారు రెండు అడుగులు పొడవు వున్న సన్నని పాము పడగ పైకెత్తి ఉంది. ఆ చెవులపిల్లి రక్త మాంసాలు బొట్లు బొట్లుగా దాని నోట్లో పడుతు న్నాయి.

నాలో సన్నగా వణుకు ప్రారంభమైంది. ఎంత ప్రమాదకరమైన జీవులున్నాయో!

"నారాయణా! పద ఈ రాత్రి ఆ ముసలాడి పాక దగ్గిర గడుపుదాం" అన్నాను.

మెల్లగా యిద్దరం ఆ ముసలాడి పాక దగ్గిరికి చేరు కున్నాం. నారాయణ నీటి కోసం వెళ్ళాడు కిట్ పాకలో ఉంచి.

నేను ముసలాడి దగ్గిర కూర్చున్నాను.

"నీ పేరేమిటి తాతా?" అన్నాను.

"వెంకన్న బాబూ! యిది చాలా ప్రమాదకరమైన స్థలం బాబూ! ఈ రాత్రి ఉండగలరా?" అన్నాడు.

"నువ్వు పన్నెండేళ్ళుగా ఉంటున్న ప్రదేశంలో మేం ఒక్క రాత్రి ఉండలేమా. అయినా మా దగ్గిర ఆయుధాలున్నాయి భయమేమిటి?" అన్నాను.

"నా సంగతి వేరు బాబూ. ఎలాంటి ఆయుధాలున్నా కొన్ని సమయాల్లో నిష్ప్రయోజనమే, అందులోకీ ఈ ప్రదేశంలో."

"మమ్మల్ని భయపెడుతున్నావా తాతా! లేక మేం ఉండటంవల్ల నీ కేదైనా యిబ్బందిగా ఉందా?" అన్నాను చిరాగ్గా.

"అది కాదు బాబూ! ఈ ప్రదేశంలో ఓ విష జంతువు ఉంది బాబూ! అది ఏ జీవినయినా చూస్తే చాలు ఆ జీవి రక్త మాంసాలు కరిగిపోతాయి."

"తాతా! ఆ జంతువుని యిప్పుడే చూశాము...." అన్నాను.

"నిజమా!! ఎక్కడ బాబూ....అదే....ఆ అపూర్వ సర్పం కోసమే యిన్నాళ్ళూ ఎదురు చూస్తున్నాను. ఎక్కడ....ఎక్కడ బాబూ?....నాకు చూపరా!" అన్నాడు ఆత్రుతగా.

ఆ తాత ప్రవర్తనే నాకు వింతగా ఉంది - మొదటి నుంచీ. ఆ సర్పంకోసం ఎదురు చూస్తున్నాడా?

"రా! చూపిస్తాను. నడవగలవా? దగ్గిరేలే" అన్నాను.

వెంటనే కర్ర సాయంతో లేచి పాకలోకెళ్ళి చిన్న డబ్బా పట్టుకొచ్చాడు. "పద....పద బాబూ....దేవుళ్ళా

వచ్చారు. యిన్నాళ్ళకి నా శ్రమ ఫలించింది. ఎక్కడ బాబూ....దూరం నుండే చూపించండి చాలు. దగ్గిర కెళ్ళొద్దు" అన్నాడు నా వెనుకనే నడుస్తూ.

సాయంత్రమైపోయింది. రకరకాల పక్షులు చెట్లమీద చేరి గోల చేస్తున్నాయి.

చెవులపిల్లిని కట్టిన చెట్టు దగ్గిరకి తీసుకెళ్ళి దూరం నుండే చూపించాను. అప్పటికి దాదాపు చెవులపిల్లి పూర్తిగా కరిగిపోయి, అస్తిపంజరం మిగిలింది. మరికొద్ది క్షణాలు ఆలస్యమైతే మరేం మిగలదు, యింకా మిగిలిన చివరి మాంసపు తునకలు రాలుతున్నాయి. ఆ పాము అక్కడే ఉంది.

"బాబూ! దూరంగా ఉండండి. దాని దృష్టిలో పడ వద్దు. సవ్వడి చేయకుండా చూడండి" అంటూ నేలమీద కూర్చుని మెల్లగా దేకుతూ ముందుకు కదులుతున్నాడు.

వింతగా చూస్తూ నిలబడ్డాను దూరంగా.

దగ్గిరగా సమీపించి టక్కున ఆ సర్పం శిరస్సు పిడి కిట్లో పట్టేశాడు-ముసలాడు. వెంట తెచ్చిన డబ్బాలోంచి ఏదో పొడి తీసి ఆ పాము నోటి నిండా కూరేసాడు. డబ్బాలోని మిగతా పొడి పారబోశాడు.

పాము శిరస్సు డబ్బాలో ఉంచి తోకవయిపు పయి కెత్తి గట్టిగా పిండటం మొదలెట్టాడు. అలా నాలుగయిదు సార్లు పిండి చనిపోయి సన్నగా తయారయిన పాముని పొదల్లోకి విసిరేశాడు.

ఆ డబ్బాని జాగ్రత్తగా పట్టుకుని నా దగ్గిర కొచ్చాడు ముసలాడు. అంతవరకూ అతని చర్యల్ని వింతగాచూస్తూ నిలబడిపోయాను.

"పద బాబూ. పన్నెండేళ్ళ నా శ్రమ ఈ నాటితో

ఫలించింది. మీ కెంతయినా ఋణపడి ఉంటాను. మీ దయవల్ల యిన్నాళ్ళకి నా కోరిక నెరవేరింది. యిన్ని సంవత్సరాలుగా ఎండ, వాన, చలి అన్నిటినీ తట్టుకొని ఈ అపూర్వమైన వస్తువు కోసమే యిక్కడ - యీ అడవిలో నంటరిగా ఆకులు, అలములు తింటూ అన్వేషిస్తున్నాను బాబూ!" అన్నాడు ఆ వెంకన్నతాత పాకని సమీపించి నేలమీద చతికిలబడి కూర్చుంటూ.

అప్పుడే వాటర్ బాటిల్‌తో తిరిగొచ్చిన నారాయణకి ఆ విషయం చెప్పాను. అతను కూడా ఆశ్చర్యంగా నిలబడి చూస్తున్నాడు తాతని.

"ఎందుకు తాతా అది. ఏంచేస్తావు?" అన్నాను.

"బాబూ! యిది అపూర్వమైన శక్తికలది. ఆ పాము అడుగున్నరకంటే ఎదగదు. బహుశా ఈ అడవి మొత్తం మీద యిది ఒక్కటే ఉండేమో. మహాప్రమాదకరమైనది. ఎంతటి బలమైన జంతువునైనా సరే. రెప్పపాటు కాలంలో దీని దృష్టిలో పడిందా మరి కదల్లేదు. దీని దృష్టి పడితే చాలు ఇరవై అడుగుల దూరంలోనున్న ఏ జీవి అయినా సరే రక్తమాంసాలు కరిగిపోవలసిందే. పన్నెండేళ్ళుగా దీనికోసమే వేచి ఉన్నాను బాబూ. యింతకాలానికి మీ దయవల్ల దొరికింది.

ఈ విషం మీరు తాగుతారా....యిది ఒక్కరికే పని చేస్తుంది. ఇన్నాళ్ళుగా ఎదురుచూస్తూన్నా. నిజానికి ఇది సాధించింది మీరు కదా. అందుకే అడుగుతున్నాను. మీ యిద్దరిలో ఎవరికైనా కావాలా??" అన్నాడు.

మాకు నిజంగానే మతిపోయింది. ఆ విషం తాగితే మనిషి బ్రతుకుతాడా. ఈ ముసలాడికి పిచ్చిపట్టలేదు కద.

"ఇదిగో ముసలాడా! మాతో పరాచికాలాడకు. ఈ

విషం తాగడమేమిటి?" అన్నాడు నారాయణ కోపంగా.

"లేదు బాబూ! మీతో పరిహాసాలాడతానా. ఈ అపూర్వమైన విషం తాగిన వారికి తిరిగి యవ్వనం వస్తుంది బాబూ! అయితే అందుకు మూడు సంవత్సరాలు పడుతుంది. ఈ విషం తాగిన మరుక్షణం శరీరంలో స్పృహ ఉండదు. మూడేళ్ళు ఆ శరీరం నిద్రావస్థలో ఉండి మార్పుచెందుతుంది. మూడేళ్ళ తరువాత పది—పన్నెండేళ్ళ కుర్రాడి శరీరంలా మారిపోతుంది.

ఇప్పుడు నా వయస్సు ఎనభై ఏడు సంవత్సరాలు. ఈ విషం తాగితే నేను పన్నెండేళ్ళ కుర్రాడిగా మారిపోతాను. అయితే నా శరీరాన్ని మూడు సంవత్సరాలు కాపాడాలి.

బాబూ! ఇది మీకు వింతగానే ఉంటుంది. కానీ మీరిద్దరూ ఎడ్రస్సులు ఓ కాగితంమీద రాయండి. మీ సంతకాలు పెట్టండి. తేదీ రాయండి. ఆ కాగితం పాడైపోకుండా జాగ్రత్తగా నా శరీరం క్రింద ఉంచండి. నేను ఈ విషం తాగిన మరుక్షణం స్పృహ కోల్పోతాను. దయచేసి నా శరీరాన్ని ఆ పాకలోకి చేర్చండి. పాకలోకి ఏ క్రూర జంతువులూ రాకుండా పూర్తిగా మూసేసి మీరు వెళ్ళిపోండి. సరిగ్గా మూడేళ్ళ తరువాత నేను వస్తాను. అయితే ఈలోగా నా శరీరాన్ని ఎవరూ పాడుచేయకుండా ఉండాలి!" అన్నాడు.

నారాయణ, నేనూ సంభ్రమాశ్చర్యాలతో వింటున్నాం. ఇది నిజమేనా. ఈ ముసలాడికెలా తెలుసు యిదంతా.

"నారాయణా! యిదంతా చాలా వింతగా ఉంది. ఈ ముసలాడు చెప్పినట్లు చేద్దాం" అన్నాను.

"నీకేం మతిపోయిందా రాజూ! మనకెందుకీ లేనిపోని గొడవ. ఈ ముసలాడు నిజంగా చచ్చాడంటే...."

"లేదు బాబూ! నామాట నమ్మండి. దీనికి మీరెంత మాత్రం బాధ్యులు కారు బాబూ! నాకెవరూ లేరు. దిక్కు లేనివాడ్ని. పన్నెండేళ్ళుగా ఈ అడవిలో దీనికోసమే ఒంటరిగా బ్రతుకుతున్నాను. మీరేం చేయనవసరం లేదుబాబూ. నా శరీరాన్ని ఆ పాకలోకి చేర్చి పాకని ముళ్ళకంపలతో పూర్తిగా మూసేసి, మీదారిన మీరు వెళ్ళిపొండి. అయితే మీ ఎడ్రస్సు కాగితం మాత్రం నా శరీరం క్రింద ఉంచండి...."

"అదిగో అక్కడే మేం ప్రమాదంలో చిక్కుకుంటాం. ఎవరైనా నీ శరీరాన్ని కదిలించి మా ఎడ్రస్సులు చూస్తే ఏమౌతుందో తెలుసా. నిన్ను మేమే ఏదో చేశామని మమ్మల్ని మూసేస్తారు" అన్నాడు నారాయణ.

బోసినోటితో పగలబడి నవ్వాడు ముసలాడు. "నన్ను నమ్మండి బాబూ! మీ పేర్లయితే గుర్తుంటాయి. కాని మీరెలా గుర్తుపడతారు నన్ను? మీ యెడ్రస్సులు, సంతకాలు ఉన్న కాగితం అదిగో మీ దగ్గిరున్న సీసాలో ఉంచండి. ఆ సీసా పాకలో సరిగ్గా నా కాళ్ళ దగ్గిర గొయ్యితీసి పాతేయండి. అప్పుడు యీ రహస్యం మీకూ నాకూ తప్ప మరెవరికీ తెలీదు కదా! నేను లేచిరాకపోతే భూస్థాపితమైపోతుంది" అన్నాడు ముసలాడు.

అతని తెలివితేటలకి ఆశ్చర్యపోయాను.

"ముసలాడు గట్టివాడే" అన్నాడు నారాయణ.

"సరేలే! ఈ రాత్రి మాకు తోడుగా వుండు. రేపు ఉదయాన్నే మీ పని చేసిపెడతాం—" అన్నాను.

మర్నాడు ఉదయాన్నే ముసలాడు మా కళ్ళెదురుగానే ఆ డబ్బాలోని పాము విషం తాగేశాడు. మరుక్షణంలో విరుచుకుపడిపోయాడు. అతడి కంఠం నల్లగా కమిం

పోయింది.

"పూర్ ఫెలో చచ్చాడు" అన్నాడు నారాయణ.

ముడతలు పడిన ఆ ముసలాడి చెయ్యి పట్టుకుని చూసి "చావలేదు బ్రదర్—పల్సు బీట్ వుంది" అన్నాను.

నారాయణా, నేను ఆ ముసలాడి శరీరాన్ని పాకలోకి చేర్చి, ఓ కాగితంమీద యిద్దరి ఎడ్రస్సులు, సంతకాలు తేదీవేసి, కాగితం రోల్‌చేసి వాటర్‌బాటిల్‌లో ఉంచాను. ముసలాడి కాళ్ళక్రింద డాగర్‌తో మట్టి తీసి బాటిల్ పాతిపెట్టాను. రాళ్ళు, రప్పలు, ముళ్ళకంపలు, ఆకులు, ఎండు కర్రలతో పాక పూర్తిగా కప్పేసి వెళ్ళిపోయాం. తరువాత ఆ విషయమే క్రమంగా మరిచిపోయాం—

3

"అదీ సంగతి. ఆ ముసలాడే యీ కుర్రాడు—" అన్నాను.

"నిజమేనా? యిలా జరుగుతుందా యెక్కడైనా? టెక్నికలర్ సినిమాలు చూపించేస్తున్నారు—" అంది నవ్వుతూ.

నేను చెప్పిన మాటలు నమ్మనప్పుడు టెక్నికలర్ సినిమా చూపిస్తున్నారంటుంది మాధవి.

"లేదోయ్ నిజమే! యింతవరకూ నేను చెప్పింది విన్నావు కదా! యిప్పుడు ఆ కుర్రాడ్ని పిలిచి అడుగు. అతను చెప్పింది కో యిన్‌సైడ్ కాకపోతే అప్పుడను." అన్నాను.

అదే సమయంలో అడుగు పెట్టాడు వెంకన్న. స్నానంచేసి రాఘవ బట్టలు వేసుకున్నాడు. చక్కగా వున్నాడు.

"వెంకన్నా! అలా కూర్చో. ఆ రోజు గుర్తుందా?

జరిగిం దేమిటో చెప్పు!....యీవిడ నమ్మటం లేదు" అన్నాను.

అప్పుడే మా అమ్మాయి పప్పీని తెచ్చి నా కందించాడు రాఘవ. ఏడాది వెళ్ళి రెండో యేడు వస్తోంది. ఇంత లేసి కళ్ళతో కొత్తముఖంగా వున్న వెంకన్నని చూస్తోంది నా ఒడిలో కూర్చొని.

ఆ రోజు జరిగింది పూస గుచ్చినట్లు చెప్పాడు వెంకన్న.

మాధవి యింకా వింతగా చూస్తోంది.

"నిజమే నువ్వు చెప్పింది! నువ్వు ఆ వెంకన్న తాతవే. ఆ నాటి ముసలాడివే. అయితే యీ కాలంలో యిలాంటి అద్భుతాలు జరగడం ఆశ్చర్యంగానే ఉంది" అన్నాను.

"ఆశ్చర్య పోడానికేంలేదు బాబూ! మన పూర్వకాలం నాటి వైద్య గ్రంథాల్లో యిలాంటి చిత్రవిచిత్రమయిన అద్భుతాలెన్నో వివరించబడ్డాయి. వాటిని సాధించడం అందరికీ సాధ్యపడదు. నిరంతర కృషి, పట్టుదల, ఓర్పు, సహనం వుండాలి. యే నూటికో, కోటికో ఒకరు తప్ప సాధించలేరు బాబూ!" అన్నాడు వెంకన్న.

4

వారం రోజులు గడిచిపోయాయి.

ఆ రోజు ఆఫీసులో ఉండగా యింటి నుండీ మాధవి ఫోన్ చేసింది. ఉన్నఫళంగా వెంటనే రమ్మని.

ఎందుకో అర్థంకాలేదు.

ఆఫీస్ జీపుమీద బయలుదేరాను. నా బంగళా ముందు జనం గుంపులుగా నిలబడి వున్నారు.

నాలో ఆతృత, ఆందోళన అధికమైంది.

బంగళాకి కొంచెం దూరంలో కారు ఆపేశాడు డ్రైవరు. దిగి పరిగెత్తాను జనం మధ్యగా.

గుండె ఆగినంత పనైంది. ఆ ఘోరదృశ్యం చూశ్నేక కళ్ళు గట్టిగా మూసుకున్నాను. తూలి పడబోతే యెవరో పట్టుకున్నారు.

వెంకన్న బంగళా గేటుముందు రోడ్డుమీద రక్తపు మడుగులో నిర్జీవంగా పడివున్నాడు.

గబగబా బంగళాలో ప్రవేశించాను.

మాధవి, రాఘవ ఎదురయ్యారు.

"ఏమండీ, మన పప్పీని రక్షించబోయి పాపం: వెంకన్న కారుక్రింద పడిపోయాడండీ...." యేడుస్తూ అంది మాధవి పప్పీని అందిస్తూ.

అంతవరకూ మాధవి దగ్గిరున్న పప్పీ నా దగ్గిర కొచ్చేసింది.

"అసలేం జరిగింది?" అన్నాను రాఘవతో.

"పాప, వెంకన్న బంతి ఆడుకుంటున్నారు సార్! పాప బంతీని గట్టిగా విసిరేసరికి రోడ్డుమీదికి పోయింది. పాప కూడా బంతికోసం రోడ్డునయిపు వెళ్ళింది. అప్పుడే రోడ్డుమీద కారు వస్తోంది. పాపని పక్కకి లాగి, వెంకన్న కారుక్రింద పడిపోయాడు సార్...."

పప్పీని—మా అమ్మాయిని రక్షించబోయి తను కారుక్రింద పడ్డాడా!! వెంకన్న చచ్చిపోయాడా?

వెంకన్న ఎంతో శ్రమపడి తిరిగి యవ్వనం పొందాడు. అయితే నుదుటిరాతను తప్పించుకోలేకపోయాడు! తొంభైయేళ్ళే అతనికి బ్రహ్మ రాసిపెట్టాడేమో! నా మనసు మౌనంగా రోదించింది. □

మినీ సీరియల్ -

జలసమాధి

వి.యస్.రావ్



(గతసంచిక తరువాయి)

17

కాఫిన్‌లో వెల్లకిలా పడుకుంది; గోడకి అతుక్కు-పోయిన బల్లిలా. ఆమె ధరించిన జీన్సూ, బుష్‌షర్టూ చెమటతో తడిసిపోయి వున్నాయి. బాబ్డ్ హెయిర్ చిందర

వందరగా వుంది. వెంట్రుక పాయల్ని చెమట ఆమె నుదురుకి అతికించింది. ఛాతీప్రాంతంలో గళ్ళబుష్‌షర్ట్ కదుల్తోంది....

అందరూ భయాందోళనలతో ఆమెనే చూస్తున్నారు.

"అమ్మా .... వనితా ....?" మనోహర్రావు కంఠం అక్కడ తాండవిస్తున్న స్మశాన నిశ్శబ్దాన్ని హఠాత్తుగా భంగం చేసింది.

రెప్పపాటు లేకుండావున్న వనిత కళ్ళు కదిలాయి. తుమ్మెద రెక్కల్లా రెప్పలు టపటపలాడాయి. వాచినట్టున్న ఎర్రటి పెదవులు కదిలాయి....

"డా....డీ...." ఎవ్వరికీ వినిపించకుండా రహస్యం పలుకుతున్నట్టు గుసగుసగా అందామె. పైపుచుట్టూ బిగుసుకున్న ఆమె వేళ్ళు అసంకల్పితంగా వదులయ్యాయి.

పోలీస్ ఫోటోగ్రాఫర్ చేతుల్లోని కెమేరా జిగేల్ జిగేల్ మంటోంది.

వనిత తన చుట్టూ వంగిన తలల్ని అయోమయంగా కలయజూసింది. తన ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోడానికి ఆమెకి కొన్ని క్షణాలు పట్టింది. మోచేతుల్ని కింద ఆన్చి ఆమె పైకి లేచే ప్రయత్నం చేసింది

డిటెక్టివ్ టెంపో తటాలున కిందికి వొంగాడు, పృథ్వీ రావ్ వైపు చూస్తూ. వాళ్ళ ఇద్దరి చేతులూ వనిత రెండు చేతుల్నీ పట్టుకున్నాయి. రబ్బరు బొమ్మని ఎత్తుతున్నట్టు ఇద్దరూ ఆమెని సున్నితంగా పైకి లేవనెత్తారు.

మనోహర్రావు ముందుకి జరిగాడు. అతని చేతులు వణుకుతూ వనితని చుట్టేశాయి.

"వనితా ....మై డార్లింగ్ ...." మనోహర్రావు కలవరిస్తున్నట్టు బొంగురుగా పిలిచాడు. కన్నీళ్ళు అతన్ని తాక్కా

లికంగా గుడ్డివాణ్ని చేస్తున్నాయి.

"నాన్నా...." తండ్రి మెడచుట్టూ చేతుల్ని పెనవేసి వనిత వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

డిటెక్టివ్ టెంపో, పృథ్వీరావ్ మెల్లిగా ఆమెని కాఫిన్ లోంచి ఇవతలికి నడిపించారు.

"కుమార్, స్ట్రెచర్!" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అరిచాడు.

తటాలున వనిత ఏడుపు ఆపేసింది. "ఒద్దు....నేను.. నడుస్తాను....ఐ వాంట్ టూ వాక్...." అందామె.

"లెట్ హర్ వాక్. పృథ్వీ!" టెంపో నవ్వుతూ అన్నాడు. "మిస్టర్ మనోహర్రావ్, వనితని ఈ కాఫిన్ కి దూరంగా తీసుకెళ్దాం!"

మనోహర్రావు ప్రయత్నించి, తన కూతుర్ని పట్టుకున్న చేతుల్ని దూరంగా లాగాడు. అప్రయత్నంగా వనిత ఒకసారి కాఫిన్ వైపు తలతిప్పి చూసింది. ఆమె శరీరం జలదరించడం టెంపో గమనించాడు. వనిత తడబడే అడుగులతో కదిలింది....

గట్టుమీద, ఆంబులెన్స్ దగ్గిరగా అందరూ గుండ్రంగా నిలబడ్డారు.

మధ్యలో వనితా, మనోహర్రావూ నించున్నారు. అతని చెయ్యి వాత్సల్యంగా, ధైర్యంగా కూతురి భుజాల్ని చుట్టింది. ఆనందంతో, విజయగర్వంతో అతని మొహం వెలిగిపోతోంది. తలపైకెత్తి, ధారాళంగా గాలిపీల్చుకుంటూ వనిత రెండు చేతుల్తో బాబ్ హెయిర్ని సర్దుకుంది. ఆమె తల మెల్లిగా తన తండ్రివేపు తిరిగింది.

"డాడీ....నన్ను....ఎలా కనిపెట్టావ్? ఇంక భూమి మీదికి రానేమో అని భయపడిపోయాను...." వనిత

కంఠం పణికింది.

"నేను....కనిపెట్టలేదు తల్లీ....ఇంతమందీ నీకోసం నిర్విరామంగా అన్వేషించారు....ముఖ్యంగా డిటెక్టివ్ టెంపోగారూ, ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్‌గారూ...." మనోహర్రావు అందర్నీ కలయజూస్తూ అన్నాడు.

వనిత చేతులు జోడించి అందరివైపూ కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. అందరి మొహాల్లో సూర్యకాంతిలా మెరుస్తూన్న ఆనందాన్ని ఆమె చూడగలిగింది. చెమ్మగిల్లిన కళ్ళని యూనిఫాంలో వున్న ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్‌వైపు తిప్పింది.

"ఇన్స్‌పెక్టర్‌గారూ, జీవితాంతం మీకు ఋణపడి వుంటాను....థాంక్స్ ఎ లాట్!"

ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ తలాడిస్తూ నవ్వాడు. "ఫర్గెట్ టిట్. నిజం చెప్పుకోవాలంటే నా మిత్రుడు డిటెక్టివ్ టెంపో రంగంలోకి దిగకపోయి వుంటే....నిన్ను—కనిపెట్టి వుండేవాళ్ళం కామేమో...." అంటూ సగర్వంగా టెంపో భుజంమీద చెయ్యివేశాడు.

వనిత కళ్ళు పెద్దవిగా అయ్యాయి. తలతిప్పి తండ్రివైపు చూసిందామె.

మనోహర్రావు అవునన్నట్టు తలాడించాడు. "అవునమ్మాయ్. టెంపోగారు చాలా చిన్న ఆధారంతో నిన్ను కనిపెట్టారు. చెప్పాలంటే మనోనేత్రంతో, మూడో కంటితో భూగర్భంలో పడున్న నిన్ను ఆయన దర్శించారు!"

అప్రయత్నంగా వనిత ముందుకి జరిగింది. పృథ్వీరావ్ పక్కనే చిరునవ్వుతో నించున్న డిటెక్టివ్ టెంపో కళ్ళల్లోకి తదేకంగా చూసింది. ఆరుతున్న కళ్ళు మళ్ళీ నీళ్ళతో

నిండసాగాయి.

రెప్ప వేయకుండా తననే చూస్తున్న ఆమె కళ్ళల్లోకి షెంపో రెప్పవేయకుండా చూశాడు.

వనిత మరికొంచెం ముందుకి కదిలింది. ఆమె కుడి చెయ్యి షెంపోవైపు సాగింది. నవ్వుతూ షెంపో తన చేతిని ముందుకి చాపాడు.

"వనితా, యూ ఆర్ లక్కీ....యూ ఆర్...."

వనిత తటాలున ముందుకి వాలింది. రెండు తుళ్ళచే ఎత్తుగావున్న షెంపో భుజాలచుట్టూ బిగించి, అతన్ని కౌగి లించుకుంది. ఆమె మొహం అతని ఛాతీమీద వాలిపో యింది. మరుక్షణం ఆమె వెక్కుతున్న శబ్దం అందరికీ వినిపించింది. బలహీనంగా ఎగిరెగిరి పడుతున్న ఆమె వీపుచుట్టూ, షెంపో చెయ్యి బిగుసుకుంది. కుడిచేత్తో ఆమె బాబ్డ్ హెయిర్ని అతను ధైర్యంచెప్తూ నిమిరాడు.

"వనితా....నువ్వు క్షేమంగా వున్నావ్: ఏడవకు!" అన్నాడతను ఓదార్పుగా.

క్రమంగా వనితలో చెలరేగిన ఆవేశతరంగాలు తగ్గు ముఖం పట్టాయి. మెల్లిగా ఆమె కొంచెం దూరంగా జరి గింది. కన్నీళ్ళతో తడిసిన మొహాన్ని షెంపోవైపు పైకి ఎత్తింది.

"షెంపోగారూ....వాళ్ళని....నన్ను సజీవంగా సమాధి చేసిన ఆ రాక్షసుల్ని... పట్టుకున్నారా?" వణికే కంఠంతో ఆమె ప్రశ్నించింది. ఎర్రటి కళ్ళు ఆమెలోని ఆగ్రహానికి, పగకూ పట్టిన అద్దాల్లా వున్నాయి.

షెంపో చిరునవ్వు నవ్వాడు. "పట్టుకుంటాం; నీ సహ కారంతో!"

వనిత ఉద్రేకంతో చూసింది. ఆమె పిడికిళ్ళు అప్రయ

త్నంగా బిగుసుకున్నాయి. "వాళ్ళని శిక్షించేదాకా నేను నిద్రపోను!"

"ఎక్సలెంట్! దెన్ లెట్స్‌గో?" టెంపో నవ్వుతూ అన్నాడు....

18

డిన్నర్ ముగించి, డిటెక్టివ్ టెంపో సిగరెట్ వెలిగించి, కుర్చీలో వెనక్కివాలాడు. చిరునవ్వుతో ఎదురుగా కూచున్న మనోహర్రావుని చూశాడు.

మనోహర్రావు మొహంలో పట్టరాని ఆనందం నాట్యం చేస్తోంది.

టెంపో చూపులు మెల్లిగా పక్కకి తిరిగాయి.

సోఫాలో వనితా, ఆమె తల్లీ పక్కపక్కనే కూచున్నారు. వెనక్కివాలి కూచున్న కూతురి చేతిని వొళ్ళో పెట్టుకుని, ప్రేమగా నిమురుతోంది అమృత.

డిటెక్టివ్ టెంపో కుర్చీలోంచీ లేచి, సోఫావైపు నడిచాడు. నవ్వుతూ ఆమె మొహంలోకి చూశాడు.

దుస్తులు మార్చుకున్న వనిత అప్సరసలా వుంది. ఆమె కళ్ళల్లో, మొహంలో ఏదో అలసట లీలగా గోచరిస్తోంది. చెవికింద చిన్న ప్లాస్టర్ వుంది.

"వనితా, వాళ్ళు నిన్ను కార్లోంచీ, వ్యాన్‌లోకి ఎక్కించారు. తరవాత ఏం జరిగింది?" అడిగాడు టెంపో.

"అదంతా అప్పుడే ఇన్స్‌పెక్టర్‌కి చెప్పానుగా? మీరు విన్నారు!" వనిత సన్నటి కంఠంతో అంది.

"నేను మళ్ళీ వింటాను!" టెంపో నవ్వుతూ అన్నాడు; వనిత కళ్ళల్లోకి చూస్తూ. తను అనుభవించిన నరకం గురించి మళ్ళీ చెప్పాలన్న భయం ఆమె కళ్ళల్లో స్పష్టంగా అవుపిస్తోంది.

"మిస్టర్ టెంపో! అమ్మాయి ప్రాణాల్తో దక్కింది. అదే చాలు. ఆ దుర్మార్గుల్ని పట్టుకోవడం కోసం మీరు వనితని వివరాలు అడుగుతున్నారని నాకు తెలుసు. వాళ్ళకి గిరాటేసిన డబ్బు నాకు చింతపిక్కలతో సమానం!" మనోహర్రావు కల్పించుకుని అన్నాడు.

డిటెక్టివ్ టెంపో చూపుల్ని మనోహర్రావువైపు తిప్పాడు. అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాడు. "మిస్టర్ మనోహర్రావ్, మీ అమ్మాయి దొరికింది; మీరు తృప్తి పడుతున్నారు. అపరాధి దొరికితే గాని నేను తృప్తి పడను!"

మనోహర్రావు యేదో చెప్పబోయాడు. అయితే వనిత కంఠం అతనికి అడ్డు తగిలింది. "ఎస్! నన్ను కాఫిన్‌లో పెట్టి పాతిపెట్టిన ఆ రాక్షసులకి శిక్ష పడి తీరాలి! మిస్టర్ టెంపో వాడు....వాడు నిర్దాక్షిణ్యంగా నా మెడమీద కత్తితో గాయం చేశాడు! నా రక్తాన్ని చేత్తో తుడిచి, ఆ చేతిని నాకు చూపించాడు! జరిగిందంతా మీకు మళ్ళీ వినిపిస్తాను!" అంటూ ఆగి, వనిత ప్రారంభించింది:

టెంపో సిగరెట్ పీలుస్తూ వినసాగేడు.

"........ఆ తరువాత మోతీగాణ్ని మెల్లిగా లొంగదీసుకోడానికి ప్రయత్నించాను. వాణ్ని వ్యాన్‌లోకి తీసుకెళ్ళాను. అయితే వాడు—జానీ అక్కడ ప్రత్యక్షమయ్యాడు. గునపం పారా మోయించుకుని మోతీని యెక్కడికో తీసుకెళ్ళాడు. వ్యాన్ రాడ్‌కీ నా చేతికీ బేడీ వేశాడు. భయంతో ఆలోచిస్తూ అలాగే కూచున్నాను. వ్యాన్‌లోవున్న కాఫిన్‌ని చూస్తూ రకరకాలుగా భయపడ్డాను. నన్ను చంపేసి పాతేస్తారా? కాఫన్ దేనికి? కాస్సేపట్లో తెల్లారుతుందనగా యిద్దరూ తిరిగొచ్చారు...."

వనిత ఆగి మళ్ళీ ప్రారంభించింది:

"జానీ అప్పుడు నాకు అంతా వివరించాడు. 'నిన్ను కాఫిన్‌లో పడేసి, మట్టికింద దాచిపెడతాం. నువ్వెక్కడున్నావో చెప్పడానికి మీ నాన్న కొంచెం పైకం చెల్లించాలి. కాఫిన్‌లో హాయిగా పడుకొని, మీ నాన్న నేను అడిగిన మొత్తం అందజేయాలని ప్రార్థిస్తూ వుండు!' అన్నాడతను. నేను భయంతో అరిచాను. వాళ్ళని తిట్టాను. వదిలిపెట్టమనీ, నాన్నని అడిగి డబ్బు యిప్పిస్తాననీ అన్నాను. జవాబుగా వాడు—ఆ జానీగాడు నా చెంప పగలగొట్టాడు.

"తరువాత కాఫిన్ పై భాగాన సన్నటి రంధ్రం చేశాడు. ప్లాస్టిక్ పైప్‌ని అందులో ఫిక్స్ చేశాడు. అరుస్తూన్న నన్ను యిద్దరూ పట్టుకుని కాఫిన్‌లో పడేశారు. ఆ గొట్టంగుండా గాలి పీల్చుకొమ్మని హెచ్చరిస్తూ మూత వేశారు. ఆ క్షణంలో....ఆ క్షణంలో గుండె ఆగి చచ్చిపోతానేమో అనిపించింది....మైగాడ్....ఆ భయంకరమైన అనుభవం....తరువాత వ్యాన్ కదిలింది. అర గంటో, గంటో నాకు తెలీదు. ఏదో అంధకారంలో కాటుక సముద్రంలో మునిగిపోయాను....

"వ్యాన్ ఆగింది. బాక్స్ బైటికి లాగబడింది. బాక్సు మోసుకెళ్తున్నట్టు గ్రహించాను. లీలగా యేవో అర్థంకాని శబ్దాలు కాసేపు వినిపించాయి. కాసేపు తరువాత కాఫిన్ మీద బరువుగా యేదో పడుతున్నట్టు అనిపించింది. ఆ తరువాత చిక్కటి నిశ్శబ్దం....చిమ్మచీకటి....ఆ ఛందాలుడు చెప్పినట్టే నాన్న వాళ్ళకి డబ్బు యివ్వాలని ప్రార్థిస్తూ వుండిపోయాను...."

వనిత ఆగి ఎర్రటి కళ్ళతో చూసింది. ఆమె అమ్మా నాన్నా యిద్దరూ టెంపోవైపు చూస్తున్నారు.

"వనితా, వాళ్ళ సంభాషణ ఆధారంతో ఇద్దరి పేర్లూ తెలుసుకోగలిగావు. ఇంకా వాళ్ళ గురించీ, వాళ్ళు ఉపయోగించిన వ్యాన్ గురించీ నీకేం తెలుసు?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

"నన్ను కార్లోంచీ దించి, వ్యాన్ దగ్గిరికి తీసుకెళ్ళే సరికి బాగా చీకటిపడింది. అయినా అది మహీంద్రా వ్యాన్ అని పోల్చుకోగలిగాను. ఆందోళనలో వున్నా కూడా, నెంబరు చూడ్డానికి ప్రయత్నించాను. వీలుకాలేదు...."

"ఆల్‌రైట్....ఇంతా చేసిన వ్యక్తులు వ్యాన్ నెంబర్ని మార్చేవుంటారు. మరేం ఫర్వాలేదు....వాళ్ళ ప్రవర్తననుబట్టీ, సంభాషణనుబట్టీ వాళ్ళ గురించి నువ్వు ఎంతో కొంత గ్రహించి వుండాలి...." టెంపో వనిత కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ఆగాడు.

"కారు వెనకసీటు కింద దాక్కుని నన్ను గాయపరచి, తీసుకెళ్ళినవాడు—జానీ—మొండికత్తితో గొంతులుకోసే రకం. ఇద్దర్లో నాయకుడు అతనే. అతను నోరు తెరిస్తే మోతీ నోరు మూసుకుని, చెవులు రిక్కించేవాడు. అతని మాట మోతీమీద గుర్రంమీద కమ్చీ దెబ్బలా పనిచేసేది. జానీ ఆజ్ఞాపిస్తే మోతీ కిక్కురుమనకుండా బానిసలా పని చేసుకుపోయాడు. మోతీలో బలహీనత వుంది. జానీలో అలాంటి బలహీనత అవుపించలేదు ..." వనిత ఆగి, టెంపోవైపు చూసింది.

"వెరీగుడ్! వనితా, ఇద్దర్నీ నువ్వు బాగా స్టడీచేశావు. మరో సంగతి: బాగా గుర్తుచేసుకో. పని పూర్తయ్యాక, డబ్బు చేతిలోకి వచ్చాక యేంచేయాలో వాళ్ళు యేదేనా

ప్లాన్ చేశారా?"

కాఫిన్‌లో పడుకోబెట్టేదాకా వాళ్ళు డబ్బుకోసం అంతా చేస్తున్నట్టు నాకు అర్థంకాలేదు. ప్లాన్ గురించి వాళ్ళు అస్సలు మాట్లాడుకోలేదు."

డిటెక్టివ్ టెంపో పచార్లు మాని వనిత ముందు నిల బడ్డాడు. రెండు చేతుల్నీ కోటు జేబుల్లో దోపుకుని తల పైకెత్తి సీలింగ్‌ఫాన్‌వైపు చూస్తూ వుండిపోయాడు. కాసేపయ్యాక తల కిందికి దించి మనోహర్రావువైపు చూశాడు.

"ఆధారాలు వదలకుండా వాళ్ళు అతి చాకచక్యంగా అంతర్ధానమయ్యారు!" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

మనోహర్రావు ఆవులిస్తూ కరోనా వెలిగించాడు. పొగ ఊదుతూ నిరుత్సాహంగా టెంపోవైపు చూశాడు.

"మిస్టర్ టెంపో, ఫర్గెట్ దోస్ బాస్టర్డ్స్! వాళ్ళ తెలివితేటల్ని బుర్రతో అధిగమించి మీరు అమ్మాయిని కనిపెట్టి కాపాడారు! మీ ఫీజు యెంతో చెప్పండి. హాయిగా విశ్రాంతి తీసుకోండి. నేరస్థులు ఎప్పుడో అప్పుడు పోలీసులకి చిక్కుతారు!"

డిటెక్టివ్ టెంపో పక్కకి కదిలి మనోహర్రావు ముందు ఆగాడు. అతన్ని తీక్షణంగా చూశాడు. "మిస్టర్ మనోహర్రావ్, మళ్ళీ చెప్తున్నా; దొంగలించబడిన సొత్తు సగం దొరికాక, దొంగతనం చేసిన వ్యక్తిని మరిచిపోయి తృప్తిపడే తత్వంకాదు నాది! సంఘానికి కీడు కలిగించే దుర్మార్గులు శిక్షించబడేదాకా మనిషి తృప్తి చెంద కూడదు!"

"ఒప్పుకుంటాను. అయితే మీకు ఆధారాలు లేవుగా!" మనోహర్రావు నవ్వుతూ అన్నాడు.

డిటెక్టివ్ టెంపో మాట్లాడకుండా జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు. సిగరెట్‌ని ఇవతలికి లాగి పెదాల మధ్య ఇరికించాడు. ఏదో ఆలోచిస్తూ మెల్లిగా సిగరెట్‌ని వెలిగించాడు. పొగ ఊదుతూ మనోహర్రావుని తదేకంగా చూశాడు.

"మిస్టర్ మనోహర్రావ్, ఆధారాలు మీరు ఇస్తారు!"

"నేనా?" మనోహర్రావు కంఠంలో ఆశ్చర్యం ధ్వనించింది.

"కిడ్నాపర్‌కి మీరు డబ్బు ఎలా చెల్లించారు?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

"మీకూ తెలుసు. సూట్‌కేసులో సర్ది...." మనోహర్రావు ప్రారంభించాడు.

"అదికాదు! సూట్‌కేసులో సర్దడానికి డబ్బు ఎక్కణ్నుంచీ తెచ్చారు?" డిటెక్టివ్ టెంపో అడ్డొస్తూ అడిగాడు.

"ఎక్కణ్నుంచీ తెస్తాం? బ్యాంకులోంచీ...."

"మొత్తం పైకాన్ని మీరే బ్యాంకులోంచీ విత్‌డ్రా చేసి పట్టుకొచ్చారా?" టెంపో అడిగాడు.

"ఆఫ్ కోర్స్....మొత్తమంతా నేను పట్రాలేదనుకోండి. చాలామట్టుకు ఫ్యాక్టరీ మేనేజర్ విత్‌డ్రా చేశాడు...." టెంపో ప్రశ్నల వరస అర్థంకాని మనోహర్రావు మెల్లిగా జవాబిచ్చాడు.

"అంత పెద్ద మొత్తాన్ని మేనేజర్ ఎందుకు విత్‌డ్రా చేశాడు?"

"వర్కర్స్‌కి జీతాలివ్వడానికనుకోండి....ఇంతకీ...."

"మిస్టర్ మనోహర్రావ్, ప్రతీ నెలా ఇరవై ఆరో తారీఖునే మీరు జీతాలు బట్వాడా చేస్తారా?" టెంపో

ప్రశ్న అతన్ని మళ్ళీ అడ్డుకుంది.

"ఆఫ్ కోర్స్ మొదటితేదీనాడే పేమెంట్స్ జరుగుతాయి. అయితే ఉగాది పండగ దృష్ట్యా ముందుగా ఇవ్వాలన్నారు వర్కర్స్ యూనియన్‌వాళ్ళు. అంచేత ఇరవై ఆరో తేదీ...."

"ఇరవై ఆరో తేదీ ఇవ్వాలని ఎప్పుడు నిర్ణయించారు?"

"ఇరవై నాలుగు సాయంత్రం నిర్ణయించాం.... టెంపోగారూ....మీరు...."

"మిస్టర్ మనోహర్రావ్, ఇరవై ఆరు పేదే అనీ, మేనేజర్ విత్‌డ్రా చేసిన సొమ్మును బట్వాడా చేయకుండా తనకి బదిలింపులు చేయమనీ కిడ్నాపర్ మీకు సూచన ఇచ్చాడు. అవునా?" డిటెక్టివ్ టెంపో గంభీరంగా ప్రశ్నించాడు.

మనోహర్రావు కళ్ళు పెద్దగా చేసి, ఆశ్చర్యంగా చూశాడు. "ఆఫ్...కోర్స్...."

"అడ్వాన్సుగా మీరు జీతాలు బట్వాడా చేస్తున్నట్టు కిడ్నాపర్‌కి ఎలా తెలుసు?"

మనోహర్రావు టెంపో మొహంలోకి అర్థం కానట్టు చూశాడు.

"నాకు తెలీదు...."

సగం పైగా కాలిన సిగరెట్‌ని టెంపో హాలు మూలకి విసిరాడు. రెండుసార్లు అటూ ఇటూ తిరిగాడు. కొత్త సిగరెట్ వెలిగించి మనోహర్రావు వైపు తదేకంగా చూశాడు.

"మిస్టర్ మనోహర్రావ్, మీ మేనేజర్ ఎవరు?"

"ముకుందమూర్తి."

"ముకుందమూర్తి ఎలాంటివాడు?"

"మెషినరీని హాండిల్ చేయడంలో నా ఫ్యాక్టరీ వర్కర్సు ఎక్స్‌పర్ట్స్. వర్కర్స్‌ని హాండిల్ చేయడంలో ముకుందమూర్తి ఆరితేరినవాడు!" మనోహర్రావు నవ్వుతూ అన్నాడు.

"వ్యక్తిగతంగా ఎలాంటివాడు?"

"ఇంట్లో నా భార్యని నమ్మినట్టు, వ్యాపారంలో అతన్ని నమ్ముతాను. ముకుందం చాలా మంచివాడు!"

"మిస్టర్ మనోహర్రావ్, మీ ముకుందంతో నేను అత్యవసరంగా మాట్లాడాలి!"

మనోహర్రావు సాలోచనగా చేతి గడియారం చూసుకున్నాడు.

"పన్నెండు కావొస్తోంది .... అతను నిద్రపోతూ వుంటాడు...." అన్నాడు సందేహిస్తూ.

"అతను ఏం చేస్తున్నా ఐడోంట్ కేర్! తక్షణం అతను ఇక్కడ ప్రత్యక్షం కావాలి!" టెంపో దృఢంగా అన్నాడు.

మనోహర్రావు మెల్లిగా సోఫాలోంచి లేచాడు. గోడవారగా టేబుల్ మీదున్న టెలిఫోన్‌వైపు అడుగువేశాడు.

సోఫాలో కూచుని టెంపో అలసటగా కళ్ళు మూసుకున్నాడు. టెలిఫోన్లోకి మాట్లాడుతున్న మనోహర్రావు కంఠం అతనికి వినిపించసాగింది....

19

డిటెక్టివ్ టెంపో టీ చప్పరిస్తూ, ఎదురుగా కూచున్న మనోహర్రావునీ, ముకుందమూర్తినీ చూస్తూ వుండిపోయాడు.

ముకుందమూర్తి బక్కపల్చగా, పొడుగ్గా వున్నాడు. అర్ధరాత్రప్పుడు కూడా అతని క్రాపు నున్నగా వెనక్కి

దువ్వబడింది. పొడుగాటి మొహం. పొడుగాటి ముక్కు. గుబురుగావున్న కనుబొమల కింద తళుక్కుమంటున్న చిన్న చిన్న కళ్ళు. చెవుల్లోంచీ బైటికి మొలిచిన వెంట్రుకలు.

మనోహర్రావు తగ్గు స్వరంలో జరిగిందంతా అతనికి చెపుతున్నాడు. అంతులేని ఆశ్చర్యం ముకుందమూర్తి రెప్పల్నీ, నోటినీ పర్మనెంటుగా తెరిచే వుంచేసింది.

"మైగాడ్! ఉన్నట్టుండి ముకుందమూర్తి అరిచాడు. "జీతాలు బట్వాడా చేయొద్దంటే ఎందుకో అనుకున్నాను. ఆ కాషంతనీ మీరు ఇంటికి పట్రమ్మన్నప్పుడూ ఊహించ లేకపోయాను."

మనోహర్రావు కరోనా వెలిగిస్తూ తల పంకించాడు. ముకుందమూర్తి తల మెల్లిగా వనితవయిపు తిరిగింది. "మిస్ వనితా! అయామ్ సారీ....అండ్ అయామ్ హాపీ!" అన్నాడతను. వనిత చిన్నగా నవ్వింది.

డిటెక్టివ్ టెంపో లేచి, ముకుందమూర్తి దగ్గరగా నడిచాడు.

"ముకుందంగారూ, ఇప్పుడు మీరు విన్నదంతా మరిచి పోవాలి."

"అఫ్‌కోర్స్...." ముకుందం సందేహిస్తూ మొహానికి పట్టిన చెమటని అరచేత్తో తుడుచుకున్నాడు.

"ముకుందం, డిటెక్టివ్ టెంపోగారు నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతారు...." మనోహర్రావు కల్పించుకుని అన్నాడు. ముకుందం మౌనంగా తల పంకిస్తూ, సందే హిస్తూ టెంపో వయిపు చూశాడు.

"మిస్టర్ ముకుందం, ముందు గదిలో కెళదాం...." అంటూ టెంపో హాల్లోంచి ఇవతలకి నడిచాడు.

"ఏం చేయమంటారు?" అన్నట్టు ముకుందమూర్తి మనోహర్రావు వయిపు చూశాడు. చెమటతో తడుస్తున్న అతని నుదుర్ని అర్థం కానట్టు చూశాడు మనోహర్రావు.

"ముకుందం వెళ్ళు. టెంపోగారు ఏమడుగుతారో తెలీదు. నీకు తెలిసిందంతా చెప్పు" మనోహర్రావు సలహా యిచ్చాడు.

ముకుందం నిద్రాభంగంవల్లా, కంగారువల్లా ఎరుపెక్కిన కళ్ళతో గదిలో వున్న ముగ్గుర్నీ అదోలా కలయజూశాడు. ఒకసారి బరువుగా నిట్టూర్చి, కింద పెదవిని పంటితో నొక్కుకుని అయిష్టంగా కదిలాడు.

పాదాల్ని ఎడంగా పెట్టి రెండు చేతుల్నీ కోటు జేబుల్లో దోపుకుని గుమ్మం వయిపు తిరిగి, గది మధ్యలో ధ్వజస్తంభంలా నిలబడ్డ డిటెక్టివ్ టెంపోని చూసి అప్రయత్నంగా తటాలున గుమ్మంలో ఆగిపోయాడు ముకుందం.

డిటెక్టివ్ టెంపో అతన్ని రెప్పవేయకుండా చూశాడు. "తలుపు మూసి గొళ్ళెం పెట్టండి!"

ముకుందమూర్తి ఉలిక్కిపడి లోపలికి జరిగి తలుపు మూశాడు. ఎందుకో కొద్దిగా వణుకుతున్న చేత్తో గొళ్ళెం లోపలకి తోశాడు. మెల్లగా వెనక్కి తిరిగి ఇంకా రెప్ప వేయని టెంపో కళ్ళలోకి అయోమయంగా చూశాడు.

"లోపలకి రండి!"

ముకుందమూర్తి మళ్ళీ ఉలిక్కిపడి, మేజర్ ఆర్డర్ విన్న సిపాయిలా, గాయపడిన సోల్జర్లా కదిలి, టెంపోకి కొంచెం దూరంలో ఆగి, 'ఇంకేం చేయమంటారు!' అన్నట్టు చూశాడు.

"సిట్డౌన్!" డిటెక్టివ్ టెంపో అతని ఎర్రటి కళ్ళ

లోకి తదేకంగా చూస్తూ అన్నాడు.

ముకుందమూర్తి ఆదరా బాదరా వెనకున్న సోఫాలో కూలబడి, అరచేతితో నుదుర్ని తుడుచుకున్నాడు. అతని కళ్ళు అర్థంకాని ఆదుర్దాతో టెంపో వయిపు చూశాయి. టెంపో చూపులు వాడిబాణాల్లా అతని కళ్ళలోకి నాటుకు పోయాయి.

"మిస్టర్ ముకుందం, మనిషి నిష్కారణంగా భయ పడడు! మీరు భయపడుతున్నారు. ఎందుకు?" టెంపో కంఠం తీక్షణంగా ధ్వనించింది.

ముకుందం వెంటనే సమాధానం చెప్పలేదు. జేబు లోంచి మెల్లిగా ఇవతలికి వస్తున్న టెంపో కుడిచేతిని కంగారుగా, అయోమయంగా చూస్తూ వుండిపోయాడు.

చేతిని మెల్లిగా లాగుతూ టెంపో అతని దగ్గరగా నడిచాడు. అతని చెయ్యి తటాలున ఇవతలకి వచ్చింది.

అతని చేతిలో ప్రత్యక్షమైన సిగరెట్ పాకెట్‌ని ముకుందం గుడ్లు మిటకరిస్తూ చూసి గుటకలు మింగాడు.

డిటెక్టివ్ టెంపో పాకెట్‌లోంచి తీసిన సిగరెట్‌ని నింపాదిగా పెదాల మధ్య ఇరికించి అగ్గిపుల్ల గీశాడు. పొగతో అగ్గిపుల్లని ఆర్పేశాడు. అతని చూపులు ఇంకా ముకుందం మొహం మీదే వున్నాయి.

"కమాన్! సమాధానం చెప్పండి!"

"ఏ....మి....టి?" ముకుందం తడబడుతూ అడిగాడు.

"మీ భయానికి కారణం ఏమిటి?"

"నాకు పోలీసులూ, డిటెక్టివ్‌లూ అంటే భయం...." ముకుందం నేల చూపులు చూస్తూ అన్నాడు.

టెంపో అతన్ని చిరునవ్వుతో చూశాడు ముకుందం ఎందుకు విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు? తనలోని ఆదుర్దానీ,

భయాన్నీ దాచుకోలేని ముకుందం మనోహర్రావు ఫ్యాక్టరీని ఎలా నడుపుతున్నాడు?

"ముకుందం, మీరేదేనా చేయకూడని పని చేశారా?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

ముకుందం తటాలున తల పైకెత్తాడు. "లేదు!"

"మరి మీకు భయం దేనికి?"

"ఎవరేనా చేయకూడని పని చేస్తే, ఆ సందర్భంలో నన్నెవరేనా ప్రశ్నిస్తే నేను.... భయపడతాను...." ముకుందం నీరసంగా అన్నాడు.

టెంపో చిన్నగా నవ్వాడు. "ఆల్‌రైట్....పండగ సందర్భంగా మీరు జీతాలు ముందుగా బట్వాడా చేయాలనుకున్నారు. ఆ విషయం ఎవరికి తెలుసు?"

ముకుందమూర్తి చిన్నగా నిట్టూర్చి సోఫాలో వెనక్కివాలాడు.

"ఫ్యాక్టరీలో పనిచేసే అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికీ, కార్మికులకూ అందరికీ తెలుసు. నిర్ణయించినప్పుడే ఎనౌన్స్ చేశాం...."

"ఫ్యాక్టరీలో పనిచేసే వ్యక్తులందరి జాతకాలూ మీకు కంఠోపాఠంగా వచ్చని మనోహర్రావుగారన్నారు. మీ వర్కర్స్‌లో, ఇతర సిబ్బందిలో నేరమనస్తత్వం వున్నవాళ్ళు - ఇలాంటి నేరం చేసే తెలివితేటలూ ధైర్యం వున్నవాళ్ళు ఎవరేనా వున్నారా?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

"మిస్టర్ టెంపో, మీరు చాలా క్లిష్టమైన ప్రశ్న వేశారు....సరిగ్గా సమాధానం చెప్పడం కష్టం. అయితే ఒక్కటి చెప్పగలను. ఉద్యోగాలిచ్చేటప్పుడు ప్రతీ వ్యక్తి చరిత్రనూ అనేక కోణాల్లోంచి పరీక్షించాం. ఇతర

సంస్థల్లోంచి తొలగించబడినవాళ్ళూ, నేరాలు చేసి జెయిళ్ళకి వెళ్ళినవాళ్ళూ, పోలీసు రికార్డులోకి ఎక్కినవాళ్ళూ, సమ్మెలూ ఘెరావ్‌లూ వగయిరా తిరుగుబాటు చర్యలు చేసే తత్వం వున్నవాళ్ళూ, రాజకీయ పార్టీలతో ప్రత్యక్ష సంబంధా లున్నవాళ్లూ మా సిబ్బందిలోకి ప్రవేశించకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం. అంటే మావాళ్ళందరూ మంచివాళ్ళే అని నేను చెప్పాల్సి వుంటుంది...." ముకుందం ఆగాడు.

డిటెక్టివ్ టెంపో పొగ ఊదుతూ క్షణకాలం అతన్ని చూశాడు.

"మీ ఫ్యాక్టరీ మూడు షిఫ్టులు పని చేస్తుందనుకుంటాను...."

"ఆఫ్‌కోర్స్....ఎనిమిదేసి గంటల షిఫ్టులు మూడు - ఇరవయినాలుగు గంటలూ పని జరుగుతుంది."

"ఆరోజు మీరు జీతాలు ఎప్పుడు బట్వాడా చేయాలనుకున్నారు?" టెంపో ప్రశ్నించాడు.

"పండగ కారణంగా ఉదయమే బట్వాడా చేయాలనుకున్నాం. జీతాల మొత్తం, కొంత ఫెస్టివల్ అడ్వాన్సులూ అన్నీ. పదింటికే జీతాలు తీసేసుకొమ్మని అందరికీ ముందురోజే చెప్పాం. మూడు షిఫ్టులవాళ్ళూ ఒకేసారి తీసుకునేలా అంతా ఏర్పాటు చేశాం. ప్రొప్రయిటరు గారు అలా వుత్తరువు...." ఫ్యాక్టరీ గురించిన వివరాల్ని చెప్పుకుపోయే ఉత్సాహంలో ముకుందమూర్తి తన భయాన్ని తాత్కాలికంగా మరచిపోయినట్టున్నాడు.

"ఒక్క క్షణం!" టెంపో అతనికి అడ్డు తగిలాడు. "ఆ సమయంలో రాని వ్యక్తులు ఎవరేనా ఉన్నారా?"

టెంపో ప్రశ్నలోని ఉద్దేశం తనకి అర్థమైనట్టు

ముకుందం తల పంకించాడు. "అందరూ వచ్చారు."

"మీ కెలా తెలుసు?"

"అక్విటెన్స్ రిజిష్టర్‌లో ముందుగానే అందరూ సంతకాలు చేశారు. అయితే ప్రొప్రయిటర్‌గారి ఆర్డర్ ప్రకారం బట్వాడా ఆపు చేయించాం. విషయం తెలిశాక వర్కర్సులో కలవరం బయలుదేరింది. అకౌంట్ సెక్షన్‌లో గందరగోళం ప్రారంభమైంది. అందరూ వచ్చి సంతకాలు చేశారనీ, జీతాల కోసం ఎదురు చూస్తున్నారనీ చీఫ్ అకౌంటెంట్ లబోదిబో అన్నాడు. ఆ తరవాత ప్రొప్రయిటరుగారి అనుమతి లేకుండానే మళ్ళా బాంకు లోంచి డబ్బు తీసి రెండు గంటల ప్రాంతంలో బట్వాడా ప్రారంభించాం. అందరూ అప్పటిదాకా ఆగి వుండి పోయారు" ముకుందమూర్తి వోపిగ్గా వివరించాడు.

సిగరెట్ పీకని గది మూలకి విసిరి డిటెక్టివ్ టెంపో పచార్లు ప్రారంభించాడు. ముకుందమూర్తి తలకీ ఇచ్చిన బొమ్మ తలలా అటూ ఇటూ ఆడసాగింది. తటాలున ఆగి టెంపో అతన్ని సాలోచనగా చూశాడు.

"ముకుందంగారూ, అందరూ ఫ్యాక్టరీలోనే వున్నారనీ, మనోహర్రావుగారిని బెదిరించి డబ్బు కాజేసిన వ్యక్తులు మీ వాళ్ళు అయివుండరనీ మీ మాటలు చెపుతున్నాయి...."

"ఆఫ్‌కోర్స్. టెంపోగారూ, మరో సంగతీ నేను చెప్పగలను. మా వర్కర్సందరికీ మనోహర్రావుగారు దేవుడితో సమానం. ఆయనకి వాళ్ళ సాధక బాధకాలు బాగా తెలుసు. వాళ్ళలో అసంతృప్తి పుట్టకుండా ఆయన చక్కగా చూసుకుంటున్నారు. కార్మికులకి వాటాలు ఇవ్వకపోయినా, పుష్కలంగా బోనస్‌లూ, ఋణాలూ

ఇస్తున్నారు. ఫ్యాక్టరీలో పనిచేసే వ్యక్తి ఎవరూ ఆయన్ని ఇలా బాధించరు" ముకుందమూర్తి ఉద్రేకంతో అన్నాడు.

డిటెక్టివ్ టెంపో అతని ముందుకి జరిగాడు. "ఇతర సంస్థల నుండి తొలగించబడినవాళ్ళని మీరు ఉద్యోగంలోకి తీసుకోరు. అవునా?"

"అవును."

"మామూలుగా తీసుకున్నవాళ్ళని తొలగిస్తారా?" ప్రశ్నించాడు.

"దట్....డిపెండ్స్...." ముకుందం తటపటాయిస్తూ ఆగాడు.

"మిస్టర్ ముకుందం, నాకు తెలుసు. దట్ డిపెండ్స్. ఆలా తొలగించబడినవాళ్ళు ఎంతమంది ఉంటారు?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

ముకుందం కాసేపు తటపటాయించాడు. "గుర్తు లేదు....రికార్డ్స్ రిఫర్ చేయాలి."

"రిఫర్ చేయండి."

ముకుందం సందేహిస్తూ చేతి గడియారం చూసుకున్నాడు. మెల్లిగా తలెత్తి టెంపోని చూశాడు. "రెండు దాటింది....ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సిబ్బంది ఉదయం తొమ్మిదింటికిగానీ రారు."

"ఐ డోంట్ కేర్! ఫ్యాక్టరీకి వెళ్ళండి. ఆ సెక్షన్ తాళాలు తెరవండి. అవసరమైతే బీరువాల తాళాలు పగలగొట్టండి. ఎవరెవర్ని ఎప్పుడెప్పుడు తొలగించారో, ఎందుకు తొలగించారో, వాళ్ళ పర్మనెంట్ చిరునామాలు ఏమిటో - అన్నీ రాయండి. తెల్లారేసరికి ఆ లిస్టు నా చేతిలో వుండాలి!"

ఏదో చెప్పబోయి ముకుందమూర్తి మానుకున్నాడు.

మెల్లిగా లేచి నిలబడ్డాడు. అనుమానిస్తూ జెంపో మొహం లోకి చూశాడు.

"ఈ క్షణందాకా మీరు విన్నదంతా, తరవాత మీరు చెప్పబోయేదంతా అతిరహస్యంగా వుంచాలి. పెదవి కదిపితే, ఆ తరవాత ఇరవలునాలుగ్గంటలూ మిమ్మల్ని ప్రశ్నిస్తూ వుండిపోతాను. అప్పుడు నా పక్కనే వుండే క్రైమ్‌బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ మీచేత అష్టావధానం చేయించేస్తాడు!" జెంపో నవ్వుతూ అన్నాడు.

అదుర్దాగా చూస్తూ తల పంకించి మెల్లిగా తలుపు తెరిచి ముకుందం గదిలోంచి నిష్క్రమించాడు.

తనలో నవ్వుకుంటూ డిటెక్టివ్ జెంపో సోఫాలో కూచున్నాడు. ఆరిపోయిన సిగరెట్‌ని గిరాటేసి కొత్తది వెలిగించి ఆలోచిస్తూ కళ్ళు సగం మూసుకున్నాడు.

అంతా అగమ్యగోచరంగా వుంది. ముకుందం సప్లై చేసే ఇన్ఫర్మేషన్ ఎంతవరకూ ఉపయోగిస్తుందో తనకి తెలీదు. ఏదో విధంగా దారిచేసుకుంటూ, ఇరుక్కుపోయిన కీకారణ్యంలోంచి బయటపడి గమ్యస్థానం చేరుకోవాల్సిందే....

20

డిటెక్టివ్ జెంపో ముకుందమూర్తి ఇచ్చిన సప్లైలిస్టును చదువుతూ వుండిపోయాడు.

ఎదురుగా కుర్చీలో కూర్చున్న ముకుందం అర్ధరాత్రి నుండీ నిద్రకు నోచుకోని ఎర్రటి కళ్ళను అరచేతుల్తో రుద్దుకుంటూ వెనక్కివాలాడు.

చదవడం ముగించి, జెంపో కుర్చీలో వెనక్కివాలాడు. సిగరెట్ వెలిగించి, ముకుందమూర్తి వైపు చూశాడు.

"మిస్టర్ ముకుందం, ఆరేళ్ళలో మీరు ఎనమండు గురిని ఉద్యోగాలనుంచీ తీసివేశారు. ఆరుగురి తొలగింపుకు ఏదో టెక్నికల్ కారణాలు చూపించారు. ఒకతన్ని తీసే సిన కారణం ఇన్‌సబార్డినేషన్. అతను రామగోపాల్. అతని ఇన్‌సబార్డినేషన్ని వివరించండి."

"అతను....రామగోపాల్ సెక్షన్ ఫోర్‌మన్‌మీద తిరగ బడ్డాడు. ఆ తరవాత విచారణ జరిపిన సెక్షన్ హెడ్ ప్రశ్నలకి తలతిక్క సమాధానాలు చెప్పాడు. ఇంతకన్నా వివరాలు నాకు తెలీవు పైగా అతన్ని డిస్‌మిస్ చేసి మూడేళ్ళు దాటింది. ఎవరికీ అంతగా గుర్తుండదు."

"తరవాత రవికుమార్. ప్రొప్రయిటర్ ఉత్తర్వు మేరకు అతన్ని తొలగించారు. మరో విశేష మేమిటంటే ఏడుగురూ మూడు నాలుగేళ్ళు పనిచేశాక తీసివేయబడ్డారు. రవికుమార్ నలభై రోజులు మాత్రమే చేశాడు. ఉద్యో గంలోకి తీసికున్న అనతికాలంలో అతన్నెందుకు డిస్ మిస్ చేశారు?" టెంపో ప్రశ్నించాడు.

ముకుందమూర్తి క్షణకాలం తటపటాయించాడు. "ప్రొప్రయిటరుగారు తొలగించమన్నారు. అంతే నాకు తెలుసు...."

డిటెక్టివ్ టెంపో తటాలున కుర్చీలోంచీ లేచాడు. తదేకంగా ముకుందం మొహంలోకి చూస్తూ వుండి పోయాడు.

రవికుమార్ ప్రసక్తి వచ్చినప్పట్నుంచీ అతని మొహంలో, ముఖ్యంగా కళ్ళల్లో ఏదో మార్పు అవు పిస్తూంది. ఎందుకు? ఆలోచిస్తూ టెంపో సిగరెట్ పీకను యాష్‌ట్రేలో నొక్కి ఆర్పేశాడు.

"మిస్టర్ ముకుందమూర్తీ, నలభై రోజులు అకౌంట్

సెక్షన్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగం ఊడ గొట్టించుకున్న రవికుమార్‌ని ఉద్యోగానికి రికమెండ్ చేసిందెవరు?" టెంపో తటాలున ప్రశ్నించాడు.

మొహంమీద అరచేత్తో చరిచినట్టు ముకుందం అదిరిపడ్డాడు. అతని మొహం కొద్దిగా వివర్ణమైపోయింది. తల దించి, రెప్పలు పైకెత్తి టెంపోవైపు చూశాడు.

"....నే....నే...."

టెంపో కళ్ళు చిట్లించాడు. "రవికుమార్ ఎవరు?"

ఏ ప్రశ్న తను అడగకూడదని ముకుందం ఆశి స్తున్నాడో, ఆ ప్రశ్నే తను అడిగినట్టు టెంపో గ్రహిం చాడు. ముకుందం కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు. రెండు చేతుల్తో మొహాన్ని రుద్దుకున్నాడు. ఏదో బాధా, అవమానం నిండిన కళ్ళతో దీనంగా టెంపోని చూశాడు. మెల్లిగా అతని పెదవులు కదిలాయి.

"రవికుమార్....నా....చెల్లెలి....కొడుకు...."

టెంపో కనుబొమలు అతని నుదుర్ని పైకితోస్తూ విల్లు ఆకారంలో కదిలాయి. రెప్పవేయకుండా ముకుం దాన్ని చూస్తూ అతను కుర్చీలో కూచున్నాడు. సాలో చనగా సిగరెట్ వెలిగించాడు. ముకుందం తనని నిజానికి, గమ్యస్థానానికి దగ్గరగా తీసికెళుతున్నాడా?

"మిస్టర్ ముకుందం, రవికుమార్‌తో మీకున్న బంధు త్వం గురించి మనోహర్రావుగారికి తెలుసా?"

"తెలీదనే అనుకుంటాను....నేను....చెప్పలేదు...." నుదుర్ని కమ్ముకున్న చెమటని తుడుచుకుంటూ ముకుందం జవాబిచ్చాడు.

"ఎందుకు చెప్పలేదు?"

"ఇంతవరకూ మనోహర్రావుని నేను ఏ ఫేవర్స్

అడగలేదు. అడక్కపోయినా ఆయన నాకు ఏలోటూ లేకుండా చూసుకుంటున్నారు. రవితో నా బంధుత్వాన్ని చెప్పి ఆయన్ని ఇన్‌ఫ్లెయెన్స్ చేయడం నాకు ఇష్టంలేదు. మంచి అభ్యర్థి అనీ పనికొస్తాడు పనిలోకి తీసుకొమ్మనీ ఎస్టాబ్లిష్‌మెంట్ హెడ్‌కి చెప్పాను....అంతే...."

"ఆల్‌రైట్....ఉద్యోగంలోంచి పీకేసేముందు మనోహర్రావుని కల్సుకుని చెప్పి వుండొచ్చుగా?" శెంపో ప్రశ్నించాడు.

"మిస్టర్ శెంపో....వాడు ఎలాగా ఎంతోకాలం ఒక ఉద్యోగంలో కొనసాగుతాడన్న నమ్మకం నాకు లేదు. నా చెల్లెలి మనోవేదన తగ్గించడానికి, తండ్రిలేని రవికుమార్‌కి ఉద్యోగం వచ్చేలా చూశాను...." ముకుందమూర్తి మెల్లిగా ఆగాడు. అదోలా శెంపోవైపు చూశాడు. 'ఇంక ప్రశ్నలు అడక్కండి!' అంటున్నాయి అతని కళ్ళు.

"మిస్టర్ ముకుందం, మీ మేనల్లుడు—రవికుమార్ ఎంతోకాలం ఒక ఉద్యోగంలో కొనసాగడన్నారు. ఎందుకు?"

ముకుందం ఇబ్బందిగా చూశాడు. జేబులోంచి రుమాలుతీసి మొహం తుడుచుకుంటూ వుండిపోయాడు. శెంపో అతన్ని చిరాగ్గా చూశాడు.

"మిమ్మల్ని గంటల తరబడీ ఇంటర్వ్యూచేస్తూ కూచో డానికి నాకు వ్యవధిలేదు! చకచకా సమాధానాలు చెప్పండి!"

ముకుందం గుటకలు మింగి, దగ్గి, గొంతు సవ రించుకున్నాడు. టేబుల్‌మీదున్న చేతుల్ని కిందికి, వాళ్ళోకి లాక్కుని మెటికలు విరుచుకున్నాడు.

"మిస్టర్ టెంపో, చెల్లెలు కొడుకు గురించి చెడుగా చెప్పాలంటే విచారంగా, చిన్నతనంగా వుంది. రవి డిగ్రీ పరీక్షలమీద 'గజనీ మహమ్మద్ దండయాత్రలు' చేసి, వోడిపోయాడు. చివరికి, డెస్పరేట్ అయిపోయాడు. అడ్డదిడ్డంగా తిరగడం అలవాటు చేసుకున్నాడు. చెల్లెలి కన్నీళ్ళు చూడలేక వాణ్ని మంచి దారిలోపెట్టే ప్రయత్నం చేశాను. అది కుక్కతోకని తిన్నగా చేసే ప్రయత్నం అయింది. వాడు పూర్తిగా పాడైపోయే స్థితికి దగ్గర్లో వున్నాడు.... నా చెల్లెలు...."

"ఇప్పుడు చెప్పండి: రవికుమార్ని ఎందుకు డిస్మిస్ చేశారు?" టెంపో అడ్డు తగిలాడు.

"నిజం చెప్పాలంటే డ్యూటీపరంగా వాడు పొరపాటు చేయలేదు. అయితే....వాడి ప్రవర్తన ప్రొప్రయిటర్ గారికి నచ్చలేదు...."

"ఏం జరిగింది?"

"మిస్ వనిత రోజూ తన తండ్రిగారిని కార్లో ఫ్యాక్టరీకి తీసుకువచ్చేది. సాయంత్రం ఆయన్ని కార్లో పికప్ చేసుకునేది. కారు వచ్చేటైమ్‌కి సరిగ్గా రవికుమార్ ఫ్యాక్టరీముందు తయారయ్యేవాడు. అమ్మాయిగార్ని అదే పనిగా చూస్తూవుండడం ఆయన కంటపడింది. ఆయన వాడిమీద వో కన్నేసి వుంచారు....ప్రతిరోజూ వాడు కారు వచ్చే సమయానికి డ్యూటీ ఎగ్గొట్టి ప్రత్యక్షమవడం చాలాసార్లు ఆయన గమనించారు. అకస్మాత్తుగా వొక రోజు వాణ్ని తీసేయించారు. అంతే!" ముకుందరావు కంఠం సన్నగా ధ్వనించింది.

టెంపో తల పంకించాడు. "రవికుమార్ మీ తాలూకే అని మనోహర్రావుగారు తెలుసుకుని వుంటారనుకుం

టాను....''

''నాకు తెలీదు. ఆయన నన్ను అడగలేదు. నేనూ ఆయనకి చెప్పలేదు. నా లెవల్లో ప్రయత్నించి వాడికి ఉద్యోగం ఇప్పించాను. ఆయన తీసేశారు!''

డిటెక్టివ్ టెంపో కుర్చీలోంచి లేచి, ముకుందం దగ్గిరగా నడిచాడు. అతని మొహంలోకి తీక్షణంగా చూశాడు. ''మిస్టర్ ముకుందం, ముందుగా జరిగే జీతం బట్వాడా గురించి మీరు రవికుమార్‌కి చెప్పారా?''

''....లేదు....అయితే వాడికి తెలిసివుండొచ్చు. నా భార్యతో అన్నాను. అదే క్షణంలో వాడు ఆ గదిలోకి వచ్చాడు. వినివుంటాడు....'' ముకుందమూర్తి నుదుర్ని చిట్లిస్తూ అన్నాడు.

''ఉద్యోగంలోంచీ పీకి పారేసిన మనోహర్రావుగారి మీద రవికుమార్ పగదీర్చుకున్నాడా?'' టెంపో తపీమని ప్రశ్నించాడు.

ముకుందమూర్తి ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. ''టెంపోగారూ....చాలా క్లిష్టమైన ప్రశ్న అడిగారు. రవి కొంతవరకూ చెడిపోయిన మాట నిజమే. అయితే ఇప్పుడు జరిగిన దారుణాన్ని ప్లాన్‌చేసి అమలుజరిపేంత ధైర్యం, దుర్మార్గం వాడిలో లేవు....''

''మిస్టర్ ముకుందం, యూ నెవర్‌నో! డెస్పరేట్ అయిన మనిషి దేనికైనా తెగిస్తాడు; ఎంత పనేనా చేస్తాడు!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

''కావొచ్చు....కానీ....రవి....''

''రవికుమార్ వనితపట్ల తన ఇంటరెస్టుని ప్రత్యక్షంగా ప్రదర్శించాడు. మూతిమీద వాతవేయించుకున్నాడు. నిరుద్యోగిగా మారి వీధిన పడ్డాడు. సహజంగా అతనిలో

పగ, ప్రతీకారవాంఛ రగుల్కొన్నాయి. ప్లాన్ వేశాడు. పని సాధించాడు: అతనికి మోటివ్ వుంది!” షెంపో అడ్డు తగులుతూ అన్నాడు.

ముకుందమూర్తి అయోమయంగా చూశాడు. ఏదో చెప్పబోయి, ఊరుకున్నాడు.

“మిస్టర్ ముకుందం, మీ మేనల్లుడు మీతోనే వుంటున్నాడా?”

“లేదు, ఏడాది క్రితం చెల్లాయి, వాడూ ఈ వూరొచ్చారు. నన్ను కలుసుకున్నారు. అప్పుడే వాళ్ళని వేరే వుంచాను....నా భార్యకూ, చెల్లెలికీ అట్టే పడదు లెండి.... అందుకని....”

“రవికుమార్ ఇప్పుడెక్కడున్నాడు?”

“షెంపోగారూ....వాడు....వాడు యింత పెద్ద నేరం చేయడు....”

“రవికుమార్ ఎక్కడున్నాడు!” షెంపో రెట్టించి అడిగాడు.

“నెంబర్ వన్ వన్ సెవెన్, లాల్ బహదూర్ నగర్....”

“ఓకే మిస్టర్ ముకుందం, మీరు వెళ్ళండి. థాంక్స్ ఎలాట్!” అంటూ షెంపో చేతిని ముందుకి చాచాడు.

ముకుందమూర్తి షెంపో చేతిని పట్టుకోలేదు. ముందే ఊహించిన ఓటమిని అంగీకరిస్తున్న వ్యక్తిలా నిరాశగా షెంపోవైపు చూశాడు.

“షెంపోగారూ.....వాడు.....రవికుమార్.....వాణ్ని మీరు అనుమానిస్తున్నారా?....” తడబడుతూ ప్రశ్నించాడు.

డిటెక్టివ్ షెంపో ముందుకు చాపిన చేతిని కోటు

జేబులో దోపుకున్నాడు. తల పైకెత్తి తన మొహంలోకి బెదురుచూపులు చూస్తున్న ముకుందమూర్తిని చిరునవ్వుతో చూశాడు.

"మిస్టర్ ముకుందం, మిమ్మల్ని కూడా అనుమానిస్తున్నాను!" అన్నాడు.

21

సందుకి దగ్గిరగా అంబాసిడర్ కారు ఆగింది. తన వేపున్న డోర్ని తెరిచి డిటెక్టివ్ టెంపో స్టీరింగ్ ముందు ఠీవిగా కూచున్న ఇన్స్పెక్టర్ పృథ్వీరావుని చిరునవ్వుతో చూశాడు.

"పృథ్వీ, నేను వెళ్తాను. వచ్చేదాకా యిక్కడే కూచో."

ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ నిరుత్సాహంగా చూశాడు. "ఇది అన్యాయం! గోళ్ళు కొరుక్కుంటూ కూచోనా?"

టెంపో చిన్నగా నవ్వాడు. "గోళ్ళు కొరుక్కోవద్దు; మీసాలు మెలితిప్పుతూ కూచో. పృథ్వీరావ్ మీసాలు పృథ్వీరాజు మీసాల్లా ఉండాలి!"

నవ్వుతూ టెంపో కిందికి దిగి డోర్ని తోశాడు. తిరిగి చూడకుండా పక్కనేవున్న సందులోకి నడవసాగేడు. అతనివేపు కాసేపు చూసి, మట్టిలో వున్న ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అప్రయత్నంగా తన మీసాల్ని మెలిపెట్టడం ప్రారంభించాడు....

ఇరుకు సందులో ఇళ్ళ నెంబర్లు చూస్తూ నడుస్తూన్న డిటెక్టివ్ టెంపో తనక్కావాల్సిన ఇంటిముందు ఆగాడు. కిందికి వొంగిన పెంకుల వరండాలో వున్న తలుపుకి ముందు వైపున గొళ్ళెం పెట్టబడి వుంది.

అటూ యిటూ చూసి కాసేపు తటపటాయించి టెంపో

వరండాలో వున్న సిమెంట్ అరుగుమీద చతికిలబడ్డాడు. ఇంట్లో అతను ఉన్నట్టు లేదు. ఆలోచిస్తూ అతను సిగరెట్ వెలిగించాడు....

తలాతోకా లేకుండా తనలో సాగుతున్న ఆలోచనల్ని దూరంగా గిరాటేస్తున్నట్టు సగం కాలిన సిగరెట్‌ని విసుగ్గా యింటి ముందుకి విసిరాడు శెంపో.

తలుపుకి తాళం వేయకుండా అతని తల్లి యెక్కడికి వెళ్ళింది? పక్కింటి పార్వతమ్మనో, యెదురింటి వెంకాయమ్మనో అడిగితే కానీ తన సందేహానికి సమాధానం దొరకదు! శెంపో పైకి లేచి, వరండామీంచీ వీధిలోకి దిగాడు.

పక్కింటివైపు కదలబోతూ శెంపో ఆగాడు. ఎదురుగా చిన్న ప్లాస్టిక్ బిందెను రొంటిన పెట్టుకున్న నలభై అయిదేళ్ళ స్త్రీ వస్తోంది. కళ్ళద్దాలగుండా అతన్ని ప్రశ్నార్థకంగా చూస్తూ దగ్గరగా ఆగిందామె.

"ఎవరు?"

శెంపో ఆమెని చిరునవ్వుతో చూశాడు. ఆమె బక్కపల్చగా, బలహీనంగా వుంది. జీవితంలో ఆమె పడుతున్న కష్టాల్ని చూపిస్తున్న గ్రాఫుల్లా ఆమె నుదురుమీద గీతలు అవుపిస్తున్నాయి.

"రవి కోసం వచ్చాను...."

ఆమె మాట్లాడకుండా అతన్ని దాటుకుని వరండాపైకి యెక్కింది. బిందెని అరుగుమీదికి జాగ్రత్తగా దించి, అలసటగా శెంపోవయిపు చూసింది.

"మీరెవరు?"

"కూర్మారావు. రవి మిత్రుణ్ని...."

"వాడితో మీకేం పని?" కొడుకుమీట్లూ తనని కోటలా

అల్లుకున్న తత్వం ఆమె మాటల్లో వ్యక్తమవుతోంది
"మిమ్మల్ని ఎప్పుడూ అబ్బాయితో చూడలేదు...."

"ఈమధ్యే అతన్తో నాకు పరిచయం అయ్యింది. ఉద్యోగం కావాలన్నాడు. నా మిత్రుడయిన ఒక ఫ్యాక్టరీ యజమానితో రవి గురించి మాట్లాడాను...." టెంపో ఆగి అర్థవంతంగా చూశాడు.

అద్దాల్లోపల ఆమె కళ్ళు కొద్దిగా మెరిశాయి. అరుగు మీదున్న బిందెను మళ్ళీ చంకలోకి ఎత్తుకుని ఆమె గొళ్ళెం తీసి తలుపుని లోపలికి తోసింది. లోపలికి వెళ్ళబోతూ తలతిప్పి చూసింది. ఇందాకట్నుంచీ ఆమె కళ్ళల్లో అవుపించిన అనుమానం ఇప్పుడు లేదు.

"లోపలికి రండి."

ఆమె వెనకే డిటెక్టివ్ టెంపో లోపలికి వెళ్ళాడు. కొంచెం జోరుగా నడుస్తూ ఆమె వంటగదిలోకి వెళ్ళింది. తను నించున్న చిన్నగదిని టెంపో కలయజూశాడు.

గోడవారగా వున్న చిన్న కొయ్య టేబుల్ మీద రెండు తెలుగుపత్రికలూ, ఒక సినిమా పత్రికా చెల్లాచెదురుగా పడున్నాయి. తెరిచిన సినిమా పత్రిక సెంటర్ స్ప్రెడ్‌లో అండర్ వేర్, బ్రాసియర్ వేసుకుని ఒక కాలు కొంచెం పైకెత్తి వయ్యారాలు వొలకబోస్తున్న టాప్ హీరోయిన్ పళ్ళన్నీ చూపిస్తూ కె. ఆర్. విజయలా నవ్వుతోంది. టెంపో టేబుల్ దగ్గరగా జరిగాడు. కొద్దిగా ఉబ్బినట్టు కనిపిస్తున్న హీరోయిన్ పొట్టమీద ఏటవాలుగా 'రవికుమార్' పేరు ఇంగ్లీషులో రాయబడి వుంది.

చిన్న ప్లాస్టిక్ ఫోల్డింగులోంచీ ఒక యువకుడు నవ్వుతూ చూస్తూన్నాడు. తనతో యిందాక మాట్లాడిన స్త్రీ కళ్ళు ఫోటోలోని యువకుడికి అతికించినట్టు

న్నాయి....

"కూర్చోండి...."

ఆమె కంఠం వినిపించి టెంపో వెనక్కి తిరిగాడు. నీళ్ళగ్లాసుతో ఆమె అతని దగ్గిరగా ఆగింది.

"నేను రవితో అర్జెంటుగా మాట్లాడాలి...." అన్నాడు టెంపో.

"స్నేహితులంతా అబ్బాయిని కుమార్ అంటారు. మీరు రవి అనగానే మీది కొత్త పరిచయం అను కున్నాను!" అందామె చిన్నగా నవ్వుతూ.

టెంపో ఆమె చేతిలోంచి లోటా అందుకుని నీళ్ళు తాగేశాడు. "కుమార్ ఎక్కడికెళ్ళాడు?"

"ఎక్కడెక్కడో తిరుగుతూ వుంటాడు; ఉద్యోగం కోసం....మీరు ఉద్యోగం యేర్పాటు చేస్తారా?" ఆమె కంఠంలో ఆశ స్పష్టంగా ధ్వనించింది.

"దాదాపుగా చేసేశాను, అందుకే అతన్ని అర్జెంటుగా కలుసుకోవాలి!" లోపల్లోపల విచారిస్తూ టెంపో అబద్ధ మాడాడు.

ఆమె మొహం నవ్వుతో విప్పారింది. "ఇన్నాళ్ళకి అబ్బాయికి మీలాంటి మిత్రుడు దొరికాడు. ఆదాయం లేకా, పని లేకా వాడు పిచ్చివాడయి పోయేలా వున్నాడు........"

"పిన్నిగారూ, అరగంటలో అతన్ని నేను ఫ్యాక్టరీకి తీసుకెళ్ళాలి!" టెంపో అర్థిస్తూ అన్నాడు.

"వీధిచివర....మేడమీద ఉంటే ఉంటాడు....వెళ్ళి పిలుస్తాను....మీరు కూచోండి...." అందామె కదల బోతూ.

"మీరు వెళ్ళడం దేనికి? నేనే వెళ్తాను!"

సెంపో కంఠం ఆమెని ఆపింది. "రంగరాజు గది అది. పనిలేదు. తోచదు చూడండి. అక్కడ ఏ కేరమ్సో ఆడుతూ వుంటాడు...." అంది సందేహిస్తూ.

"నేను చూస్తాను. నాలుగు రోజుల్నుంచీ అతనికోసం ఎదురుచూశాను. ఈ మధ్య యింట్లో లేడా?" సెంపో ప్రశ్నించాడు.

"ఈ మధ్యే కాదు; అబ్బాయి అంతగా యింటిపట్టున వుండడు. ఉద్యోగంలేదు చూడండి...."

తల పంకిస్తూ సెంపో గుమ్మంవైపు నడిచాడు.

"కాఫీ చేస్తాను. రండి!" అందామె.

"మరోసారి. ఇప్పుడు అర్జెంటుగా ఫ్యాక్టరీకి వెళ్లాలి!" అంటూ సెంపో గుమ్మం దాటాడు.

22

మెట్లమీద బూట్లు టక్‌టక్ శబ్దం చేస్తున్నాయి. కాగితం ముక్కలతో సిగరెట్ పీకలతో నిండిన సన్నటి నడవలో సెంపో ఆగాడు. కుడివైపునుండీ నవ్వులూ కేకలూ వినిపిస్తున్నాయి.

సెంపో క్షణకాలం ఆలోచిస్తూ నిలబడ్డాడు. అప్రయత్నంగా అతని చెయ్యి కోటుజేబులోని రివాల్వర్ని తడిమింది. ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్‌ని కూడా రానిచ్చివుంటే బావుండేదేమో....ఆలోచిస్తూ సెంపో గుమ్మం ముందుకి నడిచాడు.

బిగుటుగా మూసిన తలుపు వెనకనుండీ గందరగోళంగా అరుపులూ వినిపిస్తున్నాయి. సెంపో ఎడమచెయ్యి తలుపుని తోసింది. లోపల గొళ్ళెం బిగించబడిందని సెంపో గ్రహించాడు. గొళ్ళెం బిగించిన తలుపూ, అస్తవ్యస్తంగా

వినవస్తున్న కేకలూ గదిలో సాగుతున్న ఆట కేరమ్స్ కాదనీ, రమ్మీ అనీ తెలియజేస్తున్నాయి!

పెంపో చెయ్యి బలంగా తలుపుమీద చప్పుడు చేసింది. తటాలున లోపల శబ్దాలు ఆగాయి. చెవులు రిక్కిస్తూ పెంపో మళ్ళీ తలుపు తట్టాడు.

"ఎవరు?" రెండు క్షణాల తరువాత బొంగురు కంఠం విసుగ్గా అరిచింది.

"నేనే!" పెంపో బిగ్గరగా అరిచాడు.

ఎవరో సణుక్కుంటూ తలుపు దగ్గరగా వస్తున్నారు. అడుగుల చప్పుడు తలుపు అటువైపున ఆగింది. చిన్నగా గొళ్ళెం చప్పుడు చేసింది. తలుపు అడుగుదూరం వెనక్కి లాగబడింది. సందులోంచీ ప్రత్యక్షమైన తలని పెంపో చిరునవ్వుతో చూశాడు.

చిందరవందరగా వున్న అంగుళం పొడవు పెరిగిన గెడ్డం. ఎర్రటికళ్ళు. ఎర్రగా, తడిగావున్న పెదవులు. గుబురు కనుబొమల కిందున్న చిన్న చిన్న కళ్ళు మరీ చిన్నగా అయిపోయి అనుమానంగా, విసుగ్గా చూశాయి.

"ఎవరు?" ఎర్రటి పెదవుల సందులోంచీ ఎర్రటిపళ్ళు ప్రత్యక్షమయ్యాయి. జర్దావాసన ఘాటుగా పెంపోమొహం వైపు చిమ్మింది.

"కుమార్ ...." కోటు జేబులోనికి కుడిచేతిని పోనిస్తూ అన్నాడు పెంపో.

"కుమారూలేదు; కుమారీలేదు. గో అవే!" అంటూ అతను తలని లోపలికి లాగి తలుపుని ముందుకి తోశాడు.

పెంపో బూటు తలుపు అడుగుభాగంలో బలంగా ఆనింది. అతని తల తలుపు సందులో మళ్ళీ ప్రత్యక్షమైంది. ఎర్రటి కళ్ళు నిప్పుల్లా చూశాయి.

"ఎవర్నువ్వు? తోక ముడుచుకుని వెళ్ళిపో!" కోపంతో అతని కంఠం బుసకొట్టింది.

టెంపో ఎడమచెయ్యి తటాలున కదిలింది. అట్లకాడలా అతని మొహంమీద పడిన టెంపో చెయ్యి బలంగా ముందుకి సాగింది. అతని తల తటాలున వెనక్కి వంగింది. చిన్న చప్పుడుతో అతని మెడలో మెటిక విరిగింది.

అదే క్షణంలో టెంపోబూటు కాలు తలుపుని బలంగా వెనక్కి నెట్టింది. చిన్న కేక. చిన్న చప్పుడు. తలుపు పూర్తిగా జరిగి గోడకి కొట్టుకుంది. టెంపో మెరుపులా కదిలాడు. గుగ్గిలం పొగతో నిండిన సినిమా సెట్టింగులా వుంది సిగరెట్ పొగ కమ్మిన గది.

వెల్లకిలా పడి, మోచేతులమీద పైకి లేస్తున్న వ్యక్తిని ఒకసారి చూసి టెంపో గది మధ్యలో గుండ్రంగా కూచున్న వ్యక్తుల్ని కలయజూశాడు.

తలలన్నీ అతనివైపే తిరిగి, కంగారుగా చూస్తున్నాయి. అందరి చేతుల్లోనూ విసనకర్రల్లా పట్టుకున్న పేకముక్కలున్నాయి. బుస వినిపించి టెంపో తటాలున చూపుల్ని తిప్పాడు. కిందపడిన వ్యక్తి లేచి, ముందుకి వొంగి నిలుచున్నాడు. అతని ఎడంచేతిలోంచి పేకముక్కలు కింద చెల్లా చెదరుగా పడ్డాయి. అతని కుడిచేతిలో తళుక్కుమన్న చిన్న కత్తిని టెంపో ఆశ్చర్యంతో చూశాడు.

"నో!" కూచున్నవాళ్ళల్లో ఎవడో కంగారుగా అరిచాడు.

టెంపో కాలు మెరుపులాకదిలి పైకిలేచింది. ముందుకి వంగి; జాగర్తగా దగ్గిరకి జరుగుతున్న ఆ వ్యక్తి కుడిచేతిని టెంపో బూటు సుత్తిలా తాకింది. అప్రయత్నంగా అతను మూలిగాడు. గాలిలోకి ఎగిరిన కత్తి సీలింగ్ని తాకి

వవ్వాడుచేస్తూ కింద పడింది.

పోట్లగిత్తలా మీదికి ఉరుకుతున్న అతన్ని పెంపో ఎడమచెయ్యి ఆపింది. చేతివేళ్ళు అతని మెడ దగ్గిరగా భుజం మీద కొక్కేల్లా బిగుసుకున్నాయి. దెబ్బతిన్న పంది పిల్లలా అతను మళ్ళీ మూలిగాడు. తన వేళ్ళకింద నలుగుతున్న అతని నరాలు అతన్ని కాసేపు కదలనియ్యవని పెంపోకి తెలుసు.

కోటు జేబులోంచి రెప్పపాటులో కుడిచేతిని ఇవతలికి లాగాడు పెంపో. బిగించిన పిడికిలితో అతని రెండో భుజంమీద సమ్మెటదెబ్బ వేశాడు. ఎడమచేతి వేళ్ళను వొదులుచేశాడు.

తటాలున అతను నేలమీద గొంతుకూర్చున్నాడు. వణుకుతూ భయాందోళనలతో పెంపోని చూశాడు.

"తోక ముడుచుకు వెళ్ళి గోడవార కూచో!" పెంపో ఆజ్ఞాపించాడు.

భయం, రోషం రెండూ మిళితమైన కళ్ళతో అతను అర్థం కానట్టు చూశాడు. పెంపో మాట్లాడకుండా ఒక అడుగు ముందుకు వేశాడు. వణుకుతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకుంటూ అతను ఒగురుస్తూ లేచి తోక తెగిన కోతిలా గోడవేపు నడిచాడు. పెంపో పక్కకి తిరిగాడు.

ఇందాకా కూచున్న యువకులంతా ఇప్పుడు నించున్నారు. అందరి మొహాల్లోనూ కంగారు అవుపిస్తోంది. ఇందాకా దెబ్బలు తిని వొగురుస్తూ కూచున్న యువకుడు వాళ్ళ నాయకుడని వాళ్ళ కంగారు పెంపోకి చెబుతోంది.

ఫోటోలో చూసిన మొహాన్ని గుర్తు చేసుకుంటూ పెంపో వాళ్ళని కలయజూశాడు. నలిగిపోయిన, రంగు వెలిసిపోయిన జీన్స్‌మీద ఫుల్‌నెక్ వైట్ బనియన్.

చేతుల్ని మోచేతులపైకి తోసిన బనియన్ పైభాగంలో అచ్చైన 'క్రేజీ' అన్న ఇంగ్లీషు పదం ఎర్రగా అవుపిస్తోంది.

"కుమార్ ...."

ఆ యువకుడు గుంపులోంచి ఇవతలికి కదిలాడు. ఆక్షేపిస్తున్న కళ్ళతో టెంపోని చూశాడు.

"ఎవర్నువ్వు? ఏమిటీ దౌర్జన్యం?"

"నిన్ను తీసుకెళ్ళాలని వచ్చాను...." అతని ప్రశ్నను నిర్లక్ష్యంచేస్తూ అన్నాడు టెంపో.

"తీసుకెళ్తే రాడానికి నేను పల్లెటూరి పెళ్ళికూతుర్ని కాను!"

టెంపో చిన్నగా నవ్వాడు. "ఇందాకా ఆ వీరుడికిచ్చిన ట్రీట్‌మెంట్ ఇచ్చి, నిన్ను పెళ్ళికొడుకును చేసి తీసుకెళ్తాను. అయితే అతని కిచ్చింది పీడియాట్రిక్ డోస్. నీకు అడల్ట్‌డోస్ ఇస్తాను!"

దగ్గిరగా అడుగుపెస్తున్న టెంపోని రవికుమార్ కళ్ళు చిట్లిస్తూ చూశాడు. పేకముక్కల్ని కిందపడేసి జీన్స్‌జేబులోకి చేతిని పోనిచ్చాడు.

"చాకులూ, బాకులూ తీస్తే చేతులు విరుగుతాయ్!" టెంపో అతని కళ్ళల్లోకే చూస్తూ అన్నాడు.

చిట్లించివున్న రవికుమార్ కళ్ళు పెద్దగా అయ్యాయి. "ఎక్కడికో, ఎందుకో, నువ్వెవరో చెప్తేగానీ నేను రాను!"

"కుమార్ మా అందరికీ బాకీపడ్డాడు. డబ్బిస్తేగానీ అతడు ఇవతలికి రాడు!"

టెంపో తలతిప్పి సన్నగా పొడుగ్గా గెడకర్రలావున్న యువకుణ్ని నవ్వుతూ చూశాడు.

"అతనికి ఉద్యోగం ఇప్పిస్తున్నా. నెలజీతం ఇవాళే అడ్వాన్సుగా ఇస్తాం. రాత్రికి మీ బాకీలు ముక్కుపిండి వసూలు చేసుకోండి!"

అందరూ మొహాలు చూసుకున్నారు. రవికుమార్ అర్థంకానట్టు టెంపో మొహంలోకి చూశాడు.

"ఉద్యోగం....ఎక్కడ?" తడబడుతూ అడిగా డతడు.

"వనితా ఇంటర్నేషనల్ ఫ్యాక్టరీలో. రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం" టెంపో అతని కళ్ళల్లోకే చూస్తూ అన్నాడు. రవికుమార్ కళ్ళని ఏదో మార్పు పొరల్లా కప్పేసింది.

"నేను....నమ్మను! ఇంతకీ నువ్వు....మీరు...." రవికుమార్ మళ్ళీ తడబడ్డాడు.

టెంపో నవ్వుతు "మిస్ వనిత నీ చూపుల్ని లైక్ చేసింది. అందమైన అమ్మాయి అందమైన అబ్బాయి చూపుల్ని లైక్ చేస్తుంది. నిన్ను పీకి పారేసినట్టు తెలుసుకుంది. నీకు మళ్ళీ ఉద్యోగం ఇప్పించాలనుకుంది!"

రవికుమార్ ఉక్కిబిక్కిరవుతూ చూశాడు. టెంపో మాటల్లోని ఏగతాళి అతన్ని ముల్లులా గుచ్చుతున్నట్టుంది.

"ఐకాంట్ బిలీవ్! నేను రాను!" మొండిగా అన్నా డతను.

టెంపో అతని దగ్గిరగా కదిలాడు. "మర్యాదగా రాకపోతే మక్కెలు విరగ్గొట్టి గోడవారగా కూచున్న నీ గురువు చేత మోయించుకు వెళ్తాను!"

తన భుజంమీద పడిన టెంపో చేతిని రవికుమార్ భయంగా చూశాడు.

"కుమార్, వెళ్ళు. ఏ పుట్టలో ఏ పాముందో, ఏ ఫ్యాక్టరీలో ఏ ఉద్యోగం వుందో మనకి తెలీదు. అడ్వాన్సు తీసుకురా. మా కివ్వాల్సింది ఇచ్చెయ్!" గోడవారగా

కూచున్న యువకుడు మెల్లిగా పైకిలేస్తూ అన్నాడు.

అతనివేపు వోసారి చూసి, రవికుమార్ భుజాలు ఎగరేశాడు. కళ్ళని పెంపోవైపు తిప్పాడు.

"ఆల్ రైట్....ఇది ప్రాక్టికల్ జోక్ అయితే తరువాత మీరు విచారిస్తారు!" అన్నాడు మేకపోతు గంభీర్యంతో.

పెంపో అతన్ని గుమ్మంవైపు తోస్తూ కదిలాడు.

రవికుమార్ ఆగి జేబులోంచి వందరూపాయల నోట్లు బొత్తిని ఇవతలకి లాగాడు. ఏడు నోట్లు తీసి తనవైపే చూస్తున్న మిత్రులవైపు నిర్లక్ష్యంగా విసిరాడు. "ఎవరికి రావాల్సింది వాళ్ళు తీసుకోండి. మిగిలింది ప్రతాప్‌కి. అతను దెబ్బలు తిన్నాడు...." అన్నాడు.

వంద రూపాయల నోట్లని పెంపో చిరునవ్వుతో చూశాడు....

(ఇంకా వుంది)

పోరు?

అమానుష హత్యలు!

డి.వి.వి. సత్యనారాయణ

రాత్రి పదకొండు దాటుతోంది.

సునీత, రామారావు గుండెలపై తలపెట్టుకుని ఉంది. హఠాత్తుగా ఏదో మీదపడినట్టయి ఉలిక్కిపడి లేచింది ఆమె. 'బుస్' అన్న శబ్దం వినిపించింది ప్రక్కలో.

పడిన వస్తువేమిటో ఆమె కర్థం అయేలోపున ఆమె

భర్త 'అబ్బా' అని లేచాడు.

సునీత ఒక్క ఉదుటున లేచి మంచంమీద నుండి దూకి లైటువేసింది. ఆమె భర్తమీద ఒక గోధుమత్రాచు పడగ విప్పి ఆడుతోంది. లైటు వేయగానే అతని ముఖంమీద మరోసారి కాటువేసింది.

ఆ దృశ్యం చూసి ఆమె పిచ్చిగా అరిచి మూల కన్పించిన కఱ్ఱనందుకుని పాము పడగని కొట్టింది. పాము ఒక్క ఉదుటున తప్పించుకుంది. కాని కఱ్ఱతగిలి మంచం మీదనుండి క్రింద పడింది. మరుక్షణంలో క్రోధంతో సునీతని సమీపించి కాటేసింది. బాధతో కాలు పట్టుకుంది సునీత.

ఆమె భర్త మంచంపై పొర్లుతున్నాడు.

తమని కాటేసిన పాముని సునీత వదిలిపెట్టదలుచుకో లేదు. కఱ్ఱతో పాముని పిచ్చిగా కొట్టసాగింది. పాము తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ ఆమెని కాటేస్తోంది. కాని సునీత దాన్ని వదలలేదు. పడగమీద తగిలేలా కొట్టింది. పాముతల చితికిపోయింది. సునీత భర్తమీద పడి పోయింది.

* * *

రెండు రోజుల క్రింద వివాహం జరిగి అట్టహాసంతో సంతోషాల మధ్య ఉన్న ఆ ఇంట్లో ఇప్పుడు విషాదం అలుముకుంది.

రెండో కొడుకుని, కోడల్ని తలుచుకుని క్రుంగిపోతు న్నాడు ఇంటి పెద్ద, అరవై ఐదేళ్ళ విశ్వనాథం.

బాగా దగ్గరైనవాళ్ళు తప్ప మిగిలిన బంధువులు వెళ్ళి పోయారు. విశ్వనాథం ప్లీడరు గుమాస్తాగిరిని చేపట్టి

పెద్దకొడుక్కి వారసత్వంగా దానిని అందించాడు.

ఆయనకు ముగ్గురు కొడుకులు, ఐదుగురు కూతుళ్ళు. ముగ్గురు కూతుర్లకు, ఇద్దరు కొడుకులకు పెళ్ళిళ్ళు చేశాడు.

2

కొడుకు, కోడలు పోయి యింకా నెల గడవలేదు.

పెద్దకొడుకు, మూడో అల్లుడు చావు బ్రతుకులమధ్య గవర్నమెంట్ ఆసుపత్రిలో ఉన్నారని విశ్వనాధంకి కబురు అందింది.

అందరూ ఆసుపత్రికి వెళ్ళేసరికి ఇద్దరూ పోయారు.

వాళ్ళిద్దరూ కోర్టు ఎదురుగా ఉన్న కిళ్ళీకొట్టు దగ్గిర సిగరెట్లు కాల్చడానికి వెళ్ళారుట:

అక్కడో పాక హోటల్ వుంది. అక్కడేదో గొడవ జరిగిందిట! దొమ్మీ జరిగింది. కొడుకు ముఖంమీద పాలు మరుగుతున్నవి పోశారు. పగిలిన షోడా సీసాతో అల్లుడ్ని పొడిచారు. వాళ్ళతోపాటు మరో ఇద్దరు పోయారు. ఆరు గురికి గాయాలు తగిలాయి.

పోలీసులు దొమ్మీ కేసును బుక్ చేశారు. ఎవ్వరూ పట్టుబడలేదు. గొడవ ఎలా జరిగిందో ఎవ్వరూ చెప్పలేక పోతున్నారు.

విశ్వనాధం గుండె పగిలేలా అరిచాడు.

* * *

రాత్రి రెండవుతోంది. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

లారీ జోరుగా వస్తూంది.

రోడ్డుమీద చిత్తుకాగితాలు పడివున్నాయి. ప్యాకెట్ పెట్టెలలో ఉండే గడ్డిలాటి కాగితం అది. ఆ రోజే ఏదో స్టాక్ వచ్చి ఉంటుంది. స్టాకు సర్దుకుని కాగితాలను కుప్ప

బగా రోడ్డుమధ్య పోసి పోయారు. ట్రాఫిక్ గురించి వీళ్ళ కసలు పట్టదు అని విసుక్కుంటూ లారీని కాగితాల మీదనుండి పోనిచ్చాడు డ్రైవర్.

అతనికి తెలీదు ఆ కాగితాల మధ్యలో ఇద్దరు స్మృతి లేని స్థితిలో ఉన్నారని. వాళ్ళిద్దరూ విశ్వనాథం చిన్న కొడుకు, రెండో అల్లుడు!

*   *   *

మధ్యాహ్నం సరుకులు తేడానికి బజారుకుపోయిన కొడుకు, రెండో అల్లుడు ఎంతకూ రాకపోయేసరికి కీడు శంకించి పెద్దల్లుడు పోలీసు కంప్లైంటు ఇవ్వడం మంచి దని మామగారికి సచ్చచెప్పి బయల్దేరాడు.

దారిలో ఒక కుర్రాడు వచ్చి 'ప్రసాదం సార్' అని కొబ్బరి ముక్కలు, మరమరాలు, బెల్లం, వెనగపప్పుల మిక్చర్ కొంత గుప్పిట్లో పోసి మరో షాపులో పంచ డానికి వెళ్ళాడు.

ఆరోజు వినాయక చవితి! అట్టహాసంగా ఆ వీధిలో ఉత్సవాన్ని చేస్తున్నారు.

తా నిచ్చిన ప్రసాదంలో ప్రమాదకరమైన విషం ఉందని ఆ కుర్రాడికి తెలీదు. ఆ వచ్చే ఆయనికి ఈ ప్రసాదం పెట్టు బాబూ అని ఒక వ్యక్తి ఇస్తే తాను కొంత తిని ఆ వ్యక్తి చెప్పిన ఆయనకి పెట్టాడు. తన చేతిలో ప్రసాదం ఉండగా ఆ వ్యక్తి దగ్గర తీసుకోవడ మేమిటని ఆలోచించలేని వయస్సు ఆ కుర్రాడిది.

ఆ చెప్పిన అతను ఈ ఉత్సవ కమిటీలో ఒక మెంబరు అనుకున్నాడు పాపం!

ఏదో చెప్పిన పనిని చేసి వలంటీర్ అన్పించుకోవాలని తాపత్రయపడే అమాయకపు కుర్రాళ్ళలో వాడొకడు!

3

"పదిహేను రోజుల్లో ఏడుగురు పోయారా?" ఇనస్పెక్టర్ ఫరీద్ ఆశ్చర్యంగా అడిగాడు విశ్వనాథాన్ని.

"అవును బాబూ అవును" మొత్తుకుంటూ ఏడుస్తున్నాడు ఆయన.

"మరి పోలీసులకి ఎందుకు కంప్లయింట్ ఇవ్వలేదూ!"

"ఇవన్నీ హత్యలేనంటారా?" పెద్దమ్మాయి అడిగింది.

వెంటనే జవాబు చెప్పలేకపోయాడు ఫరీద్.

నిజమే! తనూ చెప్పలేడు. హత్య అంటే ఎవరు చేశారు అన్న ప్రశ్నకు, ఎలా చేశారు అన్న ప్రశ్నకు, జవాబులు దొరకాలి.

ఒకటి పాముకాటు, ఒకటి దొమ్మీకేసు, మరొకటి త్రాగి రోడ్డుమీద పడి వుండడం వలన (పోస్టుమార్టంలో తేలింది) మరొకటి విషం తీసుకోవడం ఈ మరణాలకి కారణాలు.

మొదటి మూడింటిలో యిది హత్య అని చెప్పడానికి ప్రత్యేక కారణం యేదీ కన్పించడంలేదు. చివరిది హత్య కాదు అని చెప్పలేము. కాని కుర్రాడికి, చనిపోయిన వ్యక్తికి సంబంధం లేదు కనుక ప్రమాదవశాత్తు జరిగింది అనుకోవచ్చు కదా!

కనుక తనకే అర్థంకాని సమస్య వీళ్ళకేం అర్థం అవుతుంది? పైగా దొమ్మీకేసు పైలు తనదగ్గర ఉంచుకుని ఆ ప్రశ్న తను అడగకూడదు కదా! అనుకున్నాడు ఫరీద్.

ఒకే ఇంట్లో యింతమంది చనిపోయారు కనుక ఇవి కచ్చితంగా హత్యలే!

విశ్వనాథం తప్ప ఆ యింటికి మగదిక్కు లేదు. విశ్వనాథాన్ని కూడా చంపేస్తారా?

ఈ కేసు వెనక హంతకుడు ఒకడేనా? యింకా ఉన్నారా? హత్యలకి బహుశా పగ కారణం కావచ్చు. కనుక ఆ కారణం విశ్వనాధానికి తెలిసివుండాలి!

"మీరు మీకు తెలిసికాని తెలీకకాని యెవరికైనా యిష్టంలేని పని చేశారా?" విశ్వనాధాన్ని ఈ ప్రశ్నే పదే పదే అడిగాడు.

ఏడ్వడం తప్ప ఆయనేం చెప్పడం లేదు.

మఫ్టీలో నలుగురిని కాపలా ఉండమని చెప్పి వచ్చేశాడు.

వయసులో ఉన్నప్పుడు యే స్త్రీనైనా ఈ విశ్వనాధం మోసం చేశాడా? ఆ సంతానం యెవరైనా పగతో ఈ హత్యలు చేయవచ్చు.

ఇలా కారణాలు యెన్నో ఉన్నాయి. ఆలోచిస్తూ ఫరీద్ దామ్మీ కేసు జరిగిన చోటకు వెళ్ళి వివరాలు తెలుసుకోడానికి ప్రయత్నించాడు.

4

సాయంత్రం ఏడవుతోంది.

విశ్వనాధం పెద్దకోడలు బాత్రూంలోకి వచ్చింది.

లోపల గడియ వేసుకుంది. చీర విప్పి తలుపుమీద వేసింది. జుట్టు ముడి వేసుకుని బకెట్లో చెంబుని ముంచి తలమీద పోసుకుంది.

ఒక్కసారి పెట్రోలు వాసన వచ్చింది. అదేమిటి తను నీళ్ళు బకెట్ తో పెట్టుకుని చీర తెచ్చుకోడానికి వెళ్ళింది. ఇంతలో నీళ్ళు పెట్రోల్లా ఎలా మారిపోయాయి?

అంతలోనే బాత్రూంలో అగ్గిపుల్ల వేసిన చప్పుడు. వెలుగుతున్న పుల్ల వచ్చి ఆమెమీద పడింది.

* * *

విశ్వనాథ పెద్దకూతురు పిల్లలకు వంట చేసింది.

పెద్దవాళ్ళు తిండి మానేశారు. పిల్లల కోసమయినా వండాలి.

చుట్టుప్రక్కలవాళ్ళు ఆ యింట్లో యేదో అరిష్టం ఉందన్నారు. ఇన్నాళ్ళూ లేని యీ అరిష్టం యీ రోజు వచ్చిందా?

ఎవరో కావాలని చేస్తున్నారు? ఎవరబ్బా? తమ కుటుంబంమీద అంత పగ ఉన్నవాళ్ళు ఎవరు? ఆలోచిస్తూందామె.

అన్ని చావులు వరుసగా సంభవించడంతో బంధువులు అందరూ వెళ్ళిపోయారు.

భర్తలు పోయిన బాధని దిగమ్రింగుకుని పిల్లల కోసం లేని ధైర్యం తెచ్చుకున్నారు ఆ ఆడవాళ్ళు.

ఆకలేసి పిల్లలు ఏడుస్తున్నారు.

"ఎవరు ఏడవకుండా కూర్చుంటే వాళ్ళకి ముందు పెడతాను. వరుసలో కూర్చోండి, యేడుగురూ—" అంది.

పిల్లలందరూ వరుసలో కూర్చున్నారు.

పెద్ద కంచంలో కలిపిన అన్నాన్ని ఏడుగురి ప్లేట్లోనూ పెట్టింది.

ఎనిమిదేళ్ళ పెద్దవాడు "నేను తినను. నాకు ఈ అన్నం వద్దు" అన్నాడు ప్లేట్ ముందుకి త్రోసివేసి.

"అలా గొడవ చెయ్యకూడదు నాన్నా! నువ్వు పెద్దవాడివి. చక్కగా తినెయ్యాలి ఓ.కే." అంది.

"అన్నం వాసనొస్తోంది" అన్నాడు వాడు.

"పీ తలకాయ. ఏం వాసన? మాబాగా తెలిపిపోయింది" అని నవ్వుకుంటూ నోట్లో ముద్ద పెట్టుకుని

తివిచూసింది.

పీజమే! ఏదో వాసన వస్తోంది. పీళ్ళందరూ చిన్నవాళ్ళ మూలాన తినేస్తున్నారు.

అంతలో పెరట్లో పెడబొబ్బలు విన్పించి అటు పరిగెత్తింది కంగారుగా.

బాత్రూంలో మంట కన్పించింది.

అటు పరిగెత్తి కళ్ళు తిరిగినట్టయి పడిపోయింది.

5

"డామిట్! ఒకేరోజు తొమ్మిది హత్యలు!"

ఆ పసివాళ్ళ శవాలను చూసేసరికి ఫరీద్ నిగ్రహాన్ని కోల్పోయాడు. అతని మనసుకు అతనే సమాధానం చెప్పుకోలేక చిందులు వేస్తున్నాడు.

పేపర్లలో దీని గురించి విపరీతంగా వ్రాశారు. నగరంలో పెద్ద అలజడి రేపిం దీ కేసు. అంతవరకూ డిపార్ట్‌మెంటులో వున్న ఫరీద్ పరపతి దిగజారిపోయింది.

నిన్నటినుండి అతనికి ఫోన్‌మీద ఫోన్‌లు! వరుస పెట్టి చివాట్లు!

అయినప్పటికీ ఫరీద్ తన డ్యూటీని మర్చిపోలేదు.

ఆ వీధిలోని వాళ్ళనందర్నీ ప్రశ్నించాడు.

పాలవాళ్ళని, పేపర్‌బోయ్స్‌ని అందర్నీ నిలదీశాడు.

ఎంత చేసినా ఫలితం శూన్యం.

తన ఉద్యోగంపోయినా బాధపడడు. కాని అభం శుభం యెరుగని పసిపిల్లల్ని చంపిన కిరాతకుల్ని పట్టాలి! వాళ్ళని కసిదీరా చితకగొట్టాలి.

ఫరీద్‌లో ఆవేశం పెరిగిపోసాగింది.

ఆ ఇంటికి బందోబస్తు చేయించాడు.

ఇంట్లోకి ఎవరు వెళ్ళినా, ఎవరు బయటకు వచ్చినా తెలిసేలా గట్టి నిఘా వుంది.

కాని ఇలా ఎన్నాళ్ళు?

కాపలా తగ్గగానే హంతకుడు మళ్ళీ విజృంభిస్తాడు. అందుకే విశ్వనాధం గత జీవితం గురించి పరిశోధన మొదలుపెట్టాడు ఫరీద్.

ఆ ఇంట్లో విశ్వనాధం, నలుగురు కూతుర్లు మిగిలారు.

విశ్వనాధం పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతను బ్రతకడం కష్టం అని పెదవి విరిచారు డాక్టర్లు.

ప్రస్తుతం ఇంటెన్సివ్ కేర్‌లో వున్నాడు. అతని నలుగురు కూతుర్లుకూడా ఆసుపత్రిలోనే ఉన్నారు.

ఇంటిదగ్గిర ఒక కాన్‌స్టేబుల్ని ఉంచి మిగిలినవారిని ఆసుపత్రికి కాపలాగా పంపించాడు ఫరీద్.

విశ్వనాధం చేత ఏమీ మాట్లాడించలేకపోయాడు ఫరీద్. పలకరిస్తే పోలీసుల్ని తిట్టిపోస్తున్నారు ఆడపిల్లలు నలుగురూ.

పదేళ్ళ క్రితం ప్లీడరు గుమాస్తాగా ఉండేవాడు. వయసు మీద పడటంతో మానేశాడు. ఆ ప్లీడరు చనిపోయి రెండేళ్ళు అయింది. ఆ ఇంట్లో విశ్వనాధం గురించి ఎవరికి అంతగా తెలిసినట్టుగాలేదు. అంతక్రితం ఏదో వ్యాపారం చేసేవాడుట! ఆర్థికంగా కొంత చిక్కిపోయాడు.

మిగిలినవారు ఉద్యోగులైతే పెద్దకొడుక్కి ప్లీడరు గుమాస్తాగిరిని ఎందుకు మిగిల్చాడు? దానికీ సమాధానం దొరికింది. పెద్దవాడు చిన్నప్పటినుండి సరైన ప్రవర్తనలో లేడని తెలిసింది. అతనివైపు నుండి కూడా పరిశోధన చేయసాగాడు ఫరీద్.

అతని పరిశోధన ఒకచోట ఆగిపోయింది.

కాని కావలసిన ఆధారం దొరికింది.

హుషారుగా ఫరీద్ ఆసుపత్రికి వచ్చాడు.

రాగానే అతనికి పిడుగులాటి వార్త చెప్పారు అక్కడి సిబ్బంది.

6

విశ్వనాధం కూతుర్లు నలుగురు ఇంటెన్సివ్ కేర్ రూమ్ బయట బెంచిమీద కూర్చుని ఉన్నారు. భోజనాలు లేక పోవడంవలన నీర్సంగా ఉన్నారు. ముఖాలు పీక్కు-పోయాయి. కళ్ళల్లో ఉన్నాయి ప్రాణాలు.

భర్తల్ని, పిల్లల్నిపోగొట్టుకొని నిరాసక్తతతో కొందరు ఉంటే వరుసగా సంభవించిన ఈ హత్యలకు బెంబేలెత్తి పోతున్నారు పెళ్ళికాని పిల్లలిద్దరూ.

ఎవ్వరూ వాళ్ళదగ్గిరకు రావడానికి లేరు. ఓదార్చేవాళ్ళు లేరు. కాకిడ్రెస్సులు, వైట్ డ్రెస్సులు తప్ప వాళ్ళని ఎవరూ పట్టించుకోవడం లేదు.

వాళ్ళ తిండిగురించి పట్టించుకునే నాధుడే లేడు!

తిండిమాట ఎత్తితే అక్కలేమన్నా అనుకుంటారని చెల్లెళ్ళు, చెల్లెళ్ళు అనుకుంటారని అక్కలు ఎవరికివారు మొహమాటపడుతూ కడుపులు కాల్చుకుంటున్నారు.

ఆ సమయంలో ఒక డబ్బై ఏళ్ళ ఆయన వచ్చాడు. ఆయన చేతిలో బుట్టెడు ఆపిల్సు ఉన్నాయి. అక్కడున్న అందరికీ వరుసగా ఒక్కొక్క పండే ఇచ్చాడు. పోలీసులకి కూడా ఇచ్చాడు.

"మా మనుమడికి ఇంకేం ఫరవాలేదు బాబూ! డాక్టరు బాబు దేవుడు. చావబోయిన నా బిడ్డని రక్షించాడు. తినండి బాబూ తినండి. నా మనుమడిని పదికాలాలు బ్రతకమని

దీవించండి" అంటూ ఆపిల్స్ పంచుకుంటూ వచ్చి ఆయాస పడుతూ బెంచిమీద కూర్చున్నాడు. ఒక ఆపిల్‌ని ఆయన నోట్లో పెట్టుకున్నాడు.

అంతలో ఎదురుగా వున్న నలుగురు అమ్మాయిల్ని చూసి నొచ్చుకుంటూ "ఏమనుకోకండి చూడలేదమ్మా" అంటూ నల్గురికీ నాలుగు పండ్లు ఇచ్చాడు.

ఆకలితో ఉన్నవాళ్ళకి అది అమృతప్రాయమన్పించింది. ఇక మొహమాట పడకూడదనుకున్నారు ఎవరికి వాళ్ళు.

"తాతగారిలా ఉన్నారు. ఫరవాలేదు తినండి" అంటూ తింది పెద్దమ్మాయి.అందరూ ఆవురావురుమని తినసాగారు.

"ఏమమ్మా! నాన్నగారికి ఎలా ఉంది? నిన్నటినుండి సీరియస్‌గా ఉందా తల్లి! అందరూ చెప్పుకుంటూంటే విన్నాను. మా మనుమడు ఆక్సిడెంట్లో చావబోతే డాక్టరు రక్షించాడు. ఈరోజే డిశ్చార్జి చేశారు" అని కాసేపు కూర్చుని కబుర్లుచెప్పి వెళ్ళిపోయాడు.

ఆరోజు ఒక కుర్రాడ్ని డిశ్చార్జ్ చేశారు. అది అందరికీ తెలుసు. వాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళైన మూలాన హడావిడి చేసి. తీసుకువెళ్ళారు. బంధువులందరూ వచ్చారు.

అందుకే ఆ ముసలాయన మీద ఎవ్వరికీ అనుమానం రాలేదు. విషం ఆ అమ్మాయిలకిచ్చిన పళ్ళలోకి సిరంజి ద్వారా ఇంజెక్టు చేయబడిందని ఎవరికీ తెలియలేదు.

7

ఫరీద్ మౌనంగా బాధపడుతున్నాడు.

ఆసుపత్రిలో హత్యలు జరిగిన విషయంలో తన తప్పు లేదని అతనికి తెలుసు. కాని నైతికంగా ఈ హత్యల వెనుకనున్న హంతకుడ్ని పట్టుకోవాలని, అది తన బాధ్యత అని బాధపడుతున్నాడు.

అతని పరిశోధనలో తేలిన విషయాలు అతన్ని ఆశ్చర్య పరిచాయి. అవి నిజమో కాదో తెల్చుకోవాలి. అందుకు తగిన ఆధారం కావాలి. సాక్ష్యం కావాలి. హంతకుడు కుర్రాడా? ముసలివాడా? అన్న సందేహం తీరిపోయింది. ఒక్కరా, ఎక్కువమందా అన్న ప్రశ్న లేదింక.

హంతకుడు దుర్మార్గుడే కావచ్చు. దయాగుణంకూడా ఉందనవచ్చు. దొమ్మీ కేసులో చనిపోయిన వారికి మరో కేసులో చనిపోయిన కుర్రాడికి ఒక్కొక్కరికి ఆరవై వేల చొప్పున నష్టపరిహారంగా వారి తాలూకు వ్యక్తులకు అందజేశాడు.

విశ్వనాధంమీద పగబట్టిన మనిషే ఇన్ని అమానుష హత్యలు చేస్తున్నాడన్నది స్పష్టం!

అతను ముసలాడిగా మేకప్ చేసుకుని తిరుగుతున్నా డనుకున్నాడు ముందు. కాని అది నిజంకాదని తేలిపో యింది. కాని హంతకుని ఆచూకీ ఎలా తెలియడమని! అతన్ని చూసినవాళ్ళు ఉన్నారు. అతని వివరాలు అన్నీ తనకీ తెలుసు. అతని ఫోటోలు అన్ని స్టేషన్‌లకు పంపాడు కూడా.

అతన్ని చూసిన కొందర్ని (ఆసుపత్రిలో పోలీసు సిబ్బంది) రైల్వేస్టేషన్లు మొదలైనచోట ఉంచాడు.

విశ్వనాధం వంశాన్ని హంతకుడు తుడిచిపెట్టేశాడు. అతని పగ తీరిపోయింది. కాబట్టి తమవేట ఎన్నాళ్ళు కొనసాగించడం?

అంతలో కాన్‌స్టేబుల్‌వచ్చి 'ఎవరో ఒకాయన మీకోసం వచ్చారు' అన్నాడు.

"రమ్మను"

ఏభై ఏళ్ళతను లోపలికి వచ్చి విష్‌చేశాడు.

"ఇన్‌స్పెక్టర్! ఒక ముసలాయన ఈ లెటర్ మీకిమ్మని ఇచ్చాడు. తన దగ్గరకు మిమ్మల్ని తీసుకురమ్మన్నాడు" అని లెటర్ ఇచ్చాడతను.

"మీరెవరు? ఈ ముసలాయన మీకేం అవుతాడు?"

"ఈయన మా ప్రక్కవాటాలో ఉంటున్నాడు. ప్రొద్దుట నుండి మనిషి చాలా నీరసంగా ఉన్నాడు. విపరీతంగా దగ్గుతూ బాధపడుతూంటే నా భార్యా, నేను వెళ్ళి చూశాం. నేను స్టేట్ బ్యాంక్ ఉద్యోగిని"

ఫరీద్ లెటర్ చదవసాగాడు—

"చిరంజీవి ఫరీద్!

నన్ను పట్టుకోవాలని నువ్వెంత తాపత్రయపడుతున్నావో నాకు తెలుసు. విధి నిర్వాహణని దైవంలా భావించే నిన్ను బాధపెట్టకూడదని, నన్ను అరెస్ట్‌చేసే అవకాశం నీకిస్తున్నాను. విశ్వనాథం కుటుంబాన్ని సర్వనాశనం చేసింది నేనే! కారణం....పగ!

నా కిప్పుడు డెబ్బైయ్యేడేళ్ళు. కృష్ణా, రామా అనుకుంటూ గడపవలసిన నేను పసిపిల్లల్ని సైతం యింత అమానుషంగా యెలా చంపగల్గానా అని అందరూ ఆశ్చర్యపోవచ్చు. కాని విశ్వనాథం మా కుటుంబానికి చేసిన ద్రోహానికి ప్రతీకారం తీర్చుకోకపోతే నా బ్రతుకు వృధా.

నాకు తెలుసు—ఈ పగ, ప్రతీకారాలవల్ల సాధించేది లేదని. కాని మా వంశాన్ని సర్వనాశనం చేసినవాడికి తిరిగి అదే శాస్తి చేశాను. పధ్నాలుగు యేళ్ళపాటు జైలు కటకటాల వెనుక క్రుమ్మగ్గి ప్రతీక్షణం నేను 'కసి' పెంచుకున్నాను—పెరిగే వయసు నాలో వైరాగ్యాన్ని, జాలి, కరుణని కల్గించకూడదని, నా ప్రతీకార జ్వాల చల్లారిపోకూడదని.

అందుకే యిన్ని హత్యలు చేయగలిగాను.

నా పేరు ప్రశాంత్‌కుమార్. నా తమ్ముడి పేరు ప్రేమ్ కుమార్.

మా యిద్దరికీ పదేళ్ళ వయసు తేడా ఉంది. మా నాన్న గారికి రెండో భార్య ద్వారా పుట్టినవాడు నా తమ్ముడు.

మేము సవతిబిడ్డలుగా యెప్పుడూ మెలగలేదు. ప్రాణానికి ప్రాణంగా పెరిగాము. ఆస్తిని పంచుకోకుండా మెలిగాము. నేను గుర్రప్పందాలు ఆడేవాడిని. అదైనా నా ఖర్చుల నిమిత్తం తీసుకునే సొమ్ముతో. నేను వయసులో ఒక ముస్లిం అమ్మాయిని ప్రేమించాను. నాన్నగారు ఒప్పుకోక పోవడం వలన నేను ధైర్యం చూపించలేక పోయాను. ఆ అమ్మాయి వేరే పెళ్ళి చేసుకుంది. నేను పెళ్ళిమీద విరక్తితో బ్రహ్మచారిగా మిగిలిపోయాను.

నా తమ్ముడు పెళ్ళి చేసుకున్నాడు. నలుగురు పిల్లలు పుట్టారు. తమ్ముడు బాగా యోగ్యుడు. వ్యాపారంలో బాగా రాణించాడు. పార్ట్నర్‌గా విశ్వనాధాన్ని చేర్చుకున్నాడు.

విశ్వనాధంమీద నాకు గురి కుదరలేదు. నా తమ్ముడ్ని హెచ్చరించేవాడిని. ఇది గమనించిన విశ్వనాధం నాకు, నా తమ్ముడికి గొడవలు లేవదీశాడు. ఒక చీడపురుగువలన మా మధ్య గొడవలు రావడం ఇష్టంలేని నేను ఆస్తి అంతటిని తమ్ముడికి వ్రాసి ఇచ్చేశాను.

ఆ మర్నాడే—మా మరదలు పాముకాటు వలన చనిపోయింది. అది నా పనే అని ఆస్తిని అందుకే తమ్ముడి పేరున వ్రాశానని ఈ విశ్వనాధం నాతమ్ముడ్ని నమ్మించాడు.

మా మధ్య మరింత అగాధం పెరిగిపోయింది. తరచుగా గొడవలు జరిగేవి. ఈ అవకాశాన్ని తీసుకుని వ్యాపారాన్ని తానే ఓకప్ చేసి నక్క వినయాన్ని నటిస్తూ నష్టాలు

చూపించసాగాడు. తినగలిగినంతా తినేస్తున్నాడు. నేను యెంత అరిచినా ప్రయోజనం లేకపోయింది.

ఆ తర్వాత ఒకరోజు అభం శుభం ఎరగని నా తమ్ముడి నలుగురి బిడ్డలు విషాహారంవలన చనిపోయారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నా మీదే అనుమానంగా ఉందని నా తమ్ముడు వాళ్ళతో చెప్పాడంటే వాడిని ఎంత నమ్మించగలిగాడో ఈ విశ్వనాథం, ఆలోచించు.

పైగా ఈ విశ్వనాథం పెద్దకొడుకు ఒక ఛండాలుడు. వాడ్ని వ్యాపారంలోకి లాగాడు. తండ్రీకొడుకులు చేసిన అకృత్యాలకి అంతులేదు. మా బంధువులలో నేను తల యెత్తుకోకుండా చేశాడు. నేనొక వ్యభిచారిననీ, అందుకే పెళ్ళికాకుండా ఉండగల్గుతున్నాననీ, నాకు ఒక వివాహపు స్త్రీతో అక్రమసంబంధం ఉందనీ చెప్పాడు. ఎవరో ఒక స్త్రీని తెచ్చి సాక్ష్యం చెప్పించాడు.

నా తమ్ముడు నన్ను పూర్తిగా విసర్జించాడు. ఒకసారి వాడు నన్ను రమ్మని కబురుపెడితే వెళ్ళాను. నా తమ్ముడు రక్తపుమడుగులో ఉన్నాడు. ఆ తర్వాత పోలీసులు నన్ను అరెస్టు చేశారు. నేను నేరస్థుడనని ఎన్నో ఋజువులు చూపించగలిగాడు విశ్వనాథం.

నాకు యావజ్జీవ కారాగారశిక్ష పడింది. చెయ్యని నేరానికి నా వృద్ధజీవితం జైల్లో గడిచింది—పగతో....ప్రతీకారంతో....

విశ్వనాథం వ్యాపారాన్ని హస్తగతం చేసుకున్నాడు. లక్షలు నష్టాలు, అప్పులు చూపించి ఆస్తిని స్వాధీనం చేసుకున్నాడు. కాని ఏం లాభం? వాడి కొడుకు వాడ్ని చాలా వరకు ఆర్పేసాడు.

జైలు నుండి వచ్చాను. నా పగని సాధించాను.

అందుకే తృప్తిగా విషం తీసుకుంటున్నాను.

నాకు గర్వం కలిగించిన విషయం—నువ్వు నేను ప్రేమించిన ఆ ముస్లిం అమ్మాయి మనవడివి. నిన్ననే నాకీ విషయం తెలిసింది. నీ చట్టం దృష్టిలో నేను హంతకుడ్ని కావచ్చు. కాని నిన్ను చూడాలనిపిస్తోంది.

ఒక్కసారి రాగలవా?

అదయినా నేను పోయేలోపున—

నీకు అన్నీ చెప్పుకోవాలనిపించి వ్రాశాను. ఈ విషయాలన్నీ మరిచిపోయి నీ వృత్తిధర్మాన్ని నిర్వర్తించు. మీ అమ్మమ్మని చేరుకోబోతున్న నేను ఒకే ఒక్కసారి నిన్ను చూడాలన్న కోరికతో వున్నాను. తొందరగా వస్తావుకదూ!"

—ఫరీధ్ ఆ ఉత్తరాన్ని జేబులో కుక్కుకున్నాడు. "మీ యింటికి పదండి" అని జీపువైపు పరిగెత్తాడు ఆదుర్దాగా। □

బోడిగుండుకు హెల్మెట్!



హంతకురాలు

ఎమ్.ఓ.చైతన్య

ఉదయం ఎనిమిది గంటలు.

స్వప్న దినపత్రిక చదువుతూ కూర్చుంది.

అల్లంతదూరం నుంచి ఆరడుగుల పొడవు వున్న ఓ వ్యక్తి గబగబా అడుగులు వేస్తూ—తన ఇంటివైపు వస్తూ

కన్పించాడు.

అత నెవరో పోల్చుకోడానికి ప్రయత్నించింది. కానీ, తనెన్నడూ అతన్ని చూసిన గుర్తులేదు. తన ఇంటిముందు టులెట్ అన్న బోర్డును చూసి వస్తున్నాడేమో అనుకుంది. మనిషి చూడటానికి బావున్నాడు. సినిమాస్టారుగా చక్కగా రాణిస్తాడు అనుకుంది.

మేడమీది గదిలోని కిటికీ ప్రక్కన కూర్చుంది తను. వూహించినట్లుగానే ఆ వ్యక్తి వచ్చి కాలింగ్‌బెల్ మ్రోగించాడు.

గబ గబా మేడమెట్లు దిగి క్రిందికి వెళ్ళి తలుపు తెరిచింది.

ఎదురుగా ఆరడుగుల వ్యక్తి నవ్వుతూ కన్పించాడు.

"గుడ్‌మార్నింగ్ స్వప్నగారు...." అన్నాడు.

స్వప్న ఒకింత ఆశ్చర్యపోయింది. తన పేరు అతనికెలా తెలుసు.

"గుడ్‌మార్నింగ్ ....మీరు ...."

"నా పేరు నాయుడు. రమేష్‌నాయుడు....సంక్షేమసంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను ...."

"సంక్షేమ సంస్థా! అలాంటి పేరు యెప్పుడూ వినలేదే!"

"విని వుండరు! ఇదొక రహస్య సంస్థ. చాలా తక్కువమందికి తెలుసు...."

"చందాకోసమా?"

"కాదు....మీతో రెండు నిముషాలు మాట్లాడ్దానికొచ్చాను...."

అతన్ని లోనికి ఆహ్వానించాలా? వొద్దా? అన్న

సందిగ్ధంలో పడింది. కొత్తవాళ్ళను లోనికి ఆహ్వానించడం అంత మంచిదికాదు. అతన్ని బయటినుంచే పంపించెయ్యాలి అనుకుంది. కానీ అతను ఏం చెప్పినా వొదలడంలేదు.

"నేను చాలా బిజీగా వున్నాను. రెండునిముషాలు అంటున్నారు కాబట్టి.... కేవలం రెండే నిముషాలు మీ కోసం స్పేర్ చేయగలను....రండి...." అని లోనికి పిలిచింది.

ఇద్దరూ హాల్లోకి నడిచారు. ఆకర్షణీయమైన ఫర్నీచర్ వుంది హాల్లో. చెరో కుర్చీలో కూర్చున్నారు.

"మీరెదుర్కొంటున్న సమస్యకు భరతవాక్యం పలకడాని కొచ్చాను నేను...." అన్నాడు.

స్వప్న నవ్వింది.

"కానీ—నాకు సమస్య లేమీ లేవు!" చెప్పింది.

"సంక్షేమ సంస్థ మీరనుకున్నంతటి మామూలు సంస్థ కాదు. చాలా ప్రత్యేకమైనది. వినూత్నమైనది. మా సంస్థలో యెవరినైనా సభ్యులుగా చేర్చుకోవడానికిముందు ఆ సభ్యుడి గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటాం. వాళ్ళ సమస్యలను పరిశోధిస్తాం. మీ గురించి మేం చేసిన పరిశోధన గురించి, మాకు తెలిసిన నిజాలేమిటో చెప్పిన తర్వాత, అసలు మీకు సమస్య ఉందో లేదో అప్పుడు చెబుదురుగానీ...."

"మీకు ముప్ఫయి ఏళ్ళు వున్నాయి. ఇంకా పెళ్ళి కాలేదు. మీ నాన్నగారు చనిపోయి దాదాపు పద్దెనిమిదేళ్ళు అయింది. ఆయన వెళ్ళిపోతూ ఒక ట్రస్టును నెలకొల్పారు. ప్రతి ఏటా ఆ ట్రస్టుమీద వస్తున్న ఆదాయంతో మీరు కాలక్షేపం చేస్తున్నారు.

"మీకున్న ఏకైక బంధువు లక్ష్మీకాంతమ్మగారు. ఆమెకు అరవై ఏళ్ళు ఉంటాయి. మీకు గార్డియన్‌గా ఉంది. పైగా ఇబ్బందులు పెడుతోంది. ఎన్ని సంబంధాలొచ్చినా ఆమె చలువవల్ల అన్నీ ఫెయిలయ్యాయి. ఆమె పోతేగానీ—ఆస్థి అంతా మీ చేతికి రాదు....ఇదంతా కరెక్టా కాదా?" ఆగాడు ఒక్క క్షణం.

ఆమె "కాదు....కాదు...." అని అరవాలనుకుంది. కానీ—ఆమె గొంతు ఎండి పూడుకుపోయింది. యాంత్రికంగా "ఔను" అన్నట్లు తల వూపింది.

తన వ్యక్తిగత విషయాలన్నీ ఎలా తెలుసుకోగలిగాడు ఇతను! స్వప్న ఆశ్చర్యంలోనుంచి తేరుకోలేకపోతోంది.

"మీ మొత్తం ఆస్థి విలువ కోటిడెబ్బయి అయిదు లక్షలు...." చెప్పాడతను.

తన ఆస్థి యెంత ఉందో ఖచ్చితంగా తనకే తెలియదు. నిజంగా అంత ఉందా? బహుశా ఉండవచ్చు!

"లక్ష్మీకాంతమ్మ పోతేగానీ — మీరు ఆనందంగా ఉండలేరు. మీరు ఎంత కాదనుకున్నా ఇది పచ్చి నిజం. ఆమె చాలా ఆరోగ్యంగా ఉంది, ఇప్పట్లో పోదు! మీరు ఊఁ అంటే ఆమెను పైకి పంపించే ఏర్పాటు సంక్షేమ సంస్థ చేపడుతుంది...." అని ఆగాడు.

"ఎంత పాపిష్ఠి ఆలోచన! మీరు మనుషులు కాదు.... రాక్షసులు...." అంది కోపంగా.

"నేను రాక్షసుడిని కాదు....సంక్షేమసంస్థ మేనేజింగ్ డైరక్టర్‌ను. నాది పాపిష్ఠి ఆలోచనే కావొచ్చు, అది మీ జీవితాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళుతుంది. లాభపడేది మీరుగానీ నేను కాదు. మీరు ఈ ప్రపోజల్‌కు ఒప్పుకుంటే—వారంరోజులపాటు మీరు కాశ్మీర్ వెళ

తారు....మీరు అక్కడ ఉండగానే వైజాగ్‌లో వున్న లక్ష్మీకాంతమ్మ పైలోకానికి వెళ్ళిపోతుంది...." అన్నాడు.

అతను చెప్పింది బాగానే అనిపించింది. నిజానికి తను లక్ష్మీకాంతమ్మను యేదోరకంగా అడ్డు తొలగించాలని చాలా కాలంగా ఆలోచిస్తోంది. విషప్రయోగంద్వారా చంపాలని లైబ్రరీకి వెళ్ళి చాలా పుస్తకాలు తిరగేసింది. కానీ—తన ప్రయత్నాలేవి విజయవంతం కాలేదు. ఆఖర ఖిలో అసాధ్యమని వొదిలేసింది.

"మీ ప్రపోజల్‌ను నేను ఒప్పుకున్నాననుకోండి, ఎంత ఖర్చు అవుతుంది...." అడిగింది.

"ఖర్చేమీకాదు, సభ్యత్వ రుసుము చెల్లించాలి ముందుగా! ఆస్థి కలిసి వచ్చింతర్వాత—ఒక పర్సెంట్ ఆస్థి సంక్షేమ సంస్థకు ఇస్తే చాలు....మీ బ్యాంకు బేలెన్స్ వెయ్యిరూపాయల చిల్లర ఉంది. సభ్యత్వ రుసుం ఇప్పు డేమీ చెల్లించనక్కర్లేదు. పైగా మేము కొంత డబ్బు ఎడ్వాన్స్‌గా ఇస్తాం. దాంతో మీరు కాశ్మీర్ వెళ్ళిరావొచ్చు. మీరు అక్కడ ఉండగానే—లక్ష్మీకాంతమ్మ హఠాన్మరణ వార్త టెలిగ్రాంద్వారా మేము తెలియజేస్తాం....మీరు అప్పుడు వెనక్కి వొస్తారు."

"అంటే....హత్యలో నా పాత్ర ఏమీలేదన్నట్లు ఎలిబీ సృష్టిస్తారు. దానికి కావల్సిన ఖర్చు మీరే పెట్టుకుంటారు. ఆస్థి కలసొచ్చింతర్వాత—ఆ డబ్బు మీకు తిరిగి ఇవ్వాలి. అంతేకదూ...."

"ఎగ్జాక్ట్లీ....దానికన్నా ముందు మీరో చిన్న పనికూడా చేయాలి" అన్నాడు.

"ఏం పని?"

అతను చిన్నగా నవ్వాడు.

"తర్వాత చెబుతాను."

"సరే! మీ ప్రపోజల్ నాకు నచ్చింది. కాని, మీరు నన్నో హంతకురాలిగా భావిస్తున్నారా...." గిల్టీకాన్షస్‌తో అడిగింది. అది నాయుడు గుర్తించాడు.

"లేదు. లక్ష్మీకాంతమ్మ మూలాన మీ జీవితం సర్వ నాశనం అయిపోతోంది. మీ యవ్వనం అడవి గాచిన వెన్నెల అవుతోంది. లక్ష్మీకాంతమ్మ స్వార్థపరురాలు. ఆమె తన జీవితంలో ఎప్పుడూ సుఖపడలేదు, ఇతరులు కూడా సుఖపడకూడదని కోరుకునే రకం."

"మీరు చెప్పింది నిజమే!" అంది.

"మీరేం కంగారు పడకండి! మీ నిర్ణయం మంచిదే." బలపరిచాడు.

"చిన్న పనేదో చేసిపెట్టాలన్నారు, ఏమిటది?"

"ఇవేళ రాత్రికి, ఓ హోటల్లో చిన్న పార్టీ వుంది. ఆ పార్టీకి ఒక వ్యక్తి వస్తాడు. అతనెవరో నేను చూపెడతాను. అతన్ని పరిచయం చేస్తాను. మీ రతన్ని మాటల్లో పెట్టి....నే నిచ్చే ఒక నిద్ర మాత్ర డ్రింకులో కలపాలి అతను చూడకుండా. అంతే!"

"అంతేనా?"

"ఊఁ అంతే!"

"ఏమిటా మాత్ర? విషమా?"

"కాదు. అదొక స్ట్రాంగ్ స్లీపింగ్ పిల్. అతన్ని ఒక గంట నిద్రలో ఉంచితే - సంక్షేమ సంస్థలో ఉన్న మరో సభ్యుడికి మంచి ఎలిబీని సృష్టించవచ్చు...."

"సరే?" ఒప్పుకుంది.

ఆ సాయంత్రం నాయుడు చెప్పినట్లుగా చేసింది.

మాత్ర వేసిన డ్రింకును తాగి ఆ వ్యక్తి కుర్చీలోంచి

ఢబీమని కింద పడిపోయాడు. అతని ముఖం భయంక రంగా మారింది బాధను భరించలేక. కళ్ళు తేలపేసాడు. అర నిముషంలో ప్రాణాలు వొదిలేసాడు.

స్వప్న కంగారు పడింది. భయంతో నోట మాట రాలేదు. అక్కడుంటే ప్రమాదమని నెమ్మదిగా జారు కుంది.

తనో హత్య చేసాననే విషయం గుర్తుకు వచ్చి ఆ రాత్రి ఎంత ప్రయుత్నించినా నిద్ర రాలేదు. ఆమెను పాపభీతి వెంటాడసాగింది. ఆ వ్యక్తి ముఖాన్ని మరిచి పోదామని ఎంత ప్రయత్నించినా పదే పదే గుర్తుకొస్తోంది. ఆ ముఖం తనను వెంటాడుతోంది.

తెల్లవారింది.

జరిగినదంతా పోలీసులకు చెప్పి - నాయుడు తనను ఎలా మోసగించాడో వివరించాలనుకుంది. సంక్షేమ సంస్థ కాదు అది. హత్యల సంస్థ. మనము ఒక హత్య చేస్తే - మన కోసం మరొకరిచేత ఇంకొక హత్య చేసిపెడతారు వాళ్ళు. అదే హత్య ఖరీదు.

సరిగ్గా పది గంటలకు పోలీస్‌స్టేషన్ కెళ్ళింది స్వప్న. ఇన్స్‌పెక్టర్ రాజేంద్రకు జరిగిన కథంతా పూసగుచ్చినట్లు చెప్పింది. ఆమె చెప్పిందంతా ఓపిగ్గా విన్నాడు రాజేంద్ర.

ఈ కేసును ఏం చేయాలో అతనికి అర్థం కాలేదు. ఒక హంతకురాలు తిన్నగా పోలీస్‌స్టేషన్‌కొచ్చి - తను ఒక హత్య చేసాను, కానీ - ఆ తప్పు తనది కాదని వాదిస్తూంది. ఆమెను అరెస్టు చేయాలా వద్దా? ఏదీ తేల్చు కోలేక పోలీసు ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ దగ్గరకి ఆమెను తీసుకెళ్ళాడు.

స్వప్న ఆ గదిలోకి అడుగుపెట్టి నిర్ఘాంతపోయింది.

రివాల్వింగ్ చైర్‌లో కూర్చున్న పి. ఏ. వోను చూసి భయభ్రాంతురాలయింది.

"ఇతనే....ఇతనే నా చేత హత్య జరిపించాడు. విషం నాచేతికిచ్చి నిద్ర మాత్ర అని మోసగించాడు" అని హిస్టీరికల్‌గా అరిచింది.

ఆమె ప్రక్కనే నిల్చున్న ఉమెన్ పోలీసు, ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ఆశ్చర్యచకితులయ్యారు. అంతలోనే తేరుకొని - "సారీ సర్....ఈ అమ్మాయికి స్క్రూ లూజు అని పసిగట్టాను కానీ - మరీ యింత పిచ్చిగా నా ముందు ప్రవర్తించలేదు. అలా ప్రవర్తించి ఉంటే - ఇక్కడికి కాకుండా పిచ్చాసుపత్రికి పంపించేవాడిని" అని, ఆమె చెప్పిన విషయాలు వివరించాడు.

"ఫర్వాలేదు మిస్టర్ రాజేంద్ర! నీ డ్యూటీ నువ్వు చేసావు. ఈ అమ్మాయి యెవరయినా మానసిక వైద్యుడి దగ్గర చికిత్స పొందుతుందేమో-వాళ్ళ బంధువులను అడిగి తెలుసుకో. బంధువు లెవరూ లేకపోతే ప్రభుత్వ ఆసుపత్రికి పంపించు! నేను లంచ్‌కు వెళుతున్నాను. మళ్ళీ ఈ అమ్మాయిని నా దగ్గరకు తీసుకురాకండి....వెళ్ళండి" అంటూ పి.ఏ.వో చైర్‌లో నుంచి లేచి - తన నల్లకోటు తీసుకొని బయటికి నడిచాడు.

దారిలో ఓ టెలిఫోను బూతు దగ్గర కారు ఆపి - రుద్రయ్యకు ఫోన్ చేసాడు.

"రుద్రయ్యా! కొంప మునిగింది. ఆ స్వప్న తిన్నగా పోలీసుస్టేషన్‌కెళ్ళి - సంక్షేమసంస్థ గురించి అంతా చెప్పింది."

"అరెరె....అలా జరగకూడదే! మన కెప్పుడూ ఇలా జరగలేదు....అయినా ఏం ఫర్వాలేదులే!"

"ఏమిటీ, ఏం ఫర్వాలేదు. నన్ను గుర్తుపట్టి నానా గొడవ జేసింది."

"ఇవాళ పొద్దున్నే, నేనో యువకుడితో మాట్లాడాను. భార్య అంటే కోపం. కానీ ఏం చేయలేడు. డబ్బు వ్యవహారమంతా ఆమె చేతిలో ఉంది. భార్యను తొలగించుకోవాలని చూస్తున్నాడు. పెద్ద సర్వీసు స్టేషన్ ఉంది అతనికి. మంచి కారు మెకానిక్కు. తిరుగులేని పని చేసి పెట్టగలడు. అతనిచేత స్వప్న కారు బ్రేకులు వూడగొట్టేయించేస్తాను. పీడా విరగడవుతుంది."

"గుడ్ ....అదేదో త్వరగా జరిపించు!" అని ఫోను పెట్టేసి వెళ్ళి కారు స్టార్ట్ చేసాడు పి.పి.వో. □

పొదుపు!

మొరగని కుక్క

— నీటా



"తమ్ముడూ,

నీ కిలాంటి లేఖ రాయాల్సి వస్తుందని నేను ఊహించలేదు. ఈ విషయంలో పూర్తి బాధ్యతను నా మీద వేసుకుంటున్నాను. ఇంతకాలం నేను కుటుంబం గురించి ఏమీ పట్టించుకోలేదు. ఇప్పుడు కళ్ళు తెరిచాను.

చేతులు కాలిపోయాయి.

ఇప్పుడు ఆర్థికంగా నా పరిస్థితి ఏమీ బాగుండలేదు. పిల్లలకు చదువుల విషయం అటుంచితే రేపు ఎలా అనే సమస్య ముందు కొచ్చింది. ఈ సమయంలో పిల్లలూ చెడిపోయారు. ముందు నుండీ నన్ను ఈ విషయంలో నువ్వు హెచ్చరిస్తున్నావు. అయినా నేను ఏ మాత్రం జాగ్రత్త పడలేదు.

పెద్దాడు నిరూప్ ఇంటర్ తప్పాడు. మొన్న తిరిగి రాసి పాసయ్యాననిపించుకున్నాడు. వాడికి ఇరవయినాలుగు గంటలూ డిటెక్టివ్ పుస్తకాలు చదవటం, సినిమాలు చూడటం, స్నేహితులతో తిరగటం అలవాటయింది.

వాడ్ని నేను ఇంక భరించలేను. నీ వద్దకు పంపిస్తు న్నాను. ఇక నుండి వాడి బాధ్యత నీదే. వాడ్ని ఏం చేస్తావో నీకే వదిలేస్తున్నాను. ఎక్కడయినా పనిలో పెడ తావో లేక చదివిస్తావో నాకు అనవసరం. అయితే నీ వద్ద వుంటున్నందుకు కనీసం క్రమశిక్షణతోనూ, ఆత్మ విశ్వాసంతోనూ బతికేలా తయారు కావాలని నేను ఆశ పడుతున్నాను.

చిన్నవాడి సంగతి నేను చూసుకుంటాను. ప్రస్తుతం నేను కొంతకాలంపాటు ఈ ప్రాంతాలనుండి వెళ్ళిపోవా లనుకుంటున్నాను. నా స్నేహితుడు బెంగుళూరు రమ్మ న్నాడు. వెళ్ళే ముందు నీ వద్దకు వస్తాను.

పిల్లలు బాగా చదువుతున్నారనుకుంటాను. కవిత నడిగినట్లు చెప్పు.

లెటర్ రాయగలవు,

నీ అన్నయ్య."

లెటర్ చదవటం ముగించి, నిరూప్ కేసి చూశాడు విక్రాంత్.

ఆధునికంగా జీవితాన్ని ఎంజాయ్ చేయాలనే దృక్పథం ఆ బట్టలలోనూ, క్రాపులోనూ కన్పిస్తున్నాయి.

నిరూప్ తలవంచుకున్నాడు.

"ఏరా....డిటెక్టివ్‌లు బాగా చదువుతున్నావా?"

"అబ్బే లేదు. ఎప్పుడయినా."

"ఇంకేం చదువుతావ్ సెక్స్ బుక్సు కూడానా?"

"ఛీ....అదేం లేదు."

"నెలకెన్ని సినిమాలు చూస్తావ్?"

"రెండో, మూడో."

"నీ అభిమాన నటు డెవరు?"

"ఎవరూ లేరు."

తల వంచుకున్నాడు తిరిగి నిరూప్.

"మాటి మాటికీ తల వంచుకోవలసిన అవసరం లేదు. మనిషన్నవాడు తలెత్తుకొని బతకటం నేర్చుకోవాలి. అందుకు ప్రయత్నం చేయాలి. అంతేగాని తల దించుకోవటం ఎందుకు? తప్పు చేసినవాడే తల దించుకుంటాడు."

నిరూప్ తలెత్తి నవ్వటానికి ప్రయత్నించాడు.

"ఇప్పుడు చెప్పు. నీకు అభిమాన నటుడంటూ ఎవరూ లేరా? నన్ను నమ్మమంటావ్! నీ క్రాప్ చేసిన విధానం చెబుతుందిరా నువ్వెవరి అభిమానివో. అయినా ఈ కాలం కుర్రాళ్ళకి అంతకు మించి గమ్యం ఏముంటుంది? హీరోల సినిమాలకి దండలు వేయటం, కరపత్రాలు పంచడమేగాక....సరే జరిగిందేదో జరిగిపోయింది. ఈ రోజుతో నీ గతానికి చెందిన విషయాలవి....ఇప్పుడు చెప్పు, ఏం చేయాలనుకుంటున్నావ్?" అడిగాడు విక్రాంత్.

నిరూప్ తిరిగి తల వంచుకున్నాడు.

"ముందు నేర్చుకోవలసింది నీ భావాలు భయం లేకుండా చెప్పగలగటం."

"మీరు ఏది చెబితే అది" అన్నాడు మెల్లిగా.

"అంటే నీ కంటూ ఓ అభిప్రాయం ఉండదా?"

నిరూప్ మాట్లాడలేదు.

"సరే. కాలేజీలో చేరాలనుకుంటున్నావా?"

నిరూప్ మాట్లాడలేదు.

"వెల్ నేనే చెబుతాను. మనింట్లో అందరం మొదటి నుండీ కష్టపడుతున్నాం. మా నాన్న చదువుకోమంటే ఇలాగే తిరిగి చదువుకోలేదు. ఆ విధంగా తన జీవితం నాశనం చేసుకున్నాడు. ఈ రోజుకీ పొట్ట చేత్తో పట్టుకుని ఎక్కడికో వెళ్ళాల్సి వచ్చింది. నేను ఇంటర్ వరకయినా చదివాను. రాజాబాబాయికి ఆ అవకాశం రాలేదు. కానీ మేం శ్రమించి బ్రతకటానికి అలవాటుపడ్డాం. మా పిల్లల నుండి కూడా అదే ఆశిస్తాం —"

నిరూప్ తలెత్తి వింటున్నాడు.

కాబట్టి నిన్ను నేను కాలేజీలో చేర్పించి చదివిస్తానని నేను చెప్పడం లేదు. నీ అంతట నువ్వు, నీ శ్రమతో నువ్వు చదువుకోవాలి. అంటే నిన్ను ఏదో ఉద్యోగంలో పెడతాను. ఆ డబ్బులతో నీ భోజనం నువ్వు చేస్తావు. ప్రయివేట్‌గా గ్రాడ్యుయేషన్ పూర్తిచెయ్యి. ఆ తర్వాత ఏదయినా మంచి ఉద్యోగం వస్తే నువ్వు సెటిల్ అవుతావు. అంటే నీ భవిష్యత్‌ను రూపు దిద్దుకోవాల్సింది నువ్వే. నేను నీ వెనకాల ఉంటాను. సలహాలు ఇస్తాను. అంతే."

నిరూప్ తలూపాడు.

"తర్వాత విషయం. నేను క్రమశిక్షణ విషయంలో మహా కఠినంగా ఉంటాను. నువ్వు నా అన్నయ్య కొడుకువి కావచ్చు. కానీ నీ పద్ధతులు సాధ్యమైనంత త్వరలో మార్చుకోవాలి. పాత నిరూప్ స్థానంలో ఓ కొత్త వ్యక్తిగా రూపు దిద్దుకోవాలి.

"అంతే కాదు. నువ్వు ఎలాంటి పుస్తకాలయినా చదువు. నేను కాదనను. కానీ యంత్రంలా చదవకూడదు. అదే జీవితంగా ఉండకూడదు. దానికంటూ ఓ సమయం పెట్టుకోవాలి. అర్థమైందా?"

తలూపాడు నిరూప్.

"నువ్వు నా దగ్గిరుంటున్నావ్.... నావద్ద వుంటున్నావు కాబట్టి నువ్వు మారి మంచి వ్యక్తిగా మారతావని మీ నాన్న భావిస్తున్నాడు. ఆ నమ్మకాన్ని ఏం చేస్తావో చూడాలి."

నిరూప్ నవ్వాడు,

2

"నా మొదటి జీతం యిది పిన్నీ" అంటూ అందించాడు నిరూప్.

కవిత ఆ డబ్బు అందుకొంది. మొత్తం లెక్కపెట్టింది. డెభ్భై అయిదు రూపాయలు.

"చూశావా....నువ్వు సంపాదించావ్.... ఎంతనేది సమస్య కాదు. మీ బాబాయికి మొదటి జీతం ఇంతేనట. నువ్వు పనిలో జాగ్రత్తగా ఉండాలి. వాళ్ళ దగ్గిర పేరు తెచ్చుకోవాలి. అర్థమైందా?" అంది కవిత.

తలూపాడు నిరూప్.

"పిన్నీ ఈ డబ్బుతో నువ్వు చీర కొనుక్కో" అన్నాడు.

"చాలా సంతోషంరా....నాకు చాలా చీరలున్నాయి. నీకు చెప్పులు లేవు. బట్టలు లేవు. ముందు వెళ్ళి చెప్పులు కొనుక్కో. వచ్చే నెల డబ్బుతో బట్టలు తీసుకుందాం" అంది కవిత.

"అలానే పిన్ని ...మరే" అంటూ ఆగాడు.

"ఏమిటో చెప్పు"

"ఏం లేదు పిన్నీ....స్వీట్సు తెస్తాను" అన్నాడు.

"అలాగా! సరే తీసుకురా....ఓ అరకిలో చాలు. అంత కంటే ఎక్కువ తెస్తే మీ బాబాయి కోప్పడతారు" అంది కవిత డబ్బు అందిస్తూ.

నిరూప్ ఆనందంగా ముందుకు నడిచాడు.

నిరూప్‌ని ఉద్యోగంలో చేర్పించింది కవితే. వాళ్ళు ఉంటున్న పేటలోనే ఓ బట్టలషాపు ఉంది. దాన్ని నిర్వ హిస్తుంది కూడా స్త్రీనే. ఆమెపేరు రత్నమాల.

మొదట ఏవో కొన్ని చీరెలు తెచ్చి ఇన్‌స్టాల్‌మెంట్ బేసిస్‌లో అమ్మటం జరిగింది. ప్రధానంగా ఆమె ఖాతా దారులు ఉద్యోగస్థులే. వ్యాపారం క్రమక్రమంగా వృద్ధి చెందింది. రెండు షోకేసులు తయారు చేయిందామె. ఇప్పుడు హోల్‌సేల్‌గా బట్టల్ని కొనుక్కురావటం జరుగు తూంది.

ఇదివరకల్లా ఆమె ఒక్కర్తే మొత్తంవ్యాపారం చూసు కోవటం జరిగింది. ఇప్పుడు అప్పులేకాక క్యాష్‌సేల్స్‌కూడా ఆరంభమయ్యాయి. కాగా ఆమెకో సహాయకుడు అవసర మయ్యాడు.

మొదట్లో ఆమె ఓ ఆడమనిషిని పెట్టుకొంది. ఆమెకు నలభై సంవత్సరాలు పైబడ్డాయి. అంత చొరవగా పని చేయలేకపోతుంది.

రత్నమాలగారి షాపులో వ్యాపారం అన్నివేళలా ఉండదు. ఇప్పటికే ఆమె ఖాతాదారులంతా ఉద్యోగస్థులూ, మహిళలూ....వారంతా తీరిగ్గా సాయంత్రం వేళల్లో వస్తూ ఉంటారు. మిగతా సమయమంతా ఖాళీగా ఉంటుంది.

అందుకే కవిత ఓసారి చీరలకోసం వెళ్ళి నిరూప్ విషయం ప్రస్తావించింది. ముందు ఆమె సంశయించింది. రెండురోజులు పంపించండి చూస్తాను అంది.

నిరూప్ వెళ్ళాడు.

ఆ ముఖంలో కనిపించే అమాయకత్వం, లేతదనం ఆమెను ఆకర్షించాయి. ఆమె నిరూప్‌కు నెలకు నూటఏభై రూపాయలు ఇవ్వటానికి అంగీకరించింది.

నిరూప్ కార్యక్రమం బాకీలు వసూలుచేయటం, షాపులో ఉండటం.

విక్రాంత్‌కు ఇది బాగానే ఉందనిపించింది. రత్నమాల గారి వ్యాపారం పరిమిత వేళల్లో జరుగుతుంది. కాగా చదువుకోవటానికి బాగా అవకాశం ఉంది. ఆయన ఉద్దేశం ఎంత ఇస్తున్నారనికాదు. తను కష్టపడి స్వయంకృషితో పైకివచ్చాననే అనుభూతిని నిరూప్‌కు కలిగించాలని. శ్రమ యొక్క విలువను తెలియచెయ్యాలని.

మొదటి వదిహేను రోజులకిగాను జీతం అందుకున్నాడు నిరూప్....

చెప్పులు తొడుక్కొని షాపు బయటకు రాగానే జీవితంలో మొదటిసారిగా ఓ అద్భుతమైన అనుభూతి కలిగింది....ఎంతో ఉత్సాహంతో స్వీట్సు తెచ్చాడు....

"ఓరేయ్ తమ్ముడూ .... ఇలారండిరా" అంటూ స్వయంగా నోటికందించాడు.

"పిన్నీ బాబాయికి నువ్వు ఇవ్వు" అన్నాడు.

"నే నివ్వను. నువ్వే ఇవ్వు" అంది కవిత.

"అమ్మో నాకు భయం" అన్నాడు.

"ఏం మరో క్లాసు తీసుకుంటారనా" అంది నవ్వుతూ.

నిరూప్ కూడా నవ్వేశాడు.

రాత్రి పడుకునేటప్పుడు కవిత స్వీటు అందించింది.

"ఏమిటో విశేషం" అన్నాడు విక్రాంత్.

"ఏముంది. మీ అబ్బాయి తొలి జీతం ఈరోజే అందుకున్నాడు" చెప్పింది కవిత.

"వాడు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. ఏమయినా అన్నయ్య ఇంకా ఎక్కువకాలం పని చెయ్యలేడు. వీళ్ళు పైకొస్తే ఆయన కొంచెం విశ్రాంతి తీసుకోవచ్చు" అన్నాడు విక్రాంత్.

"అవును" అంది కవిత.

అయిదునెలలు గడిచిపోయాయి.

3

"ఈ వారంలో సినిమాకు వెళ్ళొచ్చు మీరు. ఎవరేం సినిమాకు వెళ్తారో నిర్ణయించుకోండి" అంది కవిత.

ఆరోజు ఆదివారం.

విక్రాంత్‌తో పాటు నిరూప్ కూడా ఇంటిదగ్గిరున్నాడు. ప్రతి పదిహేను రోజులకీ ఓ సినిమా మాత్రం చూడాలి. విక్రాంత్‌కు ఇద్దరు మొగపిల్లలు. అందులో పెద్దవాడు చిరంజీవి అభిమాని. రెండోవాడికి ఓ అభిమాన నటుడంటూ ఇంకా ఏర్పడలేదు. ఏదో ఒక సినిమాకి వెళ్తానంటాడు.

మధ్యాహ్నం పూట బయలుదేరేముందుకాక ఉదయమే నిర్ణయించుకోమంటుంది కవిత.

పిల్లలంతా హార్లిక్స్ తాగుతూ మెల్లగా మాట్లాడుకుం

టున్నారు.

అప్పుడు ఇంటిముందు సైకిల్ ఆగింది.

రత్నమాలగారి కుమారుడు హరీష్ కనపడ్డాడు. నిరూప్ లేచాడు. హరీష్‌వచ్చి ఏదో చెప్పాడు. నిరూప్ భృకుటి ముడిపడింది.

"ఇప్పుడే వస్తున్నా" అంటూ వచ్చి—లుంగీ మార్చి పాంట్ వేసుకున్నాడు.

"పిన్ని నన్ను ఆంటీ తీసుకురమ్మన్నారట. వెళ్ళొస్తాను" అన్నాడు.

"సర్లే. తొందరగా రా"

నిరూప్ హరీష్‌తో బయలుదేరాడు.

ఇంటిదగ్గిర కొంచెం హడావుడిగా వుంది. బయట పోలీస్ వ్యాన్ ఆగి వుంది.

నిరూప్ ఆశ్చర్యకరంగా చూస్తూ ముందుకు నడిచాడు.

రత్నమాలగారు మొదట్లో తన వ్యాపారం ఇంటిలోనే నిర్వహించటం జరిగేది. తర్వాత ప్రత్యేకంగా ఓ గదిని తీసుకొని షాపు మార్చిందామె. తమ ఇంటికి చాలా దగ్గిర్లోనే షాపుకూడా వుంది.

రత్నమాలగారి భర్త రవీంద్ర. ఆయన మంచి ఉద్యోగం చేస్తున్నారు. రత్నమాలగారు ఊరికే కూర్చోవటం ఇష్టంలేక ఈ వ్యాపారం ఆరంభించారు.

అనతి కాలంలో ఊహించని విధంగా అభివృద్ధి చెందింది.

నిరూప్ లోపలకు వెళ్ళాడు.

"ఎవరితను?" అన్నాడు ఎస్.ఐ.

"మా షాపులో పని చేస్తున్నాడు?"

"పేరు?"

"నిరూప్! విక్రాంత్‌గారని ఉన్నారు. వాళ్ళ అన్నయ్య గారబ్బాయి. మా దగ్గిర పనిచేస్తూ చదువుకుంటున్నాడు" చెప్పింది రత్నమాల.

"ఓహ్" అంటూ తల పంకించా డాయన. అప్పుడే కాఫీలు తాగినట్లున్నారు.

"ఇప్పుడు చెప్పండి, యేం జరిగిందో?" అన్నా డాయన.

"నిన్న మా యింటికి బంధువు లొచ్చారండి. మాకు దగ్గరే. వాళ్ళకు ట్రాన్స్‌ఫర్ అయింది. వేరే ఊరు వెళ్ళి పోతున్నారు. అందుకే రాత్రి రెండో ఆట సినిమాకు వెళ్ళాం. తిరిగి వచ్చేలోపు అంతా జరిగిపోయింది" అందామె.

"ఇంట్లో ఎవరెవరున్నారు?"

"ఇంట్లో మామూలుగా అయితే మా పిల్లలు ఇద్దరు పడుకుంటారు. బంధువులు రావటంతో ఫ్యాన్ లేదని వాళ్ళు షాపులో పడుకోవాలని వెళ్ళారు. ఇక మిగిలింది మా అత్తగారు మాత్రమే" అంది రత్నమాల.

"ఆవిడ్ని కొంచెం పిలుస్తారా?" అన్నా డాయన.

ఓ ముసలావిడ వచ్చింది.

"ఏమ్మా! ఏం జరిగిందో కాస్త చెబుతారా?"

"రాత్రి నేను బెడ్‌లైట్ మాత్రం ఉంచి పడుకున్నానండి! పదకొండు దాటుతోంది. అప్పుడు తలుపు చప్పుడు వినిపించింది. ఎవరో కొడుతున్నారు. అప్పుడే సినిమా నుండి వచ్చేశారా అనుకుంటూ లేచివెళ్ళాను. అయినా తలుపు తీసేముందు అడిగాను, 'ఎవరూ?' అంటూ.

'రవీంద్రగారు కావాలి' అన్నారు.

వెంటనే అబ్బాయికోసం ఎవరో వచ్చారనుకొని తలుపు తీశాను."

"లైటు వేయకుండానే తలుపు తీశారా?"

"అవునండి!"

"ఎందుకని?"

"బయట రోడ్డుమీద లైటుంది. ఆ వెలుగు సరిగ్గా మా ఇంట్లోకి పడుతుంటుంది. అందుకని మేం లైటు వేసుకోం" అంది రత్నమాల.

"తర్వాత ...."

"తలుపు తీశాను. బయట యెవరో నిలబడి వున్నారు."

"అతని మొఖం చూశారా?"

"సరిగ్గా చూడలేదండి! వెలుతురు అతని వీపుమీద పడుతుంది."

"అతని వయసు ఎంతుంటుంది?"

"ఎంతండీ. అంతా కలిసి ముప్పైలోపుగానే ఉంటుందేమో! వాడు యెంత చక్కగా 'రవీంద్రగారు లేరమ్మా?' అంటూ అడిగాడు. వాళ్ళ ఆఫీసువారెవరన్నా వచ్చారేమో అనుకున్నాను. లేరు బాబూ! సినిమాకు వెళ్ళారు. అన్నాను. 'అరే....ఇప్పుడెలా?' అన్నాడు. "ఏం పని బాబూ?" అన్నాను. 'ఆయన్తో వెంటనే మాట్లాడాలి మామ్మగారూ' అన్నాడు. అంతలోనే 'కొంచెం మంచి నీళ్ళిస్తారా మామ్మగారూ?' అన్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది. ఇందాకటి నుండి నిలబెట్టే మాట్లాడుతున్నానని. కనీసం మంచినీళ్ళు కావాలా అని కూడా అడగలేదు. వాళ్ళ ఆఫీసుకు చెందినవాళ్ళయితే ఏమన్నా అనుకుంటారేమోననిపించింది.

"లోపలకు రా బాబూ! అంటూ వెనక్కి తిరిగాను. లోనికి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెస్తుంటే యేదో శబ్దం వినబడింది. ఏమిటాని వచ్చాను.

వాడు తలుపు మూసి గడియ పెట్టాడు. ఇప్పుడు వాడితోపాటు ఇంకో మనిషి ఉన్నాడు. వాడి చేతిలో కత్తి తళతళ మెరుస్తూంది.

"అరిచావంటే చంపేస్తాం" అన్నారు.

బీరువా దగ్గిర కెళ్ళారు. అది మూసుంది. 'తాళం ఎక్కడ?' అన్నారు. అది టేబుల్‌మీదే వుంది. నేను చెప్పేలోగానే చూశారు. తలుపుతీసి ఆ లాకర్‌లో డబ్బులు నగలూ తీసుకున్నారు. నేను మాట రాకుండా చూస్తుండగానే నా దగ్గిర కొచ్చి "ఆ గొలుసు కూడా యివ్వు" అన్నారు.

మాట్లాకుండా తీసిచ్చాను. వెళ్తూ కత్తి మెడమీద పెట్టి అన్నాడు. 'మేం బయటకు వెళ్ళాక అరవాలని ప్రయత్నించినా, ఎవరికైనా చెప్పినా మీ అబ్బాయిని చంపేస్తాం జాగ్రత్త' అని వాళ్ళు తలుపులు తోసుకొని వెళ్ళిపోయారు" అంది ఆ సంఘటన గుర్తుకు తెచ్చుకుంటూ.

"మేం వచ్చేటప్పటికి బయట గడియ పెట్టుంది. ఏం జరిగిందో మాకు అర్థంకాలేదు. బయటికి వెళ్తే తాళం వెయ్యాలి. అయినా ఈ అర్ధరాత్రి ఎక్కడకు వెళ్తుంది అనుకుంటూ తలుపు తీశాం. గది నడుమ షాక్‌తో కూలబడి వుంది అమ్మ....పావుగంట తర్వాత గానీ మాట్లాడలేదు" అన్నాడు రవీంద్ర.

"మొత్తం ఏ మాత్రం పోయింది?"

"క్యాష్ సుమారు పదివేలు. బంగారం పదిహేను సవర్లుదాకా ఉంటుంది."

"అంత క్యాష్ ఇంట్లో ఉంచుతారా?"

"మామూలుగా ఎప్పుడూ ఉంచం. అందులోనూ ఇది నెలలో మొదటివారం కదా! బాకీలు వసూలవుతాయి. మిగతా రోజుల్లో అయితే ఎప్పటికప్పుడూ బాకీలు కట్టడమో సాయంకాలం బ్యాంక్‌కు పంపించటమో చేస్తాం. నిన్న శనివారం అయింది. బాగా వసూలు అయింది. అందుకని ఇంట్లోనే ఉంచాల్సి వచ్చింది."

"మీ కెవరిమీదయినా అనుమానంగా ఉందా."

"ఆలోచిస్తుంటే అనుమానించదగిన వారెవరూ కనిపించటంలేదు. మామూలుగా దొంగలు వచ్చి దోచుకు వెళ్ళటం జరుగుతుందే అనుకోండి. నా పేరు చెప్పి రావటంతో అనుమానించాల్సి వచ్చింది. ఎవరో ప్లాన్‌తో చేశారిది. అయితే యెవరు చేశారనేది నేను చెప్పలేకపోతున్నాను" అన్నాడు రవీంద్ర.

"అన్నట్లు మీ అమ్మగారు ఆ మనుషుల్ని గుర్తుపట్టగలదా ఇప్పుడు చూస్తే?" అన్నాడాయన.

"ఏమో బాబు....చూస్తేగాని చెప్పలేం."

"వాళ్ళని ఎప్పుడైనా చూసిన గుర్తుందా?"

"లేదు బాబూ" అందామె.

"మా అమ్మకూడా యెప్పుడూ ఇక్కడ ఉండదండి. నెలకో రెండు నెలలకో తిరిగి కొంతకాలం మా బ్రదర్స్ దగ్గరికి వెళుతుంటుంది" అన్నాడు రవీంద్ర.

"ఇట్సాల్‌రైట్ మిష్టర్ రవీంద్రా మేం....వెళ్తాం. ఈ విషయంలో దొంగల్ని పట్టుకొనే ప్రయత్నం చేస్తాను" అన్నాడాయన.

ఆయన, రవీంద్రకు బాగా తెలిసిన వ్యక్తి. అంతా బయటకొచ్చారు. అప్పటికే ఈ వార్త ఆ ప్రాంతంలో

తెలిసి ఉండటంతో అందరూ కుతూహలంగా చూస్తున్నారు. యస్.ఐ. ఒక్కసారి ఆ ప్రాంతాలన్నింటినీ పరిశీలించి చూశాడు.

జీపు కదిలింది.

'బ్రౌనీ' పరిగెత్తుకుంటూ వచ్చింది....

"భౌ..భౌ.." మంటూ అరుస్తూ.

"నోర్మూయ్యవే తల్లీ నిన్ను అరెస్టు చెయ్యగలరు?" అన్నాడు నిరూప్ మెల్లగా.

జీప్ వెళ్ళిపోయింది.

రత్నమాలగారిని పరామర్శించటానికి ఒక్కొక్కరే వచ్చారు. తలోమాట అన్నారు.

"పది సంవత్సరాలుగా ఇలాంటివి మేం ఎరగం!"

"అయినా అంత క్యాష్ ఇంట్లో ఎలా ఉంచారండీ?"

"ఏమయినా జాగ్రత్తగా ఉండాలి."

"ఏక్షణం ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు. ఇంకా నయం ఆ ముసలమ్మను ప్రాణాల్తో వదిలిపెట్టారు. అంతవరకూ సంతోషించాల్సిందే."

"రత్నమాలగారూ .... మీ వ్యాపారంచూసి ఎవరికో కన్ను కుట్టుంటుంది. ఓ ఆడది ఇంత వ్యాపారం చేస్తుం దంటే మొగాళ్ళకేకాదు—ఆడాళ్ళూ ఏడ్చి ఛస్తారు."

4

రత్నమాలగారు ....ఈ దొంగతనంతో దిగ్భ్రాంతి చెందిన మాట వాస్తవమే. అయితే ఆమె బెంబేలుపడి కూర్చోలేదు. మరుసటిరోజు మామూలుగానే షాపు తెరిచింది. అదే చిరునవ్వుతో కస్టమర్లని ఆహ్వానించింది.

నిరూప్ మాత్రం ఈ సంఘటన జరిగిం తర్వాత అనేక రకాలుగా ఆలోచించాడు. ముందుగా పిన్నితోనే

చర్చించాడు.

"పిన్నీ జరిగిందంతా చూస్తుంటే ఈ దొంగతనం వెనక తెలిసినవారి హస్తాలున్నాయి. ఎక్కడో మెలిక ఉంది. అది గనక కనుక్కోగలిగితే కేసు క్షణాల్లో తేలి పోతుంది" అన్నాడు.

కవితకూడా అపరాధ పరిశోధన సాహిత్యం చదువు తుంది.

"ఏంరా..అచ్చంగా డిటెక్టివ్‌లా మాట్లాడుతున్నావ్" అంది.

"నిజం పిన్నీ..నాకయితే ఈ దొంగతనం చేసిందెవరో తెలుసుకోగలం అనిపిస్తూంది."

"మరింకేం పరిశోధన ఆరంభించు. మీ నాన్నేమో డిటెక్టివ్ పుస్తకాలు చదవి చెడిపోయాడని రాస్తున్నాడు. నువ్వేమో పరిశోధన అంటున్నావు."

"ఆయనంతేలే పిన్నీ. నేను చెడిపోతే చెడిపోయా నేమోగాని..పుస్తకాలు చదివి కాదు. అయినా బాబాయి ఏం చెప్పారు. ఏ న్నే పుస్తకమైనా చదవమన్నారు. ఈ రోజునుండి ఈ విషయంలో నా పరిశోధన ఆరంభిస్తాను" అన్నాడు నిరూప్.

"మరి చదువో?"

"దేని దారి దానిదే పిన్నీ..పనిని విభజించటం నేర్చు కున్నాను కదా" అన్నాడు నిరూప్.

"పోలీసులున్నారు కదా.." అంది కవిత.

"పోలీసుల్తో కేసులు పరిష్కరించబడటమా" అంటూ నవ్వాడు నిరూప్.

"పిన్నీ వాళ్ళు ఎలాంటి కేసులు పరిష్కరిస్తారో నీకు తెలుసా? దొంగతనం జరిగిందనుకో. వాళ్ళ లిస్టులో ఉన్న

నలుగురిని తెచ్చి ముందు జైల్లో తోస్తారు. ఆ కేసు విలిచే దాకా నమ్మకం ఏముంటుంది? దొంగతనంగానీ, హత్య గానీ మనవాళ్ళు దొకచే పద్ధతి. లాఠీలు వినియోగించు కోవటం. వీలయితే రెండుపక్కలనుండి భోంచేయటం. ఆ డిపార్టుమెంట్ లో కొంతమంది మహానుభావులున్నారు. అప్పుడప్పుడూ వాళ్ళే గొప్పగా డిటెక్ట్ చేస్తారు. అసలింకో జోక్ చెప్పనా పిన్నీ..''

“ఏమిటి?''

“బ్రౌనీ లేదూ..రత్నమాలగారి కుక్కపిల్ల..అది పోలీసుల్ని చూసి అరిచింది.''

కవిత బిగ్గరగా నవ్వింది.

“నేను షాపుకెళుతున్నాను'' అన్నాడు నిరూప్.

5

జనం అంతా ముక్కుమీద వేలేసుకున్నారు.

రత్నమాలగారింట్లో మరో దొంగతనం జరిగిపోయింది.

ఈసారి ఎవరూ కత్తులు చూపించి బెదిరించి తీసుకోలేదు. ఈ సారి కూడా రత్నమాలగారింటికి బంధువులొచ్చారు. వాళ్ళు పట్టుచీరలు కట్టుకొని ఏదో ఫంక్షన్ కి వెళ్ళి వచ్చారు. ఆ తర్వాత వాటిని గుంజి బయట ఆరేశారు.

మధ్యాహ్నం చూస్తే అవి అదృశ్యమయ్యాయి!

మొత్తం నాలుగువేలు విలువగలవి.

“ఈ కొంపకేదో శని పట్టుకుంది'' అంది రవీంద్ర తల్లి.

“ఇంక ఇక్కడ వుండటం అనవసరం. మనం వేరే ఇల్లు చూసుకుందాం'' అన్నాడు రవీంద్ర.

రత్నమాల కూడా అందుకు అంగీకరించింది. ఓ విధంగా ఆమె ఈ రెండు అనుభవాల్తో షాక్ అయింది. అది ఆమె మొఖంలో ప్రతిబింబించక పోయినా, ఆమె వెంటనే మరో ఇల్లుకోసం అన్వేషణ ఆరంభించటంతో నిరూప్ అర్థంచేసుకున్నాడు.

"ఈ ఇల్లుమనకు కలిసి రాలేదు నిరూప్" అందామె.

నిరూప్కు ఆశ్చర్యం కలిగింది. మనుషులు ఎంత త్వరగా భావాలు మార్చుకుంటారు! ఇదే ఇంటిలో సర దాగా వ్యాపారం ఆరంభించి ఈ స్థాయికి ఎదగటం జరి గింది. అయితే ఈ రెండు సంఘటనల్లో నేరం ఎవరు చేసినా అందులో తమ పాత్రను గుర్తించటంలేదు. మొదట దొంగతనం సంగతి అలా వదిలేస్తే రెండోసారి జరిగిన దొంగతనం కేవలం ఏమాత్రం జాగ్రత్తగా ఉండకపోవటమే.

అంత ఖరీదయిన చీరల్ని బయట ఆరేసి వాటిని గురించి పట్టించుకోక పోవటం మొదటి తప్పు. కాగా ఈ దొంగతనం ఎవరుచేసినా ఆశ్చర్యంలేదు. రోడ్డుమీద వెళు తున్నవారుగానీ, లేదా ఏమైనా వస్తువులు అమ్మటానికి వచ్చిన వారికిగాని అలా వదిలేసిన వాటిని తీసుకువెళ్ళటం సులభం.

రెండో తప్పు. వ్యాపారం గురించిన ఆలోచనలకు ప్రధమ స్థానం ఇవ్వటం. మిగతా విషయాల గురించి సీరియస్గా పట్టించుకోకపోవటం.ఈ విషయాన్ని కొంచెం జాగ్రత్తగా గమనించేవారికెవరికైనా అర్థం అవుతుంది.

కాగా రేపు మారే చోటయినా ఇంతే. అజాగ్రత్తగా ఉంటే తిరిగి అక్కడ ఈ విధమైన దొంగతనాలు పునరా వృతం అయినా ఆశ్చర్యంలేదు. చాలా దొంగతనాల్లో

మన అజాగ్రత్తనూ, ఆరాటాల్ని సొమ్ము చేసుకోవటమే వుంటుంది.

ఒక్కో మహాతల్లి సినిమా చూడాలనే ఆదుర్దాలో ఈ ప్రపంచాన్నే మరిచిపోతుంది.... మరో మహిళ పక్కింటి టి. వి. కెప్పుడు వెళ్ళాలా అనే ఆరాటంలో తన కొంప గురించి మాత్రమే మతిమరుపుకు లోనవుతుంది.

ఫలితం జీవితంలో కోలుకోలేని దెబ్బ!

నిరూప్‌కి ఇలాంటి అనుభవాలు కొన్ని తెలుసు. ఐనా అతను మాట్లాడలేదు.

సాయంకాలం అయింది.

హరీష్ బ్రౌనీని తీసుకొచ్చాడు.

"హాయ్ బ్రౌనీ....ఆజావ్" అంటూ పిలిచాడు నిరూప్.

బ్రౌనీ ఎంతో అందంగా ఉండి ముద్దొస్తుంటుంది.

"ఈ బ్రౌనీకి ఈ మధ్య బద్ధకం పెరిగింది" అన్నాడు హరీష్.

"ఏం చేస్తుందేమిటి?"

"ఏముంది పోలీసుల్ని చూస్తే అరుస్తుంది. దొంగలు వచ్చినప్పుడు మాత్రం అరవదు" అన్నాడు.

నిరూప్ బ్రౌనీ తలమీద చిన్నగా కొట్టాడు.

కుయ్ మంది చిరుకోపంగా.

"కోపం మాత్రం బాగా ఉంది. దొడ్లోంచి పట్టుచీరలు తీసుకెళుతున్నా అరవదు. అసలిది దొంగలతో కొల్యూడ్ అయింది. తిండి దండగ" అన్నాడు హరీష్.

నిరూప్ నవ్వాడు.

"నేను ఎగతాళి కనటం లేదు నిరూప్....దొంగలు వచ్చిన రోజు కూడా అరవలేదు" అన్నాడు హరీష్.

ఆ తర్వాత ఎవరో బట్టల కోసం రావటంతో విరూప్ పనిలో పడ్డాడు.

ఇంటికి వెళ్ళాక స్నానం చేస్తూంటే అకస్మాత్తుగా గుర్తొచ్చింది.

"దొంగలు వచ్చిన రోజు కూడా అరవలేదు."

"హుర్రే" అరిచాడు.

"ఏంట్రా....అరుస్తున్నావ్?" అంది కవిత.

"పిన్నీ! క్లూ దొరికింది" అన్నాడు ఉత్సాహంగా.

"ముందయితే స్నానం చేసి రా" అంది.

స్నానం చేసి వచ్చి కూర్చున్నాడు.

"పిన్నీ మొన్నో జోక్ చెప్పాను కదా....బ్రౌనీ పోలీసుల్ని చూసి అరిచిందని....ఇప్పుడో తాజావార్త. దొంగలు పడిన రోజు మాత్రం అది అరవలేదట."

"అయితే."

"అయితే ఏమిటి! ఈ దొంగతనం చేసింది తెలిసిన వ్యక్తులేనని స్పష్టమయింది కదా."

"అది ముందే అనుకున్నాం కదా."

"జనరల్‌గా అనుకున్నాం. కానీ ఇప్పుడు బ్రౌనీ అరవలేదంటే ఆ దొంగల్లో ఎవరో ఒకరు బ్రౌనీకి తెలిసుండాలి, అందుకే అది అరిచి ఉండదు."

"కానీ ఆ వ్యక్తులెవరో తెలియదని ముసలమ్మ చెప్పిందిగా."

"ఆవిడకు వాళ్ళు తెలిసి ఉండకపోవచ్చు" అన్నాడు.

"ఈ వాదన సరిగ్గా లేదు. ఆవిడకు తెలియకపోతే పోవచ్చు. ఆ ఇంట్లో ఆమె ఒక్కతే ఉందని ఎలా అనుకుంటారు? తెలిసిన వ్యక్తే అయితే ఆ ఇంట్లో హరీష్ గానీ అతని తమ్ముడు గానీ ఉంటే గుర్తు పట్టవచ్చుగా."

"అది కాదు పిన్నీ, ఇదంతా ప్రీప్లాన్డు. హరీష్ వాళ్ళు షాపులో పడుకోవటం ముందే గమనించారు. అలాగే ఆంటీవాళ్ళు సినిమాకు వెళ్ళటాన్ని కూడా గమనించారు. అప్పుడు వాళ్ళు బయలుదేరి రావటం జరిగింది."

"అయితే హరీష్ వాళ్ళు ఇంటివద్ద పడుకుంటే వాళ్ళు వచ్చేవారు కాదంటావా?" అంది కవిత.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు.

"నీ రీజనింగ్ సరిగ్గా లేదు. సరిగ్గా ముసలమ్మ ఒక్కత్తే ఉండే రోజు కోసం వాళ్ళు ఎదురు చూడటం లేదు. నా అంచనా ప్రకారం అయితే హరీష్ వాళ్ళేకాదు. రత్నమాలగారు ఉన్నా ఆ రిస్క్ తీసుకునేవాళ్ళే. అసలు ఆ రోజు దొంగతనం చేయడానికి కారణం క్యాష్. అది ఉందని తెలియటంతోనే అందుకు తెగించారు. ఆ సమయంలో యింట్లో ఎవరూ లేకపోవటం వారికి మరింత సహకరించింది. కాబట్టి కుక్క ఎందుకు అరవలేదు? ఇందులో ఉంది గుట్టంతా. ముందు అది పరిశోధించు" నవ్వుతూ అంది కవిత.

"సో....ఈ కేసంతా ఇప్పుడు బ్రౌనీ చుట్టూ తిరుగుతుందన్న మాట. అయినా పిన్నీ ఇంత బాగా చెప్పగలుగుతున్నావు కదా....మరి ఈ తరహా పుస్తకాలు చదవటమే నీలో యింత లాజిక్‌కు కారణం కదా! మరి ఈ పుస్తకాలు చదివితే చెడిపోతారని తిడతా రెందుకు?" అన్నాడు నిరూప్.

"దానికి కూడా రీజనింగ్ ఉందిరా....ఉదాహరణకు ఈ దొంగతనం చేసినవాళ్ళు కూడా ఈ ప్రేరణతోనే చేసి ఉండొచ్చు. అంటే ఈ పుస్తకాలు వారిలో లాజిక్‌ను పెంపొందించక ప్రొవోక్ చేశాయి. అంటే ఒకే సాహి

త్యానికి రెండు పార్శ్వాలున్నాయన్న మాట. రెండు రకాల ప్రభావా లుంటాయి. కొంతమంది ఒక కోణాన్ని చూసి ఈ మాట అంటారు. అందుకేగా మీ బాబాయి విన్నే పుస్తకం చదివినా ఫర్వాలేదు అన్నారు. ఆయన చెప్పవల సిందింకోటుంది. అది నువ్వు ఆ పుస్తకాల్ని మూర్ఖంగా అనుకరించనంతవరకూ: అంటే అందులోని పాజిటివ్ అంశాల్ని మాత్రం మనం గ్రహించాలి."

"గుడ్ రీజనింగ్ పిన్నీ. ఇప్పుడు నాకు ఇంకా బాగా అర్థమయింది. నేను ఈ సాహిత్యం చదువుతున్నప్పుడు నాకు దొంగతనాలు ఎలా చేయాలా అనిపించటం లేదు. సత్యాన్ని ఎలా కనుక్కోవాలా అనే ఆరాటం కలుగు తుంది. కాగా బ్రౌనీ ఎందుకు అరవలేదనే విషయాన్ని రెండు రోజుల్లో కనుక్కుంటాను" అన్నాడు నిరూప్.

"అది సరే. అసలు పని చేస్తున్నావా? లేక పరిశోధన అంటూ కూర్చున్నావా!"

"పని చేస్తున్నాను పిన్నీ. అయినా అందరినీ పరిశీ లిస్తున్నాను. కొంతమంది రోజుకు ఎంత అమ్ముతారు? ఎంత లాభం వస్తుంది? అంటూ ప్రశ్నిస్తుంటారు. అలాంటివారిని ఓ కంట గమనిస్తున్నాను."

"జాగ్రత్తరో ఎవర్నన్నా ఏమన్నా అడిగేవు. ఒకటి మాత్రం గుర్తుంచుకో. దేనికయినా ఋజువు లుండాలి. అప్పుడే మనం ఏదయినా చేయటానికి అవకాశం ఉంటుంది. లేకపోతే గొడవలయిపోతాయి" అంది కవిత.

ఆ రోజు రాత్రి ఈ విషయం మొత్తం విక్రాంత్‌కు వివరించింది. తీవ్రంగా ఆలోచించాక అన్నాడు విక్రాంత్:

"ఈ దొంగతనంలో ఎంతమంది ఉన్నారంటావు?"

"ఇద్దరు."

"కాదు ముగ్గురు" అన్నాడు.

"ఎలా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ మూడో వ్యక్తి బ్రౌనీకి తెలిసి ఉంటాడు" అన్నాడు విక్రాంత్.

కవిత ఆశ్చర్యంగా చూసింది.

"ఇందులో విశేషం ఏమీ లేదు. ఆ ఇంటికి చెందిన అన్ని వివరాలు సంపాదించింది స్థానికంగా వున్న వ్యక్తి. అతను చాలా కాలంనుండి వీళ్ళను గమనిస్తూ ఉండొచ్చు. అన్నీ సిద్ధమయినాక దొంగతనానికి పూనుకున్నారు. ముందు ఒక వ్యక్తి కనిపించాడు. తర్వాత ఇద్దరయారు, అతను బయట నిలబడి ఉంటాడు. బ్రౌనీకే కాదు బయట నుండి ఎవరయినా చూసినా అనుమానం కలగదు. ఇంకో విశేషం కూడా వుంది."

"ఏమిటది?"

"ఓవేళ వాళ్ళ ప్లాన్ బెడిసికొట్టిందనుకోండి. ఇంట్లో బిగ్గరగా కేకలువేస్తే బయటనుండి తను వాళ్ళను సేవ్ చేస్తాడు."

"అదెలా?"

"ఎలా ఏముంది? తానుకూడా కేకలు విని వచ్చినట్లు చెబుతాడు. వాళ్ళను పట్టుకోబోయినట్లు చెస్తాడు. వాళ్ళ కత్తి చూపించి పారిపోతారు."

"విచిత్రంగా ఉందే."

"విచిత్రం ఏముంది. వెధవ తెలివితేటలు. అయితే వాళ్ళు ఆలశ్యంగానైనా ఓ విషయం గుర్తిస్తారు."

"ఏమిటది?"

"నేరం దాగదు."

6

నిరూప్ జరిగిన సంఘటలను మనసులోకి తెచ్చు కున్నాడు. శనివారం సాయంకాలం రత్నమాలగారు డబ్బు లెక్కపెడుతున్నారు. తలుపులు తీసివున్నాయి. అంతా అయ్యాక వాటిని ఓ బ్యాగ్‌లో వుంచి బీరువాలో పెట్టారు.

అప్పుడు షాపులో కస్టమర్స్ ఎవరూ లేరు.

నిరూప్ బయటకొచ్చి నిలబడ్డాడు.

ఎదురుగా మేడమీద ఓ యువకుడు షాపుకేసి చూస్తూ న్నాడు.

నిరూప్ అతనికేసి చూశాడు.

అతను వెంటనే వెనక్కి వెళ్ళిపోయాడు.

మేడమీద నుండి గమనిస్తే షాపులో ఏం జరుగుతుందో స్పష్టంగా గమనించవచ్చు.

అయితే ఆ యువకుడికి ఈ అవకాశం ఉందా?

షాపు కెదురుగా భవంతి ఖరీదైనది. లోపల అలంకర ణను గమనిస్తే అద్భుతమనిపిస్తుంది. ఓసారి నిరూప్ లోపలకు కూడా వెళ్ళాడు.

కాగా ఆ ఇంట్లోని వ్యక్తికి ఈ పనిచేసే అవకాశం ఉందా? తను అనవసరంగా అనుమానిస్తున్నాడేమో అను కున్నాడు.

అంతలోనే తిరిగి ఏం? ఎందుకు చేసి ఉండకూడదు? అనే భావం కలిగింది.

ఏది ఏమయినా ఈ విషయం పిన్నికి కూడా చెప్ప కూడదు. ముందు తనంటూ ఓ నిర్ణయానికి రావాలి అను కున్నాడు.

అప్పటినుండి ఆ యువకుడ్ని నిశితంగా పరిశీలించటం ఆరంభించాడు.

అతని పేరు జైరామ్.

జైరామ్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు. ప్రస్తుతం రెండో సంవత్సరం. అతని వేషధారణగానీ, అనుసరించే పద్ధతులు గానీ మరీ ఆధునికంగా ఉన్నాయి.

వాళ్ళ ఇంటిలో ఓ విధానం ఉంది. జైరామ్ తండ్రి నెలనెలా పాకెట్ మనీ అందిస్తాడు. పిల్లలంతా అందులోనే తమ అవసరాలు తీర్చుకోవాలి. అంతకు మించి ఏమాత్రం ఇవ్వడు.

జైరామ్ నిర్వహణకు వాళ్ళ తండ్రి ఇచ్చే డబ్బు ఏ మాత్రం చాలదు!

అయినా అతను జల్సాగా గడుపుతున్నాడు.

జైరామ్ కాలేజీలో కొంతమందిని కలిసి గ్రూప్ ఆరా తీశాడు. అయితే ఎవరికీ అనుమానం కలగని రీతిలో.

ఆ కాలేజీ ఎన్నికల్లో జైరామ్ ప్రధాన పాత్ర వహిస్తూ వుంటాడు. ముఖ్యంగా కాలేజీ ఎన్నికలప్పుడు సాధారణ ఎన్నికల స్థాయిలో ఖర్చులవుతాయి. మరి అలాంటివన్నీ ఎలా వస్తున్నాయో అర్థం కావటంలేదు!

ఇంకా ఆ కాలేజీలో రెండు గ్రూపులున్నాయి. అవన్నీ కులాల పేరుతో విభజించబడినట్లే పైకి కన్పిస్తాయి. అయితే వాటికి నాయకత్వం వహిస్తుంది మాత్రం కొద్ది మంది వ్యక్తులు. వారిలో కొందరి ఆర్థిక పరిస్థితి బాగుంది. తమ చుట్టూ కొంతమందిని తిప్పుకోవటం కోసం వారంతా విచ్చలవిడిగా డబ్బు ఖర్చుచేస్తుంటారు. వాళ్ళ చుట్టూ తిరిగే వ్యక్తులు కూడా తమకు డబ్బులు ఖర్చుపెట్టినంత కాలమే ఉంటారు. కాగా అలాంటి వ్యక్తుల్లో జైరామ్ ఒకడు.

ఈ వివరాలన్నీ ఓ కాయితం మీద రాసుకున్నాడు.

అతని వ్యక్తిగత జీవితానికి చెందిన వివరాలు మరికొన్ని.

జైరామ్ తన స్నేహితులతో 'బ్లూఫిలిమ్' చూస్తూంటాడు. తన స్నేహితుడికో కలర్ టీ.వీ. ఉంది. అద్దెకు తెచ్చి ప్రత్యేకంగా ఈ సినిమాల్ని చూస్తుంటారు.

జైరామ్ బ్లూఫిలిమ్స్‌తోనే ఆగలేదు. అతనికి 'స్త్రీ' సాంగత్యం ఉంది. అతను అప్పుడప్పుడూ వ్యభిచరిస్తూ వుంటాడు.

ఇంకా అతను కొన్ని క్లబ్స్‌కు హాజరవుతుంటాడు. అక్కడ జరిగే పేకాటలో మిత్రులతో పాటు హాజరవుతూ వుంటాడు. పెద్ద పెద్ద స్టేక్స్ ఆడతాడు. అయితే క్లబ్స్‌కు వెళ్ళేది మాత్రం ఈ ఊర్లోకాదు.

చివరిగా జైరామ్ గురించిన ఈ విషయాలేవీ అతని తండ్రికి తెలియవు. పైపెచ్చు అతను ఈ విషయాలమీద అంతగా దృష్టి సారించడు. ఆయన కెప్పుడూ తన వ్యాపార వ్యవహారాల్తోటే సరిపోతుంది.

తన ఇంట్లో తనపిల్లలందరికీ ఆయన స్వేచ్ఛ ఇచ్చాడు. ఒక్క డబ్బు విషయంలో మాత్రమే ఆయన కఠినంగా ఉంటాడు. మిగతా విషయాల్లో అంతగా పట్టించుకోడు.

అంతేకాదు—ఆ ఇంట్లో ఎవరి కార్యక్రమం వారిది. ఎవరి విధానాలు వారివి.

జైరామ్‌కు చెందిన చరిత్ర ఇది.

కాగా నిరూప్‌కు జైరామ్‌మీద అనుమానం బలపడింది. ఈ దొంగతనం వెనుక అతను ఉన్నాడని అతని మనసు చెబుతూంది. అయితే నిరూపించటం ఎలా? అందులోనూ డబ్బున్న వారితో వ్యవహారం. ఏమాత్రం తేడా వచ్చినా అంతే. తనతోపాటు తన కుటుంబం అంతా ఆ ఫలితం

అనుభవించాల్సుంటుంది. కానీ మరెలా!

అన్నీ తెలిసి ఊరుకోవటమేనా? ఏం చేయాలి?

నిరూప్ మధనపడుతున్నాడు.

చివరిగా ఓ నిర్ణయానికొచ్చాడు.

అప్పుడు హృదయం తేలికపడినట్లయింది.

7

రవీంద్ర ఆశ్చర్యంగా వింటున్నాడు.

....ఇలా జరుగుంటుందని నా అనుమానం అంకుల్. అయితే యీ విషయం మనం ఎలా ప్రూఫ్ చేయటం? మనం ఊరుకోవటానికైనా దాదాపు ముప్పైవేలకు పైబడి పోయాయి. అయినా ఈ విషయంలో మనం యిలానే ఉంటే వాళ్ళకి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మరోటి మరోటి చేస్తారు" అన్నాడు నిరూప్.

తన ముందు సొంతం ఇరవై సంవత్సరాలు కూడా నిండని ఓ పిల్లవాడు ఇంత వివరంగా చెబుతుంటే ఆశ్చర్యం కలిగింది రవీంద్రకు. అంతేకాదు అతనిలోని షార్ప్‌నెస్‌కు ముచ్చటవేసింది.

"అంకుల్! ఎస్.ఐ. గారు మీ స్నేహితులే కదా. సీక్రెట్‌గా ఆయన్ని విచారించమని చెప్పండి. ఈ విషయం తేలేలోగా ఆంటీకి కూడా చెప్పొద్దు. ఏమంటారు?"

"నువ్వు చెప్పేది బాగానే ఉంది. అలానే చేద్దాం. ఇది నిజం అయినా కాకపోయినా నీ ఆలోచనా ధోరణి సరిగానే వుంది. అదిసరే నువ్వసలు నీ క్లాసు పుస్తకాలు చదువుతుంటావా?"

"ఎందుకు చదువను అంకుల్. లేకపోతే మా బాబాయి ఊరుకోడు. ఆయనెప్పుడూ నేనేం చేస్తుంటానో గమని

స్తూనే ఉంటారు."

"అవునూ మీ బాబాయి ఏం చేస్తారు?"

"కార్పొరేషన్‌లో క్లర్కుగా చేస్తున్నారు అంకుల్!"

"మొత్తంమీద ఆయన పద్ధతి బాగుందయ్యా! ఏమైనా పిల్లలమీద అబ్జర్వేషన్ ఉండాలి. నేను కూడా పిల్లల మీద పూర్తి కాన్‌సంట్రేషన్ చేయలేకపోతున్నాను. ఈ రోజు ప్రపంచంలో జరుగుతున్న వార్తలు వింటుంటే యెంత ఆశ్చర్యం కలుగుతుంది. నేర ప్రపంచంలోకి యువతరం అంతకంతకూ ఊద్వేబడుతుంది" అని "అయినా మన దేశంలో కూడా ఇలానే జరుగుతుంది. దారికాచి దోచుకున్న కేసుల్లో మూడింట రెండు వంతులు యువకులే. వాళ్ళు మాత్రం ఏం చేస్తారు. వాళ్ళకు చేయటానికి ఉద్యోగాలు లేవు ఇక్కడ" అన్నారాయన సాలోచనగా.

"ఏమైనా యివి అరాచక పద్ధతులు. సభ్యసమాజం వీటిని ఆమోదించదు. నేను నా ఫ్రెండ్‌తో మాట్లాడుతాను. ఒకసారి డబ్బు పోయాక తిరిగిరావటం అసంభవము. అయినా ఓ బాధ్యత గల పౌరుడిగా మాత్రమే యీ విషయంలో నాకు ఆసక్తి ఉంది" అన్నాడాయన.

రవీంద్రగారు కూడా యెక్కువగా తన బాధ్యతల్తో సతమతమౌతూ ఉంటారు. ఆయన ఉద్యోగానికి చెంది యెక్కువ టూర్స్ ఉంటాయి. తీరిక సమయాల్లో కూడా ఆయన షాపు విషయాలు పట్టించుకోడు. పూర్తి బాధ్యతల్ని రత్నమాలగారిమీద వదిలేశాడాయన.

తాను మాత్రం తన ప్రపంచంలో ఉంటాడు. ఆయనకో బ్రహ్మాండమైన లైబ్రరీ ఉంది. ఎప్పుడూ చదవటంలోనే ఆయన నిమగ్నమై ఉంటాడు.

"సర్లే బాబూ....నువ్వు బాగా చదువుకో. మా పిల్లల కోసమని యెంతో ఖరీదుపెట్టి బుక్స్ కొంటుంటాము. వాళ్ళ కెవరికీ ఇంట్రెస్టు ఉన్నట్లుగా కనిపించటంలేదు. నీకేమైనా ఆసక్తి వుంటే మంచి పుస్తకా లున్నాయి. తీసుకెళ్ళి చదువుకోవచ్చు."

"థాంక్స్ అంకుల్!" అన్నాడు నిరూప్.

రవీంద్ర వెంటనే తన మిత్రుడ్ని కలిసాడు. అంత వరకూ కేసు ఏం కదల్లేదు.

"ఏం లేదు. మా యింట్లో దొంగతనం గురించి కొన్ని అనుమానాలు కలుగుతున్నాయి. వాటిని నీకు చెప్పాలని-" ఆగాడు రవీంద్ర.

"చెప్పు" కుతూహలంగా అన్నాడు ఎస్.ఐ.

రవీంద్ర మొత్తం విషయాల్ని ఓ క్రమంలో చెప్పాడు.

"ఆలోచించదగిన విధంగానే ఉంది"

"ఇదేదో ఆ కుర్రాడ్ని తెచ్చి బెదిరించేసే వ్యవహారం కాదు. డబ్బున్నవారితో వ్యవహారం. అంతగా అయితే ఓ లక్ష నామీద డేమేజ్‌సూట్ వేయగలడాయన. అందుకే నువ్వు యీ విషయంలో సీక్రెటుగా పరిశోధించాలి. ఏ మాత్రం అనుమానం కలగని రీతిలో."

"తప్పకుండా రవీంద్రా....ఐ విల్ డూ మై లెవెల్ బెస్ట్! జైరామ్ కనుక నేరస్థుడయితే వాళ్ళ నాన్న ఎంత గొప్పవాడయినా సరే ఐ డోంట్ కేర్. త్వరలోనే యీ దొంగతనం కేసు విడిపోతుంది" అన్నాడు కృత నిశ్చయంతో.

అప్పుడే జైరాంమీద ట్రాప్ రూపొందించబడింది.

ఓ వ్యక్తిని యీ పనికి నియమించాడు.

అతను జైరామ్‌ను నీడలా అనుసరించటం మొదలు పెట్టాడు.

8

బేరర్ వచ్చాడు.

"విస్కీ, ఐస్ క్యూబ్స్" చెప్పాడు జైరామ్.

"గ్రీన్‌పీస్ చెప్పమంటారా?"

"గ్రీన్‌పీస్ వద్దయ్యా!....డేవిడ్! ఏం తీసుకుంటావ్?....సరే, రెండు ప్లేట్లు చిల్లీ చికెన్" అన్నాడు జానీ.

బేరర్ వెళ్ళిపోయాడు.

"డేవిడ్ సూరిగాడు గొడవ చేశాడు...." అన్నాడు జైరామ్.

"ఎప్పుడు?"

"ఇంతకుముందే,"

"ఏమిటి మరి?"

"వాడికి వెంటనే డబ్బు కట్టాలి."

"ఏ మాత్రం?"

"ఇరవై వేలు."

"మైగాడ్."

"అంత మొత్తం నేను తీసుకోలేదు. వడ్డీతో అయిందిలే! అయినా అవన్నీ నేను అనుభవించానా? అందరూ తాగారు....తిన్నారు."

"అదిసరే! యిప్పుడెవరు కట్టాలి నువ్వు తప్పితే" అన్నాడు జానీ.

బేరర్ వచ్చాడు.

టేబుల్‌మీద అన్నీ సర్ది వెళ్ళాడు.

"ఛీర్స్!"

"అదికాదు దేవిడ్! నా దగ్గిర క్యాష్ అయిపోవచ్చింది. మనం ఆ గోల్డ్‌ని అమ్మితేగానీ కొంతవరకూ బయట పడం" అన్నాడు.

"ఈ ఊర్లో అది కష్టం. ఇంకెక్కడన్నా చేయాలంటే మనకు సరయిన ధర పలకదు."

"ఎంతో కొంత రానీ. ముందది డిస్పోజ్ చేద్దాం" అన్నాడు జైరామ్.

"అదెంత వస్తుంది జైరామ్ పదిహేనువేలు."

"భలేవాడివే. మా ఇంటి దగ్గిర మొత్తం ముప్పైదాకా పోయిందనుకుంటున్నారు."

బేరర్ చిల్లీ చికెన్ తెచ్చాడు.

"కొంచెం మెల్లగా మాట్లాడండి" జానీ లో గొంతుకలో హెచ్చరించాడు.

"అఫ్‌కోర్స్" జైరామ్ సిప్ చేశాడు.

"సెకండ్ హాండ్ సెకండ్ హాండే. ఇప్పుడా రేటు రాదు—"

"గోల్డు విషయంలో అంత తేడా ఉండదు. ఏది ఏమైనా మనం రేపు వెళ్ళి క్యాష్ చేద్దాం" అన్నాడు జైరామ్.

"నువ్వు క్యాష్ ఉన్నప్పుడే కొంత ఎడ్జస్టు చేయాల్సింది" అన్నాడు దేవిడ్.

"మరి రోజూ బార్‌లో బిల్లు ఎలా కట్టడం."

"జైరామ్—ఈ విషయంలో నీదే బాధ్యత. నువ్వు రమ్మంటున్నావ్. మేం వస్తున్నాం. అంతేగాని మాకుగా మేం యీ పార్టీలు కోరలేదు" అన్నాడు దేవిడ్.

జైరామ్ భృకుటి ముడిపడింది.

"దేవిడ్ కొత్తగా మాట్లాడుతున్నావ్."

"కొత్తేముంది జైరామ్. నీ అనవసరపు ఖర్చులన్నింటికీ మాది బాధ్యత కాదు."

"కానీ ఇంతకాలం మీరు నాతోపాటు అనుభవిస్తున్నారు."

"అవును. నీ సంతోషం కోసం."

"మరి ఇప్పుడేమయింది?"

"నీ లెక్క ప్రకారం ఓ లక్షదాకా అప్పులుంటాయేమో."

"అయితే."

"అవన్నీ చెల్లించటంలో మేం భాగం పంచుకోలేం."

జైరామ్ సిగరెట్ వెలిగించాడు.

"రబ్బిష్‌గా మాట్లాడుతున్నావ్ డేవిడ్. నేను నా బాకీలు చెల్లించమని మిమ్మల్ని అడగలేదు."

"కానీ నీ ధోరణి అలానే వుంది."

"ఇప్పుడు నేనేమన్నాను."

"నువ్వు గోల్డు విషయంలో పూర్తి అధికారంతో మాట్లాడుతున్నావు."

"నువ్వలా ఎందుకంటున్నావ్" ఆవేశాన్ని దాచుకొని అన్నాడు.

"అది అమ్మి బాకీలు తీర్చుతానంటున్నావ్. మరి మా విషయం ఏమిటి?"

"అప్పుగా ఇవ్వొచ్చుకదా!"

"నువ్వలా అనలేదు. పైగా బాకీలు ఉంది నీకొక్కడికే కాదు."

జైరామ్ కొంచెంసేపు నిశ్శబ్దంగా తాగుతుండిపోయాడు.

అతనికిప్పుడు సూరి, డేవిడ్, జానీ కన్పిస్తున్నారు.

పరిస్థితులు మారిపోతున్నాయి. అంతా తనకి వ్యతిరేకంగా జరుగుతుంది.

"సరే అయితే మొత్తంలో వాటాలువేద్దాం. అంగీకరిస్తావా?"

"ఆనందంగా. క్యాష్ మొత్తం నువ్వే తీసుకున్నావ్. గోల్డును వాల్యూకడితే నీ వాటాకు మరో రెండువేలు వస్తుంది. అది రెండు రోజుల్లో ఇస్తాను."

"అంటే గోల్డు అమ్మరా."

"ఆ రిస్క్ తీసుకోవటం నాకిష్టంలేదు."

"చాలా సంతోషం" అన్నాడు జైరామ్.

అక్కడ వాతావరణం వేడెక్కింది.

"నేను మోసపోయాను" అన్నాడు జైరామ్.

"ఏం మోసపోయావు. ప్రాణాలకు తెగించింది మేం. కానీ పూర్తిగా నువ్వు వాడుకోవాలంటే మేం అంగీకరించం. నీ అప్పులు తీర్చుకోవటానికి మరో మార్గం ఆలోచించాలి."

"సరే. నేను ఇబ్బందుల్లో ఉన్నాను. యీసారికి ఆ గోల్డు నాకివ్వండి. యీసారి మరో అద్భుతమైన ప్లాన్ వేద్దాం. అందులో అంతా మీ ఇష్టప్రకారమే జరుగుతుంది."

"సారీ జైరామ్....ఈ నాలుగురోజుల్లో పోయిందేం లేదు. నువ్వేదైనా ప్లాన్ ఆలోచించు ఈసారి భారీగా ఉండాలి."

జైరామ్ మాట్లాడలేదు.

"బేరర్" పిలిచాడు.

"బిల్ పట్రా" చెప్పాడు.

9

గదిలో సీలింగ్ ఫ్యాన్ తిరుగుతూంది.

నిద్రరాక పొర్లుతున్నాడు. దేవిడ్ ఎంత మోసం చేశాడు. ఇప్పుడు తేలుకుట్టిన దొంగ పరిస్థితి అయింది తనది. ఎవరికి చెప్పుకోగలడు యీ విషయాన్ని.

ఇంతకు ముందు దొంగతనం చేశామంటే అందుకు అన్ని పరిస్థితులూ సహకరించాయి. అసలిదంతా యధాలాపంగా జరిగింది. తను డాబామీద తిరుగుతుంటే బట్టల షాపులో మనుషులు కనపడుతుండేవారు. వారికేసి చూస్తుండేవాడు సరదాగా.

అప్పుడే గమనించాడు. వాళ్ళు వ్యాపారం చేయాలనే ఆరాటం కలిగున్నారు తప్పించి, మిగతా విషయాలమీద జాగ్రత్తగా ఉండటంలేదని. వాళ్ళ గురించి ఆరా తీస్తే ఏ ఏ రోజుల్లో వ్యాపారం వుంటుందో, ఎప్పుడు కలెక్షన్ ఉంటుందో గ్రహించాక తను ప్లాన్ రూపొందించాడు.

అందుకు సహకారంగా ఎన్నుకున్నాడు దేవిడ్, జానీలని. తను బయట నిలబడ్డాడు. లోపలకు వెళ్ళి వాళ్ళు నగలూ డబ్బు తీసుకుని పారిపోయారు. అప్పటిదాకా బ్రౌనీ ఒకటి రెండుసార్లు వచ్చినా తనను గుర్తుపట్టి కాళ్ళు నాకింది తోక ఊపుతూ....

వాళ్ళు వెళ్ళాక తనూ వెళ్ళి పడుకున్నాడు. పదకొండు గంటలకే ఆ ప్రాంతంలో అందరూ తలుపులు మూసుకుని పడుకుంటారు.

తర్వాత రోజు తనకు క్యాష్ అందించారు. అప్పుడే కొంతవరకూ బాకీలు తీర్చినా బాగుండేది. తిరిగి కోరికలు

తలెత్తాయి. వాటితో జల్సాగా ఖర్చుచేయటం ఆరంభిం చాడు.

కాపీ డేవిడ్ ఇలా చేయగలడని ఊహించలేదు. చూస్తుండగానే అక్షరూపాయల బాకీలు చేశాడు తను. అవి తీర్చటం ఎలా? తిరిగి మరో దొంగతనం....దోపిడి.... ఎలా చేయటం....అందులోనూ వీళ్ళని నమ్మి....

ఆలోచనలు... తలుచుకుంటే దుఃఖం, కసి....సాయం కాలం కల్లా తాగాలనిపిస్తుంది .... గంజాయితో నింపిన సిగరెట్లు బాగా అలవాటయ్యాయి. డాడీ డబ్బు ఇవ్వడు. ముందుగా....నాన్న గదిలోని ఇనప్పెట్టెలో తీస్తే....

మదిలో ఓ ఫ్లాష్....

అవును. అదే చెయ్యాలి....ఎవరి సహాయం లేకుండా ఎవరికీ వాటా ఇవ్వకుండా!

ఈ ఆలోచన కలగగానే జైరామ్ మదిలో రగులుతున్న అగ్నిపర్వతం చల్లబడింది.

క్రమంగా అతను నిద్రలోకి జారిపోయాడు.

10

ఉదయం ఎనిమిది గంటలు.

'జైరామ్' ఇంకా నిద్రపోతున్నాడు.

జైరామ్ గది వెలుపల—

"మీ 'జైరామ్'ను అరెస్ట్ చేయటానికొచ్చాం" తాపీగా అన్నాడు ఎస్.ఐ. వారంట్ చూపిస్తూ.

"ఎ....ఎందుకు?" అన్నాడు జైరామ్ తండ్రి అర్థం కాక.

"ఈ వీధిలో జరిగిన దొంగతనంలో ప్రధాన నిందితుడు అతడు—"

"ఆధారం ఏమిటి?"

"ఈ దొంగతనంలో పాల్గొన్న డేవిడ్. జానీల సాక్ష్యం!"

"నాకు అర్థం కావటంలేదు"

"మీకు దిగ్భ్రాంతిని కలిగించే కొన్ని విషయాలు వెల్లడిస్తున్నాను. మీ 'జైరామ్'కు పట్టణంలో దాదాపు లక్ష రూపాయల దాకా బాకీలున్నాయి. ఈ నడుమ కాలంలో దాదాపు రెండువేలపై చిలుకు బార్‌లో చెల్లించాడు. ఈ డబ్బు మీరు ఇవ్వలేదు కదా?"

"నో"

"అతను అప్పులబాధల్ని తట్టుకోలేక, తన అలవాట్లకు డబ్బులేక ఈ పనికి పూనుకున్నాడు. అతనికి ఇద్దరు సహకరించారు. వీళ్ళను అనుసరించిన మా మనిషి సూచన మేరకు డేవిడ్, జానీల ఇళ్ళమీద దాడిచేశాం. బంగారం దొరికింది. అంతేకాదు. ఆ దొంగల్ని గుర్తుపట్టింది రవీంద్ర తల్లి."

జైరామ్ తండ్రి తలవంచుకున్నాడు.

"అరెస్ట్ దట్ ఫెలో ఇన్‌స్పెక్టర్. వాడు జైల్లోనయినా బాగుపడతాడేమో" అన్నాడాయన బాధగా.

కలల్లో తేలుతున్న జైరామ్‌కు నిద్రాభంగం కలిగింది.

తనకేసి ఆగ్రహంతో చూస్తున్నాడు డాడీ....

ఆ తర్వాత కనిపించింది .... చిరునవ్వుతో నిలబడ్డ యస్.ఐ. వదనం!

* * *

"పిన్నీ స్వీట్స్" పరిగెత్తికొచ్చాడు నిరూప్.

నిరూప్ చేతిలో రెండు పేకెట్స్ ఉన్నాయి.

"నాకు రెండు జతల బట్టలు ఆంటీ ప్రెజెంట్ చేశారు. అంకుల్ మాత్రం రెండు బుక్స్ ప్రజెంట్ చేశారు."

"మొత్తంమీద నీ అపరాధ పరిశోధన సాహిత్యం నీకు మేలే చేసింది" అంది కవిత.

"అంతేకాదు పిన్నీ.... ఈ కేసులో థ్యాంక్స్ చెప్పా ల్సింది బ్రౌనీకి."

"అవునవును"

"దానికి సామాజిక స్పృహ సైతం ఉంది"

"అవును మరి.... పోలీసుల్ని చూచి అది మొరిగిం దంటే అది మామూలు కుక్క కాదు!"

బిగ్గరగా నవ్వింది కవిత. శృతి కలిపాడు నిరూప్. □

క్రికెట్ తెచ్చిన కష్టం!



సీరియల్



వసుంధర

(గత సంచిక తరువాయి)

సెక్రటరీ మాట్లాడలేదు.

"ఈ సందేహం నీకేనా? నీకు తెలిసిన మరింకెవరికైనా కలిగిందా?"

"నాకు తెలిసి మీ అబ్బాయి పేరు శ్రావణ్ అన్న విషయం గుర్తున్నవారింకెవ్వరూ లేరు...."

"కానీ తెలిసినవాళ్ళెవ్వరో ఉన్నారు. వాళ్ళ పేరుని ఇప్పటి అంతర్జాతీయ స్మగ్లరుకి ముడిపెట్టి - నన్నందులో ఇరికించాలని చూస్తున్నారు. వాళ్ళు నా ఆంతరంగికులై ఉండాలని నా అనుమానం...."

"ఎవరై ఉంటారో ఊహించలేరా?"

"ఎలా చెప్పను? ఈ విషయం నీకు తప్ప ఇంకెవరికీ తెలియదని నువ్వే అంటున్నావ్...."

సెక్రటరీ ఉలిక్కిపడి - "సర్- మీరు నన్ననుమానిస్తున్నారా?" అన్నాడు.

నాయుడతడి కళ్ళలో భయాన్ని స్పష్టంగా చదువుతూ- "నువ్వు బ్రతికున్నంతకాలం నేను నిన్ననుమానించనట్లే లెక్క...." అన్నాడు.

"నిజంగా నాకేమీ తెలియదు సార్...."

"సెక్రటరీ - తప్పు చేయనంతకాలం నువ్వు నాకు సంజాయిషీ యిచ్చుకోనవసరంలేదు. సంజాయిషీ యిచ్చుకుంటే నువ్వే తప్పుచేశావని నా కనిపిస్తుంది...."

సెక్రటరీ ఏదో అనబోయి ఆగిపోయాడు.

"మరో విషయం - రేపు ఇనస్పెక్టర్ మిమికి ఫోన్ చేస్తే శ్రావణ్ గురించి నాకేమీ తెలియదనీ - నేనామెతో మాట్లాడ్డానికి నిరాకరించాననీ చెప్పు...."

"కానీ....ఆమె మీ చరిత్ర బైట పెడతానని."

సెక్రటరీ నసుగుతూంటే నాయుడు గది అదిరిపోయేలా నవ్వి "మై డియర్ సెక్రటరీ! నా చరిత్ర బైటపెట్టాలనుకున్న వాళ్ళెవ్వరికీ ఆ తర్వాత చరిత్ర ఉండదు...." అన్నాడు.

ఈ మాటలని ఓ నిముషమాగి నాయుడు మళ్ళీనవ్వాడు.

24

అది చిన్న డాబా యిల్లు. ఇంటిచుట్టూ పూలతోట.

ఆ యింట్లో ఓ గదిలో ఉన్నాడు సెక్రటరీ.

ఎదురుగా ఆయన భార్య అన్నపూర్ణ ఉంది.

"ఎందుకండీ - దిగులుగా ఉన్నారు!" అందామె.

"దిగులుగా ఉండడానికి కారణమేమైనా ఉందంటావా?"

"అబ్బాయి లిద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. అల్లుడు కూడా మంచి హోదాలో ఉన్నాడు. మనం వాళ్ళకింత పెట్టేలాగున్నాం తప్ప - వాళ్ళనుంచి పైసా ఆశించం. మీరేమో ఇంకా ఎంతో బాగా సంపాదిస్తున్నారు." అంది అన్నపూర్ణ.

"పూర్ణా! మనమో చిన్న పెంకుటింట్లో ఉండేవాళ్ళం. గుర్తుందా?"

అన్నపూర్ణ గుర్తుచేసుకుంది.

పాత పెంకుటిల్లది. అందులో అద్దెకుండేవారు వాళ్ళు. రఘుపతినాయుడు సెక్రటరీతో — "నా సెక్రటరీ పెంకు టింట్లో ఉండకూడదు. అద్దె యింట్లో అసలే ఉండ కూడదు. నీకోసం కొత్తిల్లు కట్టిస్తాను. అది నీ స్వంతం. బాకీ తీరేదాకా వాయిదాలు అద్దె రూపంలో కడుదువు గాని—" అన్నాడు. అయిదేళ్ళలోనే ఓ కొత్తిల్లు సెక్రటరీ స్వంతమైంది.

"అంతా నాయుడిగారి చలవ—...." అంది అన్నపూర్ణ.

"అబ్బాయిల ఉద్యోగం గురించి గుర్తుందా?" అన్నాడు సెక్రటరీ మళ్ళీ.

అన్నపూర్ణ అదెలా మర్చిపోగలదు? ఇద్దర్నీ ఓ ప్రయివేటు కంపెనీలో గుమాస్తాలుగా ప్రవేశపెట్టాడు సెక్రటరీ. ఇద్దరిలో పెద్దవాడు—ఏదో విషయంలో కంపెనీ మేనేజరుతో గొడవపడ్డాడు. దాంతో అన్నదమ్ము లిద్దరి ఉద్యోగాలూ ఊడిపోయాయి.

వేరే దారిలేక సెక్రటరీ నాయుడికి చెప్పుకున్నాడు.

"నా సెక్రటరీ కొడుకు ల్నుద్యోగంలోంచి పీకేస్తాడా . వాడెవడు!" అన్నాడు నాయుడు కోపంగా!

అంతే! ఆ మేనేజ రుద్యోగం ఊడింది. సెక్రటరీ కొడుకు లిద్దరికీ ఆ కంపెనీలో గుమాస్తా ఉద్యోగానికి బదులు ఆఫీసర్ పోస్టు లొచ్చాయి.

"నా దగ్గిర సెక్రటరీగా ఉంటూ—బియ్యే చదువుకున్న పిల్లల్ని గుమాస్తాల్ని చేయాలనుకున్నావా? ఇంకెప్పుడూ ఇలాంటి పన్లు చేయకు—" అంటూ నాయుడు సెక్రటరీని మందలించాడు.

"నాయుడుగారు దేవుడు. అమ్మాయి పెళ్ళికి కట్నమెలా

తేవాలా అనుకుంటూంటే ఓ మంచి ఉద్యోగస్థుణ్ణి తనే మనకు చూసిపెట్టాడు. కానీ కట్నం లేకుండా పెళ్ళై పోయింది. నాయుడిగారి సెక్రటరీ కావడంవల్ల వియ్యాల వారు మన పిల్లని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు...." అంది అన్నపూర్ణ.

అది నిజం.

సెక్రటరీ తన అసలు పేరేమిటో తనే మర్చిపోయాడు. భార్య అతణ్ణి సెక్రటరీగా రంటుంది. మిగతా వారు సెక్రటరీగారంటారు. బాగా ఎరిగున్న స్నేహితులు ఏరోయ్ సెక్రటరీ—అంటారు. ఆఖరికాయనకొచ్చే ఉత్తరాలమీద కూడా సెక్రటరీ టూ రఘుపతినాయుడు—అని ఉంటుందద్రస్!

అసలు పేరేదైనా సెక్రటరీ పేరే ఆయనకు స్థిరపడింది.

"నిజం పూర్ణా! నాయుడుగారు ఎవరూ యివ్వనంత జీతమిస్తున్నాడు. నా బ్రతుకంతా—ఆయనకు సెక్రటరీ కావడంలోనే ఉంది...."

"ఇదంతా యెందుకు చెబుతున్నారు?"

"ఇప్పుడు నాయుడుగారికి చెడ్డ రోజులు వచ్చాయి....—"

"బంగారం నల్లబడుతుందా? నాయుడుగారికి చెడ్డరోజు లుంటాయా?" అంది అన్నపూర్ణ ఆశ్చర్యంగా.

"మిస్ మిస్టరీ పేరుతో ఒకామె ఆయన్ను సాధిస్తోంది. ఆమె ఆయన శక్తికీ, ఊహకూ కూడా అందడంలేదు. ఈ పరిస్థితిల్లో ఆయన అయినవాళ్ళను కూడా నమ్మలేకుండా ఉన్నాడు ఆఖరికి నన్ను కూడా...."

"మిమ్మల్ని కూడానా?" ఆశ్చర్యంగా అడిగింది అన్న

పూర్ణ.

"అవును పూర్ణా! నీకు నాయుడుగారి మంచితనం తెలుసుకదా! ఆ మంచితనంతో ఆయన మంచివాళ్ళతో పాటు చెడ్డవాళ్ళనీ కాపాడాడు. అలా కాపాడబడినవాళ్ళలో శ్రావణ్ అనే కుర్రాడున్నాడు. ఆ శ్రావణ్ వివరాలు చెప్ప మని మిస్ మిస్టరీ ఆయన్ని వేధిస్తోంది. శ్రావణ్ వివరా లాయనకూ తెలియవు. ఆయన మాటలు మిస్ మిస్టరీ నమ్మలేదు. ఆయనకు ఇరవైనాలుగ్గంటలు టైమిచ్చింది. ఆయన లెక్కచేయలేదు. ఇరవైనాలుగ్గంటల తర్వాత ఆయనకో ఫోనొచ్చింది. అది నేనే రిసీవ్ చేసుకున్నాను. తను శ్రావణ్‌ని హత్య చేశాననీ అతడి శవం నటరాజ్ హోటల్లో ముప్పైమూడో నెంబరు గదిలో ఉన్నదనీ మిస్ మిస్టరీ ఫోన్‌లో చెప్పింది. ఇది తెలిసి నాయుడుగా రప్సె ట్టయ్యాడు. భార్య ఏడుస్తూ కూర్చుంది— ...."

"అతడెవరో పోతే ఆమెందుకూ ఏడవడం?"

"అదే నాకూ తెలియలేదు. అడగడానికి నేను మొహ మాటపడ్డాను. కానీ ఓ గంట పోయాక అసలు విషయం తెలిసింది. చనిపోయింది శ్రావణ్ కాదుట...."

"ఎలా తెలుసు?"

"ఏమో—యెవరి పద్ధతులు వారి కుంటాయి. ఆమె ఏడ్వడానికి కారణ మేమిటంటే—శ్రావణ్‌ని చంపాలను కుని ఆ మిస్ మిస్టరీ యింకా యెంతమందిని చంపుతుందో నని!"

"ఎంత విశాల హృదయం? అందుకే వాళ్ళు గొప్పవా ళ్ళయ్యారు?"

"ఇంతకీ మిస్ మిస్టరీ యెవరినో శ్రావణ్ అనుకుని

ఎందుకు పొరబడిందో తెలుసా?"

"చెప్పండి—"

"శ్రావణ్‌పై ఓ దెయ్యం పగబట్టిందని కథ సృష్టించి తాయెత్తు కట్టించుకోవాలన్న భావం అతడిలో కలిగించింది. అందుకు మరిడయ్యనేవాడు నియోగించబడ్డాడు. ఆ మరిడయ్యను మిస్ మిస్టరీ అనుసరించి వెళ్ళింది. శ్రావణ్ యెవరో మిస్ మిస్టరీకి తెలియదు. మిస్ మిస్టరీ యెవరో శ్రావణ్‌కి తెలియదు. మరిడయ్య ద్వారా ఒకరినొకరు తెలుసుకోవాలని ప్రయత్నించారు. కానీ యిద్దరి ప్రయత్నాలూ ఫలించలేదు...."

"మీరు చెప్పుతున్నదంతా కథలా ఉంది వినడానికి—"

"అసలేం జరిగిందంటే మరిడయ్య మంత్రగాడు. అతగాణ్ణి శ్రావణ్ రహస్యంగా నటరాజ్ హోటల్లో ముప్పై మూడో నెంబరు గదిలో కలుసుకుంటానన్నాడు. ఆ ప్రకారమే మరిడయ్య అక్కడికి వెళ్ళాడు. అయితే అక్కడతణ్ణి కలుసుకొన్న వ్యక్తి శ్రావణ్ కాదు....—"

"మరెవరు?...." కుతూహలంగా అడిగింది అన్నపూర్ణ.

"శ్రావణ్ మనిషి — తాయెత్తుని కట్టాల్సిన పద్ధతిని మరిడయ్య నడిగి తెలుసుకుని తాయెత్తుతీసుకుని మరిడయ్యనక్కడే ఉండమని పక్కగదికి వెళ్ళాడు. గదిలోంచి మరో గదిలోకి వెళ్ళడాని కేర్పాటయింది. కాసేపట్లో వెనక్కు తిరిగొచ్చి మరిడయ్యను రకరకాల ప్రశ్నలు వేశాడు. పనికొచ్చే సమాచారం లభించలేదు. అప్పుడతడు మరిడయ్యతో — "నేను శ్రావణ్‌ని కాను. నువ్వు

శ్రావణ్‌ని తెలుసుకుందుకు నియోగించబడితే నీ ప్రయత్నం వృథా అయింది. ఈ గదిలోంచి వరుసగా వెళ్ళడానికి పక్కన పది గదుల్లో ఏర్పాట్లున్నాయి. ఆ పది గదులూ శ్రావణ్ బుక్ చేశాడు. వాటిలో ఏ గదిలో శ్రావణ్ ఉన్నాడో బ్రహ్మరుద్రుల క్కూడా తెలియదు. ఈ పాటికి శ్రావణ్ హోటలు వదిలివెళ్ళిపోయినా ఆశ్చర్యం లేదు.... అన్నాడు—....''

''అప్పుడేం జరిగింది?''

''మరిడయ్య తనకేమీ తెలియదని మరోమారు చెప్తుకుని—దెయ్యం నిజంగా వుందనీ శ్రావణ్ ఆ తాయెత్తు కట్టుకుని తీరాలనీ చెప్పాడు. ఆ గదిలోని యువకుడతడితో తాయెత్తునుబట్టి శ్రావణ్‌ను గుర్తుపట్టాలని ఎవరైనా అనుకుంటే పొరబడినట్లే—యీ ఊళ్ళో కనీసం మరో పదిమంది యువకులకా తాయెత్తులుండే ఏర్పాట్లు జరుగుతున్నాయి—అన్నాడు—''

''ఊఁ.''

''ఆ తర్వాత మరిడయ్య వెళ్ళిపోయాడు. ఈ రోజు హోటల్ నటరాజ్‌లో చనిపోయిన మనిషి చేతికి తాయెత్తుంది....''

''అంటే అతడే శ్రావణ్ అనుకుని మిస్ మిష్టరీ చంపేసిందా?''

''అనే అనుకోవాలి. ఇలాంటి శ్రావణ్‌లింకా చాలా మందుంటారు. అసలు శ్రావణ్ అంత సులభంగా బయట పడడు కాబట్టింకా యెంతమంది చావాల్సిందో....యీ శ్రావణ్ బయటపడకపోవడంవల్ల నాయుడుగారికీ-తద్వారా మనకికూడా చెడ్డరోజులు....'' అన్నాడు సెక్రటరీ.

''శ్రావణ్....శ్రావణ్ అంటూంటే నాకు గుర్తుకొ

చ్చింది. యీ వీధిలో ఆంజనేయులుగారింట్లో ఓ జంట దిగారు. అతడి పేరు శ్రావణ్....ఆమె పేరు సంధ్య."

"శ్రావణ్ పేరింకెవరికీ ఉండకూడదని లేదుగా— ఎందరో శ్రావణ్‌లుండవచ్చు—" అన్నాడు సెక్రటరీ.

"అలాకాదండీ – ఆ జంట వ్యవహారం నాకనుమానం గానే వుంది. ఆ సంధ్య యెప్పుడూ బయటకు రాదు. అతడినప్పుడప్పుడు చూశాను. కుర్రాడు చూడ్డానికి బుద్ధిమంతుడిలాగుంటాడు. యీ జంట యింట్లో దిగేక ఆంజనేయులుగారి భార్య పార్వతి నలుగురితోనూ కలవడం మానేసి ఇంట్లోనే ఉంటోంది. ఎవరైనా తనింటికొచ్చినా బెదురు బెదురుగా ఉంటోంది. అడిగితే ఏమీ చెప్పదు. కానీ యేదో ఉందనే చాలామంది అనుమానం."

"ఆ శ్రావణ్ చేతికి తాయెత్తుగానీ ఉందా?"

"ఏమో—ఆ విషయం తెలియదు. కానీ తెలుసుకోవడం పెద్దకష్టంకాదు—"

"అయితే వెంటనే అది తెలుసుకో. అప్పుడు నేనీ విషయం నాయుడిగారికి చెబుతాను" అన్నాడు సెక్రటరీ.

25

కుమారస్వామి యింటి వెనుక పెద్ద పూలతోట ఉంది. ఆ తోట మధ్యలో చిన్న కుటీరముంది. అన్ని కాలాల్లోనూ ఆ కుటీరంలోని వాతావరణం సమశీతలంగా ఉంటుంది. ప్రముఖులతో సమావేశాలన్నీ కుమారస్వామి అక్కడే యేర్పాటు చేస్తాడు.

ఇప్పుడా కుటీరంలో ఒకరికొకరెదురుగా కూర్చుని ఉన్నారు కుమారస్వామి, ఛోటేలాల్.

ఛోటేలాల్ హైదరాబాదునుంచి వచ్చాడు.

ఆరడుగుల విగ్రహమతడిది. వళ్ళు పచ్చగా ఉంది.

అక్టోబర్ విడుదలైంది!

ఈ నాగరికతా, కాంక్రీట్ కీకారణ్యంలో,
యంత్రంలా మారిపోతున్న మనిషికి
ఒక వెన్నుచరుపు!

ఆంధ్రుల అభిమాన రచయిత్రి,

యద్దనపూడి సులోచనరాణి

వినూత్న డైరెక్ట్ నవల

నిశాంత

మిమ్మల్ని నిలదీస్తుంది! ప్రశ్నిస్తుంది!
ఆలోచింపచేస్తుంది!

ఫోన్ నెం: 633 22

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్,
విజయవాడ - 2.

కళ్ళు మాత్రం ఎర్రగా ఉన్నాయి.

అతడి వయసు నలభై అయిదుండవచ్చు. తెలుగు స్పష్టంగానే మాట్లాడినా ఉచ్ఛారణలో యాస ఉంది.

"శంకరనారాయణ నెందుకు చంపావ్?" అన్నాడతడు.

"అతణ్ని నేనెందుకు చంపుతాను?"

"ఎందుకంటే అతణ్ణించి నీకు యాభై లక్షలందాయి. మొత్తం అయిదు ఫిల్ములు తయారుచేసి పంపాలి నువ్వు ఒక్కటికూడా అతడికందలేదు....అన్నసైము పాటించ లేకుంటే రెట్టింపు ఫైనుకట్టాలి. ఫైను కట్టే బదులు మొత్తం డబ్బు కాజేయాలన్న దురుద్దేశ్యంతో నువ్వు శంకరనారాయణ నంతం చేశావు. శంకరనారాయణ అంతమైనా నీ సమస్య తీరిందనుకోక. ఇప్పుడు నేను న్నాను. నాకేమైనా అయితే నీ అంతం చూడ్డానికింకో అయిదుగురున్నారు" అన్నాడు ఛోటేలాల్.

"అంతం గురించిప్పుడెందుకూ మాట్లాడ్డం? నేను నిర్దోషిని. ఫిల్ముతీయడం ఆలస్యమైంది. ఆ కబురు చెప్పే లోగానే శంకరనారాయణ చచ్చిపోయాడు."

"చావలేదు - చంపబడ్డాడు."

"అవును. కానీ చంపిందెవరో నాకు తెలియదు."

ఛోటేలాల్ నవ్వి — "ఫిల్ముతీయడం ఆలస్యమెందు కయింది?" అన్నాడు.

"నాక్కావలసింది అమాయకమైన ఆడపిల్ల. పురుష స్పర్శ నెరుగని ఆడపిల్ల. అలాంటివాళ్ళ నన్వేషించడం ఒక ఎత్తు. వాళ్ళతో ఫిల్మ్ అరేంజ్ చేయడమింకో ఎత్తు. నా శక్తి సామర్థ్యాలు తెలిసినవాడు కాబట్టి శంకరనారా యణ నాకీ పని అప్పజెప్పాడు. యీ కంట్రాక్టు నాకా

అపరాధ పరిశోధన పోటీ-233

ఈ క్రిందకొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1-00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-12-'87 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఫిబ్రవరి'88 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న శ్రీమతి సరోజ్‌వర్మ భారత మాజీ ప్రధాని కూతురు—?
   (చరణ్‌సింగ్, మొరార్జీదేశాయ్)
2. భారత రక్షణ దళాలు ప్రస్తుతం తీవ్రవాదులతో పోరాటం సాగిస్తున్నవి—? (శ్రీలంకలో, పంజాబ్‌లో)
3. ఈ జిల్లాలో అనావృష్టి తీవ్రంగా వుంది—?
   (శ్రీకాకుళం, ఆదిలాబాదు)
4. 'రిలయన్స్ కప్ 87' పోటీలో ఘోర పరాజయం పొందిన దేశం—? (వెస్టిండీస్, శ్రీలంక)
5. రాష్ట్రప్రగతిని దెబ్బతీస్తున్నది—?
   (కరెంట్ కోత, ప్రభుత్వ విధానాలు)

చ్చిందని ఏడుస్తున్న వారెందరో ఉన్నారు. నాకూ శంకర నారాయణకూ చెడగొట్టాలని కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఫిల్ముతీయడానికి నేను చేసిన ప్రయత్నాలు వాళ్ళవల్ల భంగమయ్యాయి-" అన్నాడు కుమారస్వామి.

"వాళ్ళనేమి చేయలేక శంకరనారాయణనుచంపేశావా?"

"శంకర నారాయణ నాకంటే సమర్థుడు. నావంటి వాళ్ళెందరో అతడికి పలురకాల పనులు చేస్తున్నారు. అతణ్ని చంపడం నావల్లయ్యే పనికాదు."

ఛోటేలాల్ నవ్వి—"నీ బలం క్రమంగా పెరిగింది. నువ్విప్పుడు చాపకింద నీరులాంటి వాడివి. కల్లబొల్లి కబుర్లతో నన్ను నమ్మించాలని చూడకు" అన్నాడు.

"నమ్మించడానికి నేనేం చేయాలి?"

"శంకరనారాయణ నీకిచ్చిన యాభైలక్షలూ తిరిగిచ్చేయ్. వడ్డీగా అయిదు ఫిల్ములు తీసియ్యి.ఆ ఫిల్ములకు నేను డబ్బివ్వను...." అన్నాడు ఛోటేలాల్.

"ఇది చాలా అన్యాయం" అన్నాడు కుమారస్వామి.

"అన్యాయం నీది—నేనడుగుతున్నది అన్యాయానికి బదులు...."

"నెల్లాళ్ళ గడువు కావాలి నాకు. అయిదు ఫిల్ములూ తయారుచేసిస్తాను."

"శంకరనారాయణ డబ్బు మాటేమిటి?"

"ఆ డబ్బుకే నీకు ఫిల్ము తయారుచేసిస్తాను. నిన్నిక వేరేడబ్బడగను...."

"డబ్బు, ఫిల్ము—రెండూ కావాలి నాకు...."

కుమారస్వామి కుర్చీలో వెనక్కు వాలి—"నావల్ల కాదు...." అన్నాడు.

"చాలా ధైర్యం వచ్చింది నీకు. పిల్లిపిల్ల పులిలా

మావద్ద ప్రముఖ రచయిత[త్రు]ల

సాంఘిక నవలలు డిటెక్టివ్ రచనలు,

బాలసాహిత్యం, హిందీ, ఇంగ్లీషు నవలలు,

పురాణేతిహాసగ్రంధములు హోల్‌సేల్

మరియు

రిటైల్‌గా ఆకర్షణీయమైన కమీషన్ పై

లభించును

[illegible] పుస్తకములు
[illegible] లు విద్యార్థు
[illegible] ములు
[illegible]

నేడే సందర్శించండి

శ్రీ గణేశ్ బుక్ హౌస్

[illegible] మార్కెట్ వద్ద
మెయిన్ రోడ్, రాజమండ్రి
Ph No 3444

మాట్లాడుతోంది....”

“ఎప్పటికీ నేను మీముందు పిల్లిపిల్లనే! కానీ గదిలో పెట్టి నాలుగు తలుపులూ మూసేస్తే — పిల్లిపిల్లయితే మాత్రం—పులిగా మారదా?”

“నీ వినయం అతివినయం లాగుంది....”

“ఎప్పటికీ నేనుధూర్తుణ్నే-కానీ నీ విషయంలోకాదు.”

“అయితే శంకరనారాయణ నెందుకు చంపావ్? అలాంటి మనిషి మళ్ళీ మాకు దొరుకుతాడా?”

“నాకూ దొరకడు....”

“దొరక్కుండా చేసింది నువ్వు....”

“పోనీ అలాగే అనుకో” విసుగ్గా అన్నాడు కుమారస్వామి.

“విసుక్కోకు. నువ్వు శంకరనారాయణ నంతం చేసిన కంటే తేలికగా - నేను నిన్నిక్కడే నీ కుటీరంలో అంతం చేయగలను.”

కుమారస్వామి అదరలేదు - బెదరలేదు “నన్నంతం చేసిన మరుక్షణంలో మొత్తం నీ కథా, నిన్ను నడిపిస్తున్న మరో అయిదుగురి కథా బయటపడుతుంది. నీ రహస్యాలే నా రక్షణ కవచం. మరిచిపోకు....”

“నాకు తెలుసు - నీకిలాంటి ధైర్యమేదో ఉందని! అందుకే నిన్ను చంపను. నీ చరిత్ర బయిటపెడతాను.”

“చరిత్ర నీకూ నాకూ ఉన్నప్పుడు ఒకరి నొకరు నాశనం చేసుకుని లాభమేమిటి? నా మాటలు విని నన్ను నమ్ము. అపనమ్మకం నిన్నూ నన్నూ నాశనం చేసి మన శత్రువుకు సహకరిస్తుంది.”

ఛోటేలాల్ ఆలోచనలో పడ్డాడు. కుమారస్వామి అతడినే గమనిస్తున్నాడు. చివరికి ఛోటేలాల్ - “నీ షరతు

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా మరియు రెండేసి నెలలకు V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 19-60 లు, రెండేసి నెలలకు రు. 30/-లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం ఏది కావలసినా మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

నువ్వు చెప్పావు. కొంతవరకూ పాటిస్తాను. మరి నువ్వు నా షరతు కొంత పాటించాలి. అదేమిటంటే కనీసం పది లక్షలు నాకు చెల్లించడం....” అన్నాడు.

“పది లక్షలు చాలా పెద్ద మొత్తం.”

“శంకరనారాయణ ప్రాణాలామాత్రం విలువచేయవా?”

“అతడి ప్రాణాలు నేను తీయలేదు.”

ఛోటేలాల్ లేచి నిలబడి “నీకు నేను సరిగ్గా ఇరవయి నాలుగు గంటలు టైమిస్తున్నాను. ఆలోగా పది లక్షలు సిద్ధం చేసి నాకివ్వాలి. ఆ తర్వాత నెల్లాళ్ళలో అయిదు ఫిల్ములివ్వాలి. ఆలోచించుకో - అంతవరకూ నటరాజ్ హోటల్లో ముప్పైమూడో నంబర్ గదిలో ఉంటాను” అన్నాడు.

“నటరాజ్ హోటల్లో ముప్ఫయి మూడో నంబరు గదా? అందులో ఇటీవల ఓ యువకుడు హత్య చేయబడ్డాడు....” అన్నాడు కుమారస్వామి!

“నన్ను భయపెట్టకు. నేను చావాలనుకునేదాకా యమదూతలు కూడా నన్ను సమీపించలేరు. సెలవు.”

ఛోటేలాల్ బయటకు వచ్చాడు.

కుటీరం బయట ఎర్ర కారొకటి ఉంది. అతడందులో ఎక్కి డ్రయివింగ్ సీట్లో కూర్చున్నాడు.

కుమారస్వామి చేయూపి అతడికి వీడ్కోలిచ్చాడు.

ఎర్ర కారు ముందుకు కదిలింది. కుటీరం ముందు నుంచి, పూలతోటలోంచి నెమ్మదిగా ఆ కారు రాచబాటలోకి వచ్చింది.

“డియర్ మిస్టర్ ఛోటేలాల్ కారు సర్జంటుగా పక్కకి తిప్పు. నేను చెప్పిన దారిలో పోనీ. లేకుంటే నీప్రాణాలు నీకు దక్కవు” అన్నమాట లప్పుడు ఛోటేలాల్‌కు వెనుక

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-12-'87 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు ఫిబ్రవరి'88 నెల సంచికలో ప్రకటిస్తాము.

అక్టోబరు'87 పోటీ ఫలితాలు

(1) అక్టోబరు '87 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ప్రతిక్షణం ప్రాణభయం!

అనుక్షణం ప్రేమమయం!!

పంపినవారు: శ్రీ జె. శ్రీకాంత్, 2-విశ్వనాధపురం మెయిన్ రోడ్, రంగరాజపురం, మద్రాసు 600 024.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కళ్లలో కసి!

చేస్తాను మసి!!

పంపినవారు: శ్రీమతి డి. ధనలక్ష్మి, 13-16-25/1, కె.పి.రోడ్, జెడ్.పి.పి. ఆఫీస్ దగ్గర, శ్రీకాకుళం-532001.

నుంచి వినబడ్డాయి.

అతడి వీపుకు రివాల్వర్ మొన గుచ్చుకుంటోంది.

ఛోటేలాల్ ఆశ్చర్యపడ్డాడు. తనకు వినపడుతున్నది స్త్రీ గొంతు.

ఎవరామె?

ఆలోచిస్తూనే అతడు కారును పక్కకు తిప్పాడు. ఆమె చెప్పిన దారిలో పోనివ్వసాగాడు.

అలా కొంత దూరం వెళ్ళాక జనసంచారమన్నదే లేని చోటు వచ్చింది.

ఛోటేలాల్ కారును స్లో చేసి-"ఎవరునువ్వు?"అన్నాడు.

"నే నెవరో తెలుసుకోవాలంటే నువ్వు కూడా శంకర నారాయణ చేసిన పనే చేయాలి...." అందా గొంతు.

"ఏమిటది?"

"ఈ లోకం వదిలి పెట్టటడం!"

"నా కారెందు కెక్కావ్?" అన్నాడు ఛోటేలాల్ ఆమె మాటలకు చలించనివాడిలా.

"ఈ లోకానికి పాప భారం తగ్గించాలని."

"అవతారమూర్తివా?"

"కాదు - దెయ్యాన్ని...."

ఛోటేలాల్ ఆమెను మాటల్లో పెడుతూ పరిసరాలను గమనిస్తున్నాడు. చుట్టూ మనుషులు లేరని గ్రహించేక అతడు స్టీరింగ్ వీల్ లో ఓ మీట నొక్కాడు.

అంతే!

ఒక్కసారి వెనక సీట్లో కుదుపు ప్రారంభమయింది. ఆ సీట్లోని యువతి చేతిలోంచి రివాల్వర్ జారిపడింది. ముందు సీటు వెనుక నుంచీ ఆమె రెండు చేతులకూ సంకెళ్ళు వచ్చి పడ్డాయి.

అక్టోబర్ విడుదలైనవి!

కీర్తివారి సూపర్ సెన్సేషనల్ నవలలు

అన్నీ డైరెక్ట్ నవలలే!!

మరణదండన	రచన:	ఆరతీమూర్తి	రు. 22-00
మిస్టరీ	రచన:	ఉషారాణి	రు. 20-00
ప్రేమసాగరం	రచన:	శరత్ కళ	రు. 25.00
చీకట్లో చిన్నది	రచన:	శ్వేతాదేవి	రు. 20-00

వెంటనే అడ్వాన్సుతో ఆర్డర్లు పంపండి.

మా పూర్తి కేటలాగుకై వ్రాయండి.

కీర్తి పబ్లికేషన్స్

ఏలూరు రోడ్, విజయవాడ - 520 002.

"ఇప్పుడు నిన్ను నా చోటికి తీసుకుని వెడతాను. నువ్వెవరో తెలుసుకుంటాను. అవసరమనుకుంటే నిన్ను శంకరనారాయణ దగ్గిరకు పంపిస్తాను" అన్నాడతడు.

ఆమె మాట్లాడలేదు.

ఛోటేలాల్ వెనక్కి తిరిగి ఆమెను చూశాడు.

ఆమె చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంది.

ఆమె చూపుల్లో భయం, కలవరం ఈషణ్మాత్రంలేవు.

"నువ్వు దెయ్యానివి కాదు. దేవతవు. నిన్ను నా గదికి తీసుకుని వెడతాను. అక్కడ నువ్వు నాకు స్వర్గం చూపించాలి" అన్నాడు ఛోటేలాల్.

ఆమె మాట్లాడలేదు.

ఛోటేలాల్ కారును బొత్తిగా జనసంచారం లేని ఓ సందులోకి తీసుకెళ్ళి ఆపాడు. కారు దిగి వెనక్కు వెళ్ళి డిక్కీలోంచి ఓ పెట్టె తీశాడు.

నల్లటి తోలుపెట్టె అది. మామూలు సైజు వాటికంటె కాస్త పెద్దదిగా ఉంది.

ఛోటేలాల్ పెట్టెను కారు పక్కనే పెట్టి బ్యాక్ డోర్ తెరిచి - "ఈ పెట్టెను చూశావా?" అన్నాడు.

ఆమె అతడి వంకే నిశ్చలంగా చూస్తోంది.

"నేను నా గదిలోకి ఆడపిల్లల్ని తీసుకుని వెళ్ళే పద్ధతిది. ఈ పెట్టెలో అమ్మాయుంటుందని ఎవ్వరూ అనుమానించరు. అనుకోకుండా నువ్వు దొరకడం నా అదృష్టం" అంటూ తన జేబులోంచి ఓ రుమాలుతీసి బలవంతంగా ఆమె ముక్కుదగ్గిరుంచాడు. (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed, at Kranti Press, Madras-600 001.

Blank Page


Regd.no: H/HD-48
'PRABHAKAR'